


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 17

SUNDAY Special

ఆదివారం 1-10-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌కు మరో 5 పతకాలు

చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో 5 పతకాలు చేరాయి. స్క్వాష్ టీమ్ ఈవెంట్, టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లలో స్వర్ణాలు లభించగా.. షూటింగ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక రజతం దక్కింది. అథ్లెటిక్స్‌లో ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. మొత్తంగా 38 పతకాలతో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

12లో



బీసీననే నాపై ద్వేషం

విపక్షాల ఇండియా కూటమిని అహంకారుల గ్రూప్‌గా ప్రధాని మోదీ అభివర్ణించారు. బీసీననే కాంగ్రెస్‌కు తానంటే ద్వేషమన్నారు.

వివరాలు 6లో ▸



ఓ వైపు గాంధీ.. మరోవైపు గాడ్సే

వచ్చే ఎన్నికలు 2 సిద్ధాంతాల మధ్య జరిగే యుద్ధంగా.. గాంధీ, గాడ్సే మధ్య పోరుగా కాంగ్రెస్ నేత రాహుల్ అభివర్ణించారు.

వివరాలు 6లో ▸



భారత హైకమిషనర్ అడ్డగింత

స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఓ గురుద్వారాలోకి వెళ్లకుండా భారత హైకమిషనర్ విక్రమ్‌ను ఖలిస్తానీ అతివాదులు అడ్డుకున్నారు.

వివరాలు 6లో ▸



ఉగ్రవాదానికి కెనడా ప్రోత్సాహం

ఖలిస్థాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్య కంటే ఉగ్రవాదాన్ని కెనడా ప్రోత్సహించడం తీవ్రమైన అంశమని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు.

వివరాలు 6లో ▸

ప్రభుత్వ వైద్య సేవల్లో కొత్త అధ్యాయం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన 'జగనన్న ఆరోగ్య సురక్ష'

తొలిరోజే 1.45 లక్షల మందికి ఉచిత వైద్యం

- 620 క్యాంప్‌ల్లో వైద్యంతో పాటు మందులు పంపిణీ
- సేవలు వినియోగించుకున్న వారిలో మహిళలే అధికం
- మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు 5,809 మంది
- వారికి పూర్తి వైద్యం అందేలా వైద్య సిబ్బంది పర్యవేక్షణ..
- గ్రామాల్లోనే స్పెషలిస్ట్‌ల వైద్యంతో ప్రజల్లో ఎనలేని ఆనందం
- ఇలాంటి వైద్య సేవలు గతంలో ఎప్పుడూ చూడలేదని కితాబు

2లో



కర్నూలులో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



చానా సంతోషం నాయనా..

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బాలసంటి. వయసు 90 ఏళ్ల పైనే. బాలసంటి గ్రామం పేరు బెలుం. ఇది కొలిమిగుండ్ల మండలం నంద్యాల జిల్లాలో ఉంటుంది. ఇతనికి ఏ వైద్య అవసరం కావాలన్నా ఇంతకు ముందు 70 కిలోమీటర్ల దూరంలోని ప్రొద్దుటూరుకు వెళ్లాల్సిందే. ఇప్పుడతనికి గ్రామంలోనే వైద్య సేవలు అందుతున్నాయి. శనివారం జగనన్న సురక్ష క్యాంపుకు వచ్చిన అతను మాట్లాడుతూ.. ''గతంలో ప్రొద్దుటూరు వెళ్లి కంటి పరీక్ష చేయించుకుని అద్దాలు కొనుక్కున్నా. ఇప్పుడు మళ్లీ కండ్లు సరిగా కనిపిస్తలేవు. బయటకు వెళ్లలేకున్నా, నడిచేందుకు కూడా కష్టంగా ఉంది. గ్రామంలోనే వైద్యం శిబిరం పెట్టినారని తెలిసినోళ్లు ఇక్కడికి తీసుకొచ్చినారు. అప్పటికప్పుడు అన్ని పరీక్షలు చేసినారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. ఎక్కడెక్కడో తిరిగే బాధ కూడా తప్పింది. చానా సంతోషం నాయనా'' అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేసి వైఎస్ జగన్ చేస్తున్న కార్యక్రమాలను కొనియాడాడు.

ఫ్యాక్ట్ చెక్

రామోజీ కలం 'కిక్కు'తోంది..

- చంద్రబాబు హయాంలో ఏరులై పారిన మద్యం
- అప్పట్లో టీడీపీ నేతల గుప్పెట్లోనే లిక్కర్ మాఫియా
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమర్థంగా దశల వారీగా మద్య నియంత్రణ
- బెల్ట్‌షాపులు, పర్మిట్ రూమ్‌లను రద్దుచేసి రాష్ట్రంలో మద్యం మాఫియా కోరలు పీకేసిన సీఎం జగన్ సర్కార్
- మద్యం దుకాణాలు భారీగా తగ్గింపు.. వేళలూ కుదింపు
- విక్రయాలు తగ్గించేందుకు ధరలను షాక్ కొట్టేలా పెంచారు
- వీటన్నింటి ఫలితంగా భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు
- స్పష్టంచేస్తున్న ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ గణాంకాలు
- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా అక్రమ మద్యం కట్టడి
- గతంలో మద్య నిషేధం ఎత్తివేతకు బాబు, రామోజీ యుగళగీతం
- అయినా.. రాష్ట్రంలో మద్యం విధానంపై ఈనాడు మరోసారి విషపు రాతలు

2లో



ఢిల్లీలో సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసును చూస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్

నారా లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

ఇన్నర్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ స్కామ్‌లో 41ఏ కింద నోటీసులు అందజేసిన అధికారులు

- ఈ కేసులో ఏ14గా లోకేశ్
- ఢిల్లీలో ఎంపీ జయదేవ్ ఇంట్లో అందజేసిన అధికారులు
- 4వ తేదీన తాడేపల్లి కార్యాలయంలో హాజరు కావాలి
- హెరిటేజ్ ఫుడ్స్ బ్యాంకు ఖాతా, భూలావాదేవీల బోర్డు మినిట్స్ తేవాలి
- విచారణకు సహకరించాలి.. నిబంధనలు పాటించకుంటే అరెస్టు తప్పదు
- నోటీసుల్లో పేర్కొన్న దర్యాప్తు అధికారులు
- సీఐడీ పెట్టినవి దొంగ కేసులన్న లోకేశ్

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ముసుగులో జరిగిన భూదోపిడీ కుంభకోణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు సీఐడీ అధికారులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు అందజేశారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఢిల్లీలో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఇంట్లో ఉన్న లోకేశ్‌కు అధికారులు వీటిని అందజేశారు. అక్టోబరు 4న తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నోటీసులు ఇవ్వడానికి ఢిల్లీ వచ్చిన అధికారులు

మిగతా 3వ పేజీలో ▶

కొండంత భక్తి!



వరుసగా సెలవులు రావడంతో తిరుమలకు వెళ్లే రహదారులన్నీ శ్రీవారి భక్తులతో నిండిపోయాయి. క్యూ లైన్లు నందకం విశ్రాంతి భవనం దాటి 5 కిలోమీటర్లకు పైగా విస్తరించాయి.

5లో

3 నుంచి 'ఎఫ్ఏ-2'



పాఠశాల విద్యా శాఖ రాష్ట్రంలో ఈనెల 3 నుంచి 6 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించనుంది. అలాగే ఈ నెల 14 నుంచి 24 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది.

14లో

మోగని మోత

టీడీపీ చప్పుడు కార్యక్రమానికి ప్రజల్లో మద్దతు కరువు

- అక్కడక్కడా పార్టీ నేతలు, కార్యకర్తల హడావుడితోనే సరి
- కొన్నిచోట్ల రోడ్లపై హారన్లతో ప్రజలకు అసౌకర్యం
- చంద్రబాబు అవినీతిని సమర్థిస్తుండడంపై సామాన్య ప్రజల అసహనం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రిమాండు ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుకి మద్దతుగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన మోత మోగించే కార్యక్రమాన్ని ప్రజలు పట్టించుకోలేదు. శనివారం రాత్రి 7 నుంచి 7.05 గంటల వరకు ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి గంటలు, పళ్లాలు మోగించి మద్దతు తెలపాలని టీడీపీ పిలుపునిచ్చింది. దీనిని సామాన్య ప్రజలెవరూ పట్టించుకోలేదు. పైగా, చంద్రబాబు అవినీతిని సమర్థిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. అక్కడక్కడా టీడీపీ నేతలు, కార్యకర్తలు కొంత హడావుడి చేశారు. కొందరు పార్టీ నేతలు అత్యుత్సాహంతో రోడ్లపై వాహనాల హారన్లు మోగించడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పార్టీ నేతల డప్పు కార్యక్రమాన్ని చూసి ప్రజలు విస్తుపోయారు. రాజమండ్రిలో నారా బ్రాహ్మణి, హైదరాబాద్‌లో భువనేశ్వరి, ఢిల్లీలో లోకేశ్ పెద్ద డప్పులను వాయించి సోషల్ మీడియాలో పెట్టారు. అవినీతి కేసులో చంద్రబాబు అరెస్టయితే దానికి సమాధానం చెప్పకుండా రకరకాలుగా దాన్ని సమర్థించుకోవడమేమిటని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చంద్రబాబు అరెస్టును పట్టించుకోని ప్రజలు

చంద్రబాబు అరెస్టుపై మొదటి నుంచీ ప్రజల్లో స్పందన కనిపించడంలేదు. మొదట్లో ఆయన

మిగతా 3వ పేజీలో ▶

గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు

- ప్రతిపాదన ఫైలుకు సీఎం జగన్ ఆమోదం
- పూర్తి స్థాయి విధివిధానాలతో త్వరలో ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 1-4 కేటగిరీల పంచాయతీ కార్యదర్శుల తరహాలోనే గ్రామ పంచాయతీల బిల్లుల తయారీ తదితర అన్ని రకాల డీడీవో అధికారాలను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఆయా గ్రామ పంచాయతీ బాధ్యతల్లోనూ

మిగతా 14వ పేజీలో ▶

అసైన్డ్ భూములు కొట్టేసేందుకు.. 'నల్ల'మార్గం

బంధువులు, సన్నిహితులు, ఉద్యోగుల పేరిట భూములు హస్తగతం చేసుకున్న నారా, నారాయణ

- నారాయణ సంస్థల నుంచి నిధుల రూటింగ్
- నల్లధనం కోసం ఎన్‌స్పైర కంపెనీ ఏర్పాటు
- ఎన్‌స్పైర నుంచి ఆర్కే హౌసింగ్‌కు నిధుల బదిలీ.. అక్కడి నుంచి బినామీలకు నగదు
- అసైన్డ్ రైతులను భయపెట్టి భూముల లూటీ
- తమ బినామీలకే భూసమీకరణ ప్యాకేజీ స్థలాలు దక్కేలా వ్యూహం
- అవినీతి నెట్‌వర్క్‌ను బట్టబయలు చేసిన సిట్ దర్యాప్తు
- పచ్చగద్దల జాబితాలో గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా, రావెల తదితరులు
- ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీవీ వియ్యంకుడు కూడా..

3లో



ఇంతంతేకేత్



పర్వాలేదు.. ఇప్పుడు హ్యాపీగా దాచుకోండి డబ్బు!!

న్యూయార్క్‌లో వరద విలయం

అమెరికాలోని న్యూయార్క్ అకాల వర్షాలతో అతలాకుతలమవుతోంది. శుక్రవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి వీధులు, సబ్‌వేలు, హైవేలు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించింది. విమానాలు రద్దవ్వగా.. మెట్రో స్టేషన్లను మూసివేశారు. నగరంలో ఎమర్జెన్సీ విధించినట్టుగా ఆ రాష్ట్ర గవర్నర్ హొచల్ ప్రకటించారు.

- వివరాలు 6లో ▸



న్యూయార్క్‌లో జలమయమైన రహదారి

ఆన్‌లైన్ గేమింగ్‌లపై 28% జీఎస్టీ



ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు బెట్టింగ్‌ల పూర్తి విలువపై 28 శాతం జీఎస్టీని అక్టోబర్ 1 నుంచి వసూలు చేయనున్నాయి. ఈ రంగంలో విదేశాల నుంచి భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫై చేసింది.

- వివరాలు 6లో ▸

వైద్య సేవల్లో ఏపీ భేష్

ఫ్యామిలీ డాక్టర్ విధానం మంచి నిర్ణయం

- దీనిద్వారా ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయి
- 'సాక్షి'తో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా
- రాష్ట్రంలో వంద శాతం విలేజ్ క్లినిక్స్‌ను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా తీర్చిదిద్దారు
- వెల్‌నెస్ సెంటర్ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి
- ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలు చాలా బాగున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని, ఈ విధానం ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు వైద్యుల సేవలు అందించడం శుభపరిణామం అని చెప్పారు.



హర్ష్ మంగ్లా శనివారం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో వైద్య కార్యక్రమాలు, వైద్య శాఖ పని తీరు వంటి పలు అంశాలపై ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే..

వైద్య సేవలు చేరువ

ఎఫ్‌డీసీ ఓ వినూత్న కార్యక్రమం. దీని ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు చేరువ అవుతాయి. రాష్ట్రంలో వంద శాతం విలేజ్ క్లినిక్స్‌ను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడం చాలా మంచి విషయం. వీటి ద్వారా ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామాల్లోనే 12 రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు వీటిలో సేవలు అందిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలు, చరిత్ర వీటిలో ఉంటాయి. వీటి ఆధారంగా వైద్య సేవలు అందుతాయి. ప్రజలకు డిజిటల్ వైద్య సేవల కల్పనే లక్ష్యంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అమలు చేస్తున్నాం. ఈ కార్యక్రమం అమలులోనూ ఏపీ ప్రభుత్వం ఉత్తమ పనితీరు కనబరుస్తోంది.

ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఉచిత వైద్యం

ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఏపీ మిగతా అన్ని రాష్ట్రాలకంటే ముందుంది. ప్రజలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఉచిత వైద్యం అందించడానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం అమలుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ప్రతి కుటుంబానికి ఈ పథకం ఎంతో ముఖ్యమైనది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ పథకంతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ కార్డుల జారీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

అవయవ దానానికి ముందుకు రావాలి

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజలందరికీ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్ కార్డుల జారీ, అవయవ దానం క్యాంపెయిన్, రక్తదానం క్యాంప్‌లు వంటి నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ అవయవ దానం, రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. అవయవదానానికి ఏపీలో చాలా మంది ముందుకు వస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష



విశాఖ జిల్లా కాపులుప్పాడలో మహిళకు బీపీని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం బెలమాంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



ఏలూరు మండలం పాలగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద వైద్య పరీక్షల కోసం బారులు తీరిన జనం



బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైఎస్సార్ జిల్లా కడపలో రోగులకు మందులు అందిస్తున్న ఫార్మసిస్టులు

ప్రభుత్వ వైద్య సేవల్లో.. కొత్త అధ్యాయం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. 26 జిల్లాల్లో 620 ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఒక్కో క్యాంప్‌లో ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌లు, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు.. మొత్తం నలుగురు వైద్యులు అందుబాటులో ఉండి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్యం చేశారు. 1,45,611 మంది స్వగ్రామాల్లోనే వైద్య సేవలు పొందారు. అంటే.. ప్రతి క్యాంప్‌లో సగటున 235 ఓపీ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కరించేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం(సెప్టెంబర్ 30) నుంచి నవంబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. శనివారం జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు క్యాంప్‌లను ప్రారంభించారు.

మహిళలే అధికం

తొలి రోజు ఆరోగ్య సురక్ష క్యాంప్‌లలో వైద్య సేవలు పొందిన వారిలో మహిళలే అధికం. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 లక్షల మంది సేవలు పొందగా వీరిలో 63,257 మంది పురుషులు, 82,354 మంది మహిళలు ఉన్నారు. మొత్తం వైద్య సేవలు పొందిన వారిలో మెరుగైన వైద్యం అవసరమున్న 5,809 మందిని స్థానికంగా ఉన్న పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వీరు ఆయా ఆస్పత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందేలా స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. దీంతో పెద్ద ఆస్పత్రుల్లోను వీరందరికీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సేవలు అందేలా చూస్తారు.

రూపాయి ఖర్చు లేకుండా

క్యాంప్‌లకు వచ్చిన వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు, మందులను అందించింది. ప్రతి క్యాంప్‌లో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరం మేరకు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్తపరీక్షలు, ఫుడ్ సప్లిమెంటేషన్ మ్యాపింగ్ చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామం/పట్టణంలో ఆరోగ్య సు రక్ష క్యాంప్‌పై ప్రజలకు వైద్య సిబ్బంది, వలంటీర్‌లు అవగాహన కల్పించారు. సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లే పనిలేకుండా జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్ వంటి ఇతర స్పెషలిస్ట్ వైద్యులే గ్రామంలో సేవలు అందిస్తున్నారని తెలిసి ప్రజలు శిబిరాలకు తరలి వచ్చారు. క్యాంప్‌ల్లో వైద్య సేవలు పొందిన వారికి వ్యక్తిగత కేస్ షీట్స్‌ను ప్రభుత్వం అందించింది. కేస్ షీట్‌లో వ్యక్తి పేరు, చిరునామా, వయసు వంటి వివరాలతో పాటు, వైద్యుడు పరిశీలనాంశాలు, సూచించిన మందుల ప్రిస్క్రిప్షన్ నమోదు చేశారు. కేస్ షీట్ ఫోల్డర్, వైద్యుడు సూచించిన మందులతో జగనన్న ఆరోగ్య కిట్‌ను వైద్య శాఖ పంపిణీ చేసింది. వీరిపై ఫ్యామిలీ డాక్టర్ నేతృత్వంలోని వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంచనున్నారు.

ఐదు దశల్లో..

ప్రభుత్వం 5 దశల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తొలి దశలో వలంటీర్‌లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు హెల్త్ క్యాంప్ నిర్వహించే 15 రోజుల ముందు ఇళ్లన్నింటినీ సందర్శిస్తున్నారు. ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. రెండో దశలో సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు ప్రజలకు ఇంటి వద్దే బీపీ, షుగర్, హెచ్‌బీ, డెంగీ, మలేరియా సహా ఏడు రకాల పరీక్షలు అవసరం మేరకు నిర్వహించి ఫలితాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా సేవలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు వివరిస్తున్నారు. ఇక మూడో దశలో క్యాంప్ నిర్వహణకు మూడు రోజుల ముందు వలంటీర్, ప్రజాప్రతినిధులు ఇంటింటిని సందర్శించి హెల్త్ క్యాంప్ జరిగే ప్రదేశం, సమయం ఇతర వివరాలను తెలియజేస్తున్నారు. నాలుగో దశలో క్యాంప్‌లు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఐదో దశలో హెల్త్ క్యాంప్‌లో వైద్య సేవలు పొందిన వారికి, రిఫరెన్స్ మేరకు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్న వారికి తదుపరి వైద్య అవసరాల విషయంలో మెడికల్ ఆఫీసర్‌లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్, వలంటీర్‌లు చేయిపట్టి నడిపిస్తారు.

వృద్ధులకు మేలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వృద్ధులకు ఎంతో ఉపయోగకరం. ఇంటింటికి వచ్చి వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు మీ ఆరోగ్యం ఎలా ఉంది అంటూ పలకరిస్తున్నారు. గుమ్మం వద్దే వైద్య పరీక్షలు చేస్తున్నారు. టోకెన్లు ఇచ్చి ఊళ్లోనే వైద్యం చేయిస్తున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. గతంలో ఇలాంటి సేవలో మాకు అందేవి కావు.

– శివలింగారెడ్డి, చిటిపిరాళ్ల గ్రామం, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. అన్ని రకాల వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణులతో పేదల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు గతంలో ఏ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. నేను గతకొద్ది కాలంగా గుండె నొప్పితో బాధ పడుతున్నాను. ఆసుపత్రికి వెళితే ఎంత ఖర్చు అవుతుందో అన్న భయంతో వెళ్లలేదు. ఈ రోజు వైద్య శిబిరంలో ఈసీజీ తీసి పరీక్షించారు.

– కొల్లు అప్పారావు, మర్రిమొక్కవీధి, జగ్గంపేట, కాకినాడ జిల్లా

అన్ని పరీక్షలు చేశారు



నాకు గత కొంతకాలంగా నడుం నొప్పి వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవడం నాకు సాధ్యం కాదు. మా ప్రాంతానికి 104 వాహనం రావడం, మందులు ఇవ్వడం వల్ల కొంత ఉపశమనం లభించింది. ఈ రోజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన పెద్ద డాక్టర్లు అన్ని పరీక్షలు చేశారు. మందులు ఇచ్చి కొన్ని సూచనలు చేశారు.

–పాలిక లక్ష్మి, శెట్టిబలిజపేట, జగ్గంపేట, కాకినాడ జిల్లా

పడిపోయి.. నడవలేక..



ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయాను. కాలికి గాయమైంది. నడవలేక ఇబ్బంది పడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లాను. అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. కాలుని పట్టిపట్టి చూశారు. పెద్దగా భయపడాల్సిన పని లేదన్నారు. మందులిచ్చి వేసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే పీహెచ్‌సీకి రమ్మని చెప్పారు.

– అప్పలనాయుడు, జమాదులపాలెం, కశింకోట మండలం, అనకాపల్లి జిల్లా

క్లుప్తంగా...

ఆరోగ్య సురక్షకు ఐఎంఏ సహకారం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భాగస్వామి అవుతోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ ఎం.రవీంద్రనాథ్ తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తృతం చేయడం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానం వంటివి కార్యక్రమాలను చేపడుతున్న సీఎంను సత్కరించారు. విజయ వాడలో నవంబర్ 22 నుంచి 26 వరకూ ఐఎంఏ క్రీడా ఒలింపిక్స్ నిర్వహిస్తున్నట్టు రవికృష్ణ, రవీంద్రనాథ్‌లు సీఎంకు వివరించారు.

రేపు 'జగనన్నకు వందనం'

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అక్టోబర్ 2న మరో విడత 'జగనన్నకు వందనం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ రూపకర్త అయిన సీఎం వైఎస్ జగన్‌కు ఏటా అక్టోబర్ 2న కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం గత నాలుగేళ్లుగా కొనసాగిస్తున్నామని గుర్తుచేశారు. విజయవాడలోని ఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో శనివారం సంఘం ప్రతినిధులు జగనన్నకు వందనం కార్యక్రమ వివరాల బ్రౌచర్‌ను ఆవిష్కరించారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మళ్లీ బొప్పరాజు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి



బొప్పరాజు



కృష్ణమూర్తి

సాక్షి, అమరావతి: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చేబ్రోలు కృష్ణమూర్తి రెండోసారి ఎన్నికయ్యారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శనివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. కొత్త కార్యవర్గంలో 30 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహ అధ్యక్షుడిగా పితాని త్రినాథరావు, ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, ఇద్దరు స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శులు, ఎనిమిది మంది కార్యదర్శులు, ఎనిమిది మంది కార్యనిర్వాహక కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2023 నుంచి 2026 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే రెవెన్యూ ఉద్యోగుల 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కొత్త కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

రామోజీ కలం 'కిక్కు'తోంది..

సాక్షి, అమరావతి: కళ్ల ముందు కనిపిస్తున్న నిజాలను దాచి, అబద్ధాల కథనాలు రాసి పారేస్తే ప్రజలు నమ్మక ఏం చేస్తారు అన్న భ్రమల్లో ఉన్నారు ఈనాడు రామోజీరావు. అంకెలు అబద్ధాలు చెప్పవు.. నిజాలే చెబుతాయి కదా.. అందుకే ఈనాడు రామోజీరావు ఎప్పుడూ అంకెలు చెప్పరు, అబద్ధాలే చెబుతారు. అందులోనూ తన ఆత్మబంధువు చంద్రబాబు సీఎం కుర్చీలో లేకపోతే ఆయన కలం వెర్రితలలు వేస్తుంది. అబద్ధాలు, అభూత కల్పనలను రంగరించి మరీ విషం కక్కుతుంది. ప్రజల్ని మభ్యపెట్టడం, మోసగించడమే ఆ కలం నిత్యకృత్యం. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన మరోసారి విద్వేషాన్ని చిమ్మారు. ఓట్లడిగే 'అర్హత' కోల్పోయిన జగన్.. అంటూ ఈనాడు ఊగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వ మద్యం విధానంపై ఓ అబద్ధాల కథనాన్ని అచ్చేసింది. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు పాతరేసి ఎప్పటిలాగే దుష్ప్రచారానికి తెగబడింది. అందులో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మద్యం విధానానికి వక్రభాష్యం చెబుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు రామోజీ పడరాని పాట్లు పడ్డారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో మద్యం ఏరులై పారిన నిజాన్ని.. టీడీపీ నేతలు మద్యం సిండికేట్‌గా మారి పేదలను దోచుకున్న దోపిడీని చూసి పచ్చ పారవశ్యంతో పులకించిపోయిన రామోజీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేస్తున్న దశలవారీ మద్య నియంత్రణ విధానాన్ని విమర్శించేందుకు కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నారు. కానీ, టీడీపీ ప్రభుత్వంలో మూడు బార్లు ఆరు దుకాణాలుగా మద్యం ఏరులై పారిందని.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దశలవారీగా మద్య నియంత్రణ సుసాధ్యమవుతోందని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు రాజకీయ ప్రాభవం ఇక ముగిసిందని.. తన ఆర్థిక అక్రమ సామ్రాజ్యం కుప్పకూలిందని 90 ఇయర్స్ రామోజీ ఇకనైనా గుర్తిస్తే మేలు. నిత్యం అబద్ధాలను వల్లెవేసే ఈనాడు విషపు రాతల బండారాన్ని బట్టబయలు చేస్తున్న పచ్చినిజం 'ఏది నిజం' ఇదిగో..





చంద్రబాబు హయాంలో ఏరులై పారిన మద్యం

అప్పట్లో మూడు పర్మిట్ రూమ్‌లు.. ఆరు బెల్ట్ దుకాణాలు..

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోటీడీపీ నేతల మద్యం సిండికేట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు పర్మిట్ రూమ్‌లు.. ఆరు బెల్ట్ దుకాణాలుగా మద్యం ఏరులై పారిందన్నది నిఖార్సైన నిజం. రామోజీకి గుర్తులేదేమోగానీ రాష్ట్ర ప్రజలు మాత్రం మరిచిపోలేదు. అప్పట్లో టీడీపీ నేతల గుప్పెట్లో ఉండే మద్యం మాఫియా యథేచ్ఛగా ప్రజలను దోపిడీ చేసింది. వేళాపాళా లేకుండా 24 గంటలూ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగేవి. ఎమ్మార్పీ ధరల కంటే 25శాతం వరకు అధిక ధరలకు అమ్ముతున్నా సరే నాడు ఎక్సైజ్ శాఖ చేష్టలుడిగి చోద్యం చూడాల్సి వచ్చేది.

మద్యం మాఫియా ఆట కట్టించిన సీఎం జగన్..

మద్యం మాఫియా అరాచకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క విధాన నిర్ణయంతో తుడిచిపెట్టేశారు. రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని ఆయన రద్దుచేశారు. 2019, అక్టోబర్ 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం చేసేశారు. దాంతో రాష్ట్రంలో మద్యం మాఫియా కోరలు పీకి తుదముట్టించారు. అందుకోసం..

మద్యం దుకాణాల వేళలు కుదింపు

ప్రైవేటు వ్యక్తులైతే ఎంతగా మద్యం విక్రయాలు పెంచితే తమకు అంతటి లాభం వస్తుందని అనుకుంటారు. కానీ, ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని సీఎం జగన్ రద్దుచేశారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రభుత్వానివే కాబట్టి మద్యం అమ్మకాలను ప్రోత్సహించాల్సిన అవసరమేలేదు. అంతేకాదు.. మద్యం విక్రయాల సమయాలను బాగా కుదించారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉ.10గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అధికారంగా విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24గంటలూ విక్రయిస్తూ ఉండేవి. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల సమయాన్ని కుదించి ఉ.10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయాలను అనుమతించారు. కచ్చితంగా అమలుచేస్తున్నారు కూడా.

బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు రద్దు

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా రాష్ట్రంలో 43వేల బెల్ట్ దుకాణాలు ఉండేవి. కాలనీలు, వీధులు, సందుల్లో ఎక్కడపడితే అక్కడ బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయించేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ 43వేల బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించింది. టీడీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా 4,380 పర్మిట్ రూమ్‌లకు అనుమతించారు. అంటే ఆ పర్మిట్ రూమ్‌లు అనధికారికంగా బార్లుగా చలమణి అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ 4,380 పర్మిట్ రూమ్‌ల అనుమతులను సైతం రద్దుచేసింది.

మద్యం దుకాణాలు క్రమంగా తగ్గింపు

చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో 4,380 మద్యం దుకాణాలు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వపరం చేసింది. అంతేకాదు.. మద్యం దుకాణాలను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. 2019లో రాష్ట్రంలో 4,380 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండగా ప్రస్తుతం 2,934 ప్రభుత్వ మద్యం దుకాణాలే ఉన్నాయి. అలాగే, టీడీపీ ప్రభుత్వం ఏటా బార్ల సంఖ్యను పెంచేది. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బార్ల సంఖ్యను పెంచలేదు. 2019లో ఖరారుచేసిన 840 బార్లే ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు.

విక్రయాలు తగ్గించేందుకే ధరల షాక్

మద్యం విక్రయాలను నిరుత్సాహపర్చడమే తమ పార్టీ విధానమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లోనూ మేనిఫెస్టోలోనూ స్పష్టంగా చెప్పారు. పేదలను మద్యం వ్యసనానికి దూరం చేసేందుకే ఆ నిర్ణయమన్నారు. అంతేగానీ, మద్యం విక్రయాలను ప్రోత్సహించి సొమ్ము చేసుకోవడం తమ ప్రభుత్వ లక్ష్యం కాదని స్పష్టంచేశారు. ఆ మాటకు కట్టుబడుతూ అధికారంలోకి వచ్చాక మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచారు. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ) పన్నునూ విధించారు. దాంతో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. మరోవైపు.. మద్యం వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు విధించిన ఏఆర్ఈటీ పన్నుతో మద్యం రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ వాస్తవాన్ని రామోజీ వక్రీకరిస్తూ రాష్ట్రంలో మద్యం విక్రయాలు పెరిగాయని ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తుండటం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. పేదలు మద్యం వ్యసనానికి క్రమంగా దూరమవుతున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలతో 'నవోదయం'..

దశాబ్దాలుగా నాటుసారా తయారీయే జీవనోపాధిగా చేసుకున్న కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. అందుకోసం 'నవోదయం' పేరుతో వినూత్న సంస్కరణలను తీసుకొచ్చి ఆ కుటుంబాల సామాజిక గౌరవాన్ని పెంచింది. 2022 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో 1,891 గ్రామాలను గుర్తించారు. ఆ గ్రామాల్లో ఇప్పటికే 1,552 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం రూ.11.46 కోట్ల మేర సహాయం చేసింది.

99 శాతం మేనిఫెస్టో అమలు

దశలవారీ మద్య నియంత్రణ అనే అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏమీ బుకాయించడంలేదు. తాము చేసిందే చెబుతున్నారు. అదే సమయంలో తమ పరిమితిని కూడా అంగీకరిస్తున్నారు. అందుకే ఆయన తమ మేనిఫెస్టోను 99 శాతం అమలుచేశామనే చెబుతున్నారు. మద్యం, ఉద్యోగుల విషయాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి చాలావరకు చేశారు. కానీ, సాంకేతిక అంశాలు, ఇతరత్రా కారణాలతో ఆ రెండు అంశాల్లో అరశాతం చొప్పున మిగిలిపోయిందని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజాయతీగా అంగీకరిస్తోంది. అందుకే తాము 99శాతం మేనిఫెస్టోను అమలుచేశామనే సీఎం జగన్ చెబుతుండటం ఆయన నిజాయతీ, నిబద్ధతకు నిదర్శనం. అంతేగానీ, ఆయన ప్రజల్ని మోసపుమాటలతో మాయచేయడంలేదు. 99 శాతం మేనిఫెస్టో అమలుచేశామని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను రామోజీరావు పచ్చకావరంతో తప్పుబడుతున్నారు. కానీ, చంద్రబాబు 2014 ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను ఏమాత్రం అమలుచేయలేదు. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు. టీడీపీ అధికారిక వెబ్‌సైట్ నుంచి సైతం దానిని తొలగించారు. అయినాసరే అప్పట్లో రామోజీరావు నోరు పెగల్లేదు.. పెన్ను కదల్లేదు. మేనిఫెస్టోను ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించలేదు. ఎందుకంటే అప్పట్లో అధికారంలో ఉన్నది తన పార్ట్‌నర్ చంద్రబాబు కాబట్టి. తన అక్రమ ఆర్థిక సామ్రాజ్యానికి వెన్నుదన్నుగా ఉన్న చంద్రబాబు కాబట్టి. ప్రజలకు ఎంత నష్టం జరిగినా, రాష్ట్ర ప్రగతి దెబ్బతిన్నా సరే ఏమాత్రం పట్టించుకోలేదు. కానీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 99 శాతం మేనిఫెస్టోను అమలుచేసి.. ఆ విషయాన్ని నిజాయతీగా ప్రకటిస్తున్నా సరే రామోజీ తప్పుబడుతుండటం ఈనాడు 'పచ్చ'కామెర్ల తత్వాన్ని బయటపెడుతోంది. ఆ పచ్చపైత్యం చంద్రబాబుకు కమ్మగా ఉంటుందేమోగానీ టీడీపీ కుట్రలను, ఈనాడు దుష్ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు తిప్పికొడుతున్నారు. ఇది నాలుగున్నరేళ్లుగా రుజువవుతూనే ఉంది. అర్హులందరికీ సంక్షేమం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే ఉన్నామని తేల్చిచెబుతున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల పెరుగుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ విక్రయాలు	బీరు విక్రయాలు
2014-15	2.88 కోట్లు	1.74కోట్లు
2015-16	3.06 కోట్లు	1.75 కోట్లు
2016-17	3.32 కోట్లు	1.78 కోట్లు
2017-18	3.60 కోట్లు	2.27 కోట్లు
2018-19	3.84 కోట్లు	2.77 కోట్లు

భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు..

ఇక దశలవారీగా మద్య నియంత్రణ విధానం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలను సగానికి పడిపోయాయి. అందుకు ఈ గణాంకాలే తార్కాణం..

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాల తగ్గుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.87 కోట్లు	50 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.63 కోట్లు	28 శాతం	82 లక్షల	70 శాతం
2022-23	3.35 కోట్లు	13 శాతం	1.16కోట్లు	58శాతం
2023	1.45 కోట్లు	-----	54 లక్షలు	-----

(ఏప్రిల్ నుంచి ఆగస్టు)

చంద్రబాబు, రామోజీ మద్యం బంధం

వ్యాపార ప్రయోజనాల కోసం కుట్రపూరిత రాజకీయాలతో ప్రభుత్వ వ్యవస్థను భ్రష్టు పట్టించడంలో చంద్రబాబు, రామోజీరావు సిద్ధహస్తులు. వారి రాజకీయ బంధం మద్యంతో ముడిపడి ఉందన్నది బహిరంగ రహస్యం. 1989–94లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం.. అప్పట్లో తమ పోటీ పత్రిక 'ఉదయం' ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు రామోజీరావు సంపూర్ణ మద్య నిషేధం ఉద్యమాన్ని ప్రోత్సహించారు. ఎన్టీరామారావు అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్య నిషేధాన్ని విధించారు. ఆ తర్వాత ఎన్టీరామారావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారు. మద్య నిషేధాన్ని ఎత్తివేసి మద్యానికి తలుపులు బార్లా తెరిచారు. అయినాసరే.. రామోజీరావు కిమ్మనకుండా మద్దతు తెలిపారు. ఎందుకంటే అప్పుడే రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మాణం చేపట్టారు. అందులోని స్టార్‌హోటళ్లలో మద్యం విక్రయాల కోసం రామోజీరావు నిజంగా ప్రజల రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్నారు. కానీ, ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విక్రయాల గురించి శ్రీరంగ నీతులు చెబుతుండటం విడ్డూరంగా లేదా?

అక్రమ మద్యంపై ఎస్ఈబీ ఉక్కుపాదం

అలాగే, వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అక్రమ మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన అక్రమ మద్యం, నాటుసారా దందాను సమర్థంగా కట్టడి చేస్తోంది. అందుకోసం ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. ఎస్ఈబీ మూడు విధాలుగా అక్రమ మద్యం, నాటుసారాను అరికడుతోంది. అదెలాగంటే..

- అక్రమ మద్యం, నాటుసారా తయారీ దశాబ్దాలుగా సాగుతున్న 147 గ్రామాలను గుర్తించి దాడులు నిర్వహిస్తోంది.
- గ్రామ వలంటీర్లు, వార్డు వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా కచ్చితమైన సమాచారాన్ని తెప్పించుకుని అక్రమ మద్యం దందాను అడ్డుకుంటోంది.
- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది.
- అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ.. పొరుగు రాష్ట్రాలతో కలిసి దాడులు నిర్వహిస్తోంది.

క్లుప్తంగా...

చంద్రబాబు పిటిషన్‌పై 3న సుప్రీంకోర్టులో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ ఎస్ఎల్‌పీని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం 3వ తేదీన విచారించనుంది. ఈ ధర్మాసనం ముందు ఆఖరి ఐటెం నంబర్ 63గా రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. గత విచారణ సందర్భంగా చంద్రబాబు పిటిషన్ విచారణకు జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నిరాకరించిన విషయం విదితమే. దీంతో ఈ పిటిషన్ జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం వద్దకు విచారణకు వచ్చింది.

4న ఓటుకు కోట్లు కేసు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసును ఈ నెల 4న సుప్రీంకోర్టు విచారించనుంది. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా ఓటు వేయాలని ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌ను ప్రలోభాలకు గురిచేసిన విషయం విదితమే. ఈ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిని ముద్దాయిగా చేర్చాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి న్యాయపోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను 4వ తేదీన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఓటుకు కోట్లు కేసును తెలంగాణ ప్రభుత్వం తగిన విధంగా దర్యాప్తు చేయడంలేదని, పూర్తి ఛార్జిషీటు వేయలేదని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆళ్ల దాఖలు చేసిన మరో పిటిషన్‌ను సుప్రీంకోర్టు 4న విచారించనుంది.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే మోత మోగిస్తారు

మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: రాష్ట్రంలో ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో మోత మోగిస్తుంటే... తెలుగుదేశం పార్టీ మాత్రం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా విజిల్స్, పళ్లాలు, కారు హారన్లు మోగించే కార్యక్రమం చేపట్టడం విడ్డూరంగా ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఎద్దేవా చేశారు. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మంత్రి రజిని మీడియాతో మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌లో ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకుని జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా పళ్లాలు మోగించడం టీడీపీ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. గత ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు ఓట్లతో మోత మోగించారని, వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి మరింత గట్టిగా మోత మోగించటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. జగనన్న సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, చంద్రబాబు మోసపూరిత, మాయమాటలు నమ్మేందుకు సిద్ధంగా లేరని, ఈ క్రమంలోనే మరోమారు ప్రజల నుంచి టీడీపీకి మోత తప్పదని విమర్శించారు.

అసైన్డ్ భూములు కొట్టేసేందుకు.. 'నల్ల'మార్గం

బంధువులు, సన్నిహితులు, ఉద్యోగుల పేరిట అమరావతిలో భూములు హస్తగతం చేసుకున్న నారా, నారాయణ



పచ్చగద్దల అసైన్డ్ భూదోపిడీ 3

సాక్షి, అమరావతి: అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు తీగ లాగితే నారా, నారాయణ నల్లధనం నెట్‌వర్క్ బట్టబయలైంది. అమరావతిలోని బడుగు, బలహీనవర్గాల అసైన్డ్ రైతులను బెదిరించి వారి భూములు కొల్లగొట్టడం కోసం నల్లధనం తరలించేందుకు చంద్రబాబు ముఠా పన్నిన పన్నాగం బయటపడింది. బంధువులు, బినామీలు, సన్నిహితులు, తమ ఉద్యోగుల పేరిట అసైన్డ్ భూములు హస్తగతం చేసుకునేందుకు వెచ్చించిన నల్లధనం గుట్టు రట్టయింది. అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆ నల్లధనం నెట్‌వర్క్‌ను ఛేదించింది. అసైన్డ్ భూముల జాబితాలోని కేటగిరీ 1 నుంచి 4 వరకు ఉన్న 617.65 ఎకరాలను కొట్టేసేందుకు ఏర్పాటు చేసుకున్న 'నల్ల'మార్గాన్ని ఆధారాలతోసహా బట్టబయలు చేసింది. బినామీల పేరిట అసైన్డ్ భూములు కొల్లగొట్టిన ముఠా జాబితా తవ్వుతుంటే.. చంద్రబాబు, లోకేశ్, నారాయణ, గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా ఇలా టీడీపీ పెద్దల పేర్లు బయటపడుతున్నాయి.

నల్లధనం కోసం కంపెనీ ఏర్పాటు

నారాయణ విద్యా సంస్థలకు మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల జీతాల చెల్లింపు కోసమని 'ఎన్‌స్పైర మేనేజ్‌మెంట్ సర్వీసెస్' అనే కంపెనీని ఏర్పాటు చేశారు. అసైన్డ్ భూములు కొల్లగొట్టడం కోసమే నారాయణ కుమార్తె సింధూర, అల్లుడు పునీత్ డైరెక్టర్లుగా ఎన్‌స్పైర కంపెనీని నెలకొల్పారు. నారాయణ విద్యా సంస్థలకు అన్ని రకాల చెల్లింపులు నిర్వహిస్తున్నందుకు ఎన్‌స్పైరకు 10 శాతం కమిషన్ చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపారు. ఇదే అవకాశంగా ఎన్‌స్పైరలోకి ఇతర సంస్థల నుంచి భారీగా నిధులు మళ్లించారు. ఎన్‌స్పైరలో ఇతర కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చూపడం గమనార్హం. ఒలంపస్ క్యాపిటల్ ఏషియా క్రెడిట్ అండ్ సీఎక్స్ పార్టనర్స్ మ్యాగజైన్ అనే కంపెనీ 2016లో ఏకంగా రూ. 400 కోట్లు పెట్టుబడి పెట్టినట్టు చూపించారు. ఇక 2018లో మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా, బన్యాన్ ట్రీ గ్రోత్ క్యాపిటల్ అనే సంస్థలు 75 మిలియన్ డాలర్లు (రూ. 613.27 కోట్లు) పెట్టుబడి పెట్టినట్టు రికార్డుల్లో చూపారు. దీంతో రెండు విడతల్లో ఎన్‌స్పైర కంపెనీలోకి రూ.1,013.27 కోట్లు వచ్చి చేరాయి. ఇలా భారీగా నల్లధనాన్ని ఎన్‌స్పైరలోకి మళ్లించినట్లు తెలుస్తోంది.

ఎన్‌స్పైర టు రామకృష్ణ హౌసింగ్

నారాయణ సమీప బంధువు కేవీపీ అంజని కుమార్ రంగంలోకి వచ్చారు. ఆయన మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నల్లధనం తరలింపునకు మార్గంగా చేసుకున్నారు. అక్రమ నిధులను ఎన్‌స్పైర నుంచి రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పటికే నారాయణ విద్యా సంస్థల సిబ్బంది, మరికొందరిని తమ బినామీలుగా ఎంపిక చేసుకున్నారు. రామకృష్ణ హౌసింగ్ బ్యాంకు ఖాతాల నుంచి ఆ బినామీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి నిధులను మళ్లించారు. వారు ఆ నగదు డ్రా చేసుకున్నారు. ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములను తీసుకుంటుందని బడుగు, బలహీనవర్గాల రైతులను అప్పటికే భయపెట్టారు. తద్వారా ఆ రైతుల అసైన్డ్ భూములను తమ బినామీలైన ఉద్యోగులు, ఇతరులకు అతి తక్కువకు విక్రయించేలా కథ నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములు తమ బినామీల ద్వారా హస్తగతం చేసుకున్నారు. తర్వాత బినామీలే సీఆర్‌డీఏకు ఆ భూములను ఇచ్చినట్టు చూపించి వారికే భూసమీకరణ ప్యాకేజీ వచ్చేలా చేశారు. ఆ విధంగా 617.65 ఎకరాలకు గాను రూ. 3,737 కోట్ల విలువైన భూసమీకరణ ప్యాకేజీ స్థలాలను పొందారు.

జీపీఏ, సేల్‌డీడ్‌ల ద్వారా హస్తగతం

కేటగిరీ 1 నుంచి 4 వరకు 617.65 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఉన్న అసైన్డ్ రైతుల జాబితా, సీఆర్‌డీఏ రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లను పరిశీలిస్తే అక్రమాల బాగోతం బయటపడుతోంది. ఈ జాబితాలో చంద్రబాబు, నారాయణ, గంటా శ్రీనివాసరావు, వారి సన్నిహితులు, బంధువులు, బినామీలే బయటపడుతున్నారు. అమరావతి పరిధిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం, బోరుపాలెం, నేలపాడు తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు చెందిన 617.65 ఎకరాల అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్ల ద్వారా హస్తగతం చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల నుంచి అసైన్డ్ భూములను బినామీల ద్వారా కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు

- నారా చంద్రబాబునాయుడు (టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
- నారా లోకేశ్ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- పొంగూరు నారాయణ (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- గంటా శ్రీనివాసరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- దేవినేని ఉమామహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- ప్రత్తిపాటి పుల్లారావు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- రావెల కిశోర్ బాబు (టీడీపీ ప్రభుత్వంలో మంత్రి)
- తెనాలి శ్రావణ్ కుమార్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
- గుమ్మడి సురేశ్ (టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు వియ్యంకుడు)
- మండల ఎస్.ఎస్.కోటేశ్వరరావు (రియల్టర్)
- మండల రాజేంద్ర (రియల్టర్)
- కేవీపీ అంజనీ కుమార్ (రియల్టర్)
- దేవినేని రమేశ్ (రియల్టర్)
- బొబ్బ హరిశ్చంద్ర ప్రసాద్ (రియల్టర్)
- హరేంద్రనాథ్ చౌదరి (రియల్టర్)
- పొట్లూరి సాయిబాబు (సిటీ కేబుల్)
- దోనేపూడి దుర్గా ప్రసాద్ (రియల్టర్)

రూ.16 కోట్లతో.. రూ. 816 కోట్లు కొట్టేసిన నారాయణ

రాజధానిలో నారాయణ బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలు ఉన్నట్టుగా సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అందుకోసం నారాయణ రూ.16.50 కోట్లను అక్రమంగా తరలించారు. అందుకు ప్రతిగా 148 ఎకరాలను పొందారు. ఆ 148 ఎకరాలకు సీఆర్‌డీఏ భూసమీకరణ కింద ఇచ్చింది రూ.816 కోట్లు విలువైన స్థలాల ప్యాకేజీ. ఆ భూములకు పదేళ్లపాటు కౌలు కూడా పొందగలుగుతారు. బినామీ రైతులకు సీఆర్‌డీఏ ఇప్పటికే చెల్లించిన కౌలు మొత్తం రూ. 50 లక్షలు మళ్లీ రామకృష్ణ హౌసింగ్ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అక్కడ నుంచి ఆ మొత్తాన్ని మళ్లీ నారాయణ విద్యా సంస్థల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయడం గమనార్హం. అంటే అసైన్డ్ భూములు దక్కించుకుంది నారాయణే అన్నది స్పష్టమైంది. అదే రీతిలో చంద్రబాబు, గంటా, ప్రత్తిపాటి, దేవినేని ఉమా, ఇతర టీడీపీ పెద్దలు, వారి బంధువులు బినామీల ద్వారా 617 ఎకరాల్లో ఎంత భారీ దోపిడీకి పాల్పడ్డారో స్పష్టమవుతుంది.

నారా లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

శనివారం ఉదయం నుంచి లోకేశ్ ఎక్కడున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేశారు. ఓ హోటల్‌లో ఉన్నారని, ఎంపీ ఇంట్లో ఉన్నారని ఇలా ఊహాగానాలు రావడంతో పూర్తి సమాచారం వచ్చే వరకూ వేచి చూశారు. మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో లోకేశ్ ఎంపీ గల్లా జయదేవ్ అధికారిక నివాసానికి వచ్చారు. దీంతో అధికారులు ఎంపీ జయదేవ్‌తో మాట్లాడారు. అశోకారోడ్-50లోని తన నివాసంలో లోకేశ్ ఉన్నారని జయదేవ్ వారికి తెలిపారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సీఐడీ అధికారులు ఎంపీ జయదేవ్ నివాసానికి చేరుకున్నారు. వారిని తొలుత లోపలికి రానీయకుండా గేటు వద్దే అడ్డుకొన్నారు. విధుల్లో ఉన్న అధికారులను అడ్డుకోవడం సమంజసం కాదని అధికారులు తెలిపారు. లోకేశ్ బయటకు వస్తే నోటీసులు అందజేసి వెళ్లిపోతామని చెప్పారు. కొద్దిసేపటికి లోకేశ్ బయటకు రారని గేటు వద్ద ఉన్న సిబ్బంది అధికారులకు తెలిపారు. అనంతరం టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ బయటకు వచ్చి అధికారులతో మాట్లాడారు. వారిని లోపలికి తీసుకెళ్లారు. 20 నిమిషాల అనంతరం బయటికి వచ్చిన అధికారులు లోకేశ్‌కు నోటీసులు ఇచ్చినట్లుగా అధికారికంగా ప్రకటించారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై తాము మాట్లాడబోమని మీడియాకు తెలిపారు.

ఎందుకొచ్చారు? నోటీసులెందుకు?

అధికారులను లోకేశ్ ఎందుకొచ్చారని ప్రశ్నించినట్లు సమాచారం. నోటీసులు ఎందుకు? ఏ కేసులో నోటీసులు ఇస్తున్నారని అడిగినట్లు సమాచారం. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణంలో విచారణ నిమిత్తం నోటీసులు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. అనంతరం లోకేశ్‌కు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా నోటీసులు అందుకున్నట్లు లోకేశ్ ధ్రువీకరించినట్లు తెలిసింది. అంతకు ముందు సీఐడీ అధికారులను ఎంపీ జయదేవ్ నివాసంలోకి రానివ్వకపోవడంతో వారు లోకేశ్‌కు వాట్సాప్‌లో నోటీసులు పంపినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని అధికారులతోనూ లోకేశ్ ప్రస్తావించినట్లు సమాచారం. నోటీసును చదువుకుంటానని, న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడతారని లోకేశ్ వారికి చెప్పినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఆయా సెక్షన్లు గురించి లోకేశ్‌కు వివరించినట్లు సమాచారం.

నోటీసుల్లో ఉన్న వివరాలివీ..!

ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణంలో నారా లోకేశ్‌కు సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసుల్లో.. 'క్రైమ్ నం. 16/2022 ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఐపీసీ సెక్షన్లు 120 (బి), 409, 420, 34, 35, 36, 37, 166, 167, 217, మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 13(2) రెడ్‌విత్ 13(1) (సి) (డి)లో దర్యాప్తు మేరకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ సబ్ సెక్షన్ (1) ప్రకారం నోటీసులు ఇస్తున్నాం. ప్రస్తుత విచారణకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి, ప్రశ్నించడానికి తగిన కారణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబరు 4న ఉదయం పది గంటలకు తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో హాజరు కావాలి' అని నోటీసుల్లో పేర్కొంది. వీటిలో 10 అంశాలను సీఐడీ స్పష్టంగా పేర్కొంది. ఆ అంశాలివీ..

- భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు
- ఇన్నర్ రింగ్ రోడ్ కేసుకు సంబంధించిన సాక్ష్యాలు తారుమారు చేయకూడదు
- కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులెవరినీ బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం చేయకూడదు
- ఎప్పుడు పిలిచినా /ఆదేశించినా కోర్టుకు హాజరుకావాలి
- విచారణకు ఎప్పుడు పిలిచినా వచ్చి అధికారులకు సహకరించాలి
- కేసుకు సంబంధించి వాస్తవాలు వెల్లడించాలి
- హెరిటేజ్ ఫుడ్స్ బ్యాంకు ఖాతా వివరాలు అధికారులకు అందజేయాలి
- భూముల కొనుగోలుకు సంబంధించి హెరిటేజ్ బోర్డు డైరెక్టర్ల మీటింగ్ మినిట్స్ ఇవ్వాలి
- అమరావతి భూ కొనుగోలు లావాదేవీలు విచారణకు హాజరయ్యే సమయంలో తీసుకురావాలి
- నోటీసులు అందుకున్న తర్వాత విచారణకు రాకపోయినా, నిబంధనలు పాటించకపోయినా సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ (3), (4) ప్రకారం అరెస్టు తప్పదు.

లవ్ లెటర్ అందింది: లోకేశ్

సీఐడీ అధికారులు ఇచ్చిన నోటీసును నారా లోకేశ్ లవ్ లెటర్‌గా అభివర్ణించారు. ఢిల్లీలో సీఐడీ అధికారులు వచ్చి వెళ్లిన రెండు గంటల తర్వాత ఆయన మీడియా ముందుకొచ్చారు. సీఐడీ అధికారులు వస్తున్న విషయం తెలుసుకొని జాతీయ, రాష్ట్ర మీడియా ప్రతినిధులు సాయంత్రం ఎంపీ జయదేవ్ నివాసం వద్దకు చేరుకున్నారు. అయితే, వారిని లోపలికి అనుమతించలేదు. సీఐడీ అధికారులు వెళ్లిన తర్వాత లోకేశ్ వెంటనే మీడియా ముందుకు రాలేదు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ ఇచ్చిన పిలుపుమేరకు రాత్రి 7 గంటలకు గంటలు మోగించారు. ఆ తర్వాత లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తనపై మోపినవి దొంగ కేసులని, ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. తాము ఎక్కడికీ పారిపోబోమన్నారు. సీఐడీ వాళ్లు వచ్చి లవ్ లెటర్ ఇచ్చారని తెలిపారు. సీఐడీని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగమని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై కక్ష సాధిస్తున్నారని, అందులో భాగంగానే జ్యుడిషియల్ రిమాండుకు పంపారని అన్నారు. తప్పుడు కేసు పెట్టినందుకు దర్యాప్తు అధికారి, డీజీపీపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానన్నారు. 4న సీఐడీ ముందు హాజరవుతానని, వాయిదాలు అడిగే అలవాటు లేదని చెప్పారు.

బాబు మాజీ పీఎస్ 'పెండ్యాల' సస్పెన్షన్

- ప్రభుత్వానికి చెప్పకుండా అమెరికా పారిపోయిన శ్రీనివాసరావు
- ప్రస్తుతం ప్రణాళికా శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా శ్రీనివాస్



సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటుపడింది. ఈయన ప్రస్తుతం ప్రణాళికా శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. స్కిల్ కుంభకోణం కేసుతో పాటు ఐటీ నోటీసుల్లో పెండ్యాల శ్రీనివాసరావు పేరు ఉంది. విచారణ నిమిత్తం సీఐడీ గతంలో ఆయనకు నోటీసులు కూడా జారీచేసింది. అయితే, ఆయన ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా అమెరికాకు పారిపోయారు. ప్రభుత్వం అనుమతిలేకుండా అమెరికాకు వెళ్లడం సర్వీసు రూల్స్‌ను అతిక్రమించడమేనని సర్కారు స్పష్టంచేసింది. మరోవైపు.. శ్రీనివాసరావు శుక్రవారంలోగా రాష్ట్రానికి తిరిగి రావాల్సిందిగా ప్రభుత్వం నోటీసు పంపింది. అయితే, ఆయన రాకపోవడంతో సర్వీసు నిబంధనల మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శ్రీనివాసరావుపై సస్పెన్షన్ తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు కొనసాగుతుందని ప్రభుత్వం అందులో స్పష్టంచేసింది. ఈ కాలంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని పేర్కొంది. సస్పెన్షన్ సమయంలో శ్రీనివాసరావుకు నిబంధనల మేరకు అలవెన్స్‌ను చెల్లించనున్నట్లు అందులో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పెండ్యాల పారిపోయింది ఇలా..

- అమెరికాలో తన తోడల్లుడి గృహప్రవేశంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉండటంతో సెలవు కోరుతూ ఆగస్టు 23న ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు.
- స్కిల్ కుంభకోణంలో విచారించడానికి సీఐడీ ఆయనకు నోటీసులిచ్చినట్లు సెప్టెంబర్ 5, 6 తేదీల్లో వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయి.
- దీంతో అత్యవసర ఆరోగ్య పరీక్షల కోసం తక్షణం అమెరికా వెళ్లాలంటూ సెప్టెంబర్ 5న మరో లేఖ రాశారు. కానీ, ఈ లేఖతో ఆరోగ్యానికి సంబంధించి కానీ, డాక్టరు సిఫార్సు లేఖ కానీ జతచేయలేదు.
- సెప్టెంబర్ 6న ప్రభుత్వ సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి లేకుండానే అమెరికా వెళ్లిపోయారు.
- అనంతరం.. ఆరోగ్యం బాగోలేదు దానితో వెంటనే అమెరికా వెళ్లిపోయాను, లీవ్ ఇవ్వమని కోరుతూ సెప్టెంబర్ 7న లేఖ రాశారు. సాధారణంగా ఇటువంటి సెలవులకు కనీసం 10 రోజుల ముందుగా లేఖ రాయాల్సి ఉంటుంది.
- ఇక ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన హఠాత్తుగా అమెరికా వెళ్లిపోయారని నిర్ధారించుకున్న తర్వాత సెప్టెంబర్ 13న సెలవును తిరస్కరించారు.
- తక్షణం విధుల్లో చేరాల్సిందిగా మెమో జారీ చేయగా సెప్టెంబర్ 20న సెలవు కోరుతూ మరో లేఖ రాశారు.
- ఆ తర్వాత మరో మూడ్రోజుల అదనపు సమయం ఇచ్చినా విధుల్లో చేరకపోయేసరికి ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

లంచాలు తినేసి.. కంచాలు మోగిస్తారా?

- బకాసురుడిలా తినేసి శ్రీకృష్ణుడి వేషం వేస్తారా!
- చంద్రబాబు అవినీతి మోత మోగించారు
- ఆయనకు విదేశాల్లో రూ.ఐదారు లక్షల కోట్ల ఆస్తులు
- తప్పు చేయలేదని భావిస్తే కోర్టులో విచారణ ధైర్యంగా ఎదుర్కోవాలి
- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



సాక్షి, తిరుపతి: లంచాలు తినేసి.. కంచాలు మోగిస్తారా అని వైఎస్సార్‌సీపీ దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. తిరుపతిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు స్టే తెచ్చుకున్న అన్ని కేసుల్లోనూ స్టే ఎత్తివేయాలని కోరి తన నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టీడీపీ నేతలు కంచాల మోతకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 'బకాసురుడి బావమరుదులంతా శ్రీకృష్ణుడి వేషం వేస్తారా.. అవినీతికి సిగ్గుపడాల్సిందిపోయి, సింగారించుకుని బయటకొచ్చి కంచాలు మోత మోగిస్తారా' అని విరుచుకుపడ్డారు. చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు మోగించిన అవినీతి మోత కారణంగానే ఇప్పుడు ఇంట్లో ఈగల మోత, జైలులో దోమల మోత అన్న చందంగా ఆయన పరిస్థితి తయారైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం నాలుగేళ్లలోనే రూ.2.35 లక్షల కోట్ల మేర సంక్షేమ పథకాలు కింద అందిస్తే.. చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కేంద్ర నిధులు దోచేసినందుకు కంచాలు మోగిస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు దోషిగా ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని కోర్టులు నమ్మినందునే ఆయన పిటిషన్‌ను తిరస్కరించాయని అన్నారు.

దర్యాప్తు సంస్థల ఎదుట కొట్టండి

చంద్రబాబు చేసిన అవినీతి కేసులో ఈడీ నలుగుర్ని అరెస్ట్ చేసిందని, చంద్రబాబు రూ.119 కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆదాయ పన్ను శాఖ నోటీస్ ఇచ్చిందని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడన్న ఆదాయ పన్ను శాఖ కార్యాలయం ముందు, ఈడీ కార్యాలయం ముందు లోకేశ్, టీడీపీ ఎంపీలు, టీడీపీకి తొత్తులుగా ఉన్న పురందేశ్వరి, సీఎం రమేష్, రేవంత్‌రెడ్డి, జయప్రకాష్ నారాయణ, సత్యకుమార్, సీపీఐ నారాయణ, రామకృష్ణతో కలిసి కంచాల మోత మోగించాలన్నారు. 'ప్రతి విషయంలో అడ్డంగా తినేసి బకాసురులంతా కంచాలు మోగిస్తారా.. రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి, ఆర్థిక మంత్రి కార్యాలయాల వద్ద కదా ఆ పని చేయాల్సింది. మరి ఇక్కడ మోగించడం ఏమిటి' అని నిలదీశారు. తండ్రి అరెస్ట్ తరువాత ఢిల్లీలో దాక్కొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లోకేశ్ ధైర్యవంతుడా.. ఉత్తర కుమారుడా అని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతికి మద్దతుగా పచ్చ పత్రికలు, చానళ్ల యజమానులు కూడా కంచాల మోత మోగిస్తున్నారన్నారు. 'ప్రాజెక్ట్ లేకుండానే నిధులు తినేశారనేది మా వాదన. అలా సొమ్ము తినేయడమే చంద్రబాబు స్కిల్. అందుకే అతన్ని స్కిల్డ్ క్రిమినల్ అని చెప్పడం అతిశయోక్తి కాదు' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. హెరిటేజ్‌లో స్కామ్ జరిగిందని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామని, దోషులు ఎవరన్నది విచారణలో తేలిపోతుందని అన్నారు. చంద్రబాబు దేశ, విదేశాల్లో రూ.ఐదారు లక్షల కోట్ల ఆస్తులు కూడబెట్టారన్నారు.

మీ నిజాయితీని కోర్టుల్లో తేల్చుకోండి

'అసలు మీరేం చెప్పదలచుకున్నారు రాష్ట్ర ప్రజలకు. మీరు అవినీతిపరులు కాదని చెప్పుకోదల్చుకున్నారా? అలా అయితే విచారణకు మీరు రెడీ కావాలి. సీఐడీ దర్యాప్తునకు సహకరించాలి. మీ నిజాయితీని కోర్టుల్లో తేల్చుకోండి. స్టే తెచ్చుకోకుండా విచారణ పూర్తయితే మీరు నీతిమంతులా.. అవినీతిపరులా అన్నది తేలిపోతుంది. మీరు నిజంగా నీతిమంతులైతే ఈ సవాల్ స్వీకరించి.. 10 కేసుల్లో మీరు ఎక్కడైతే స్టే తెచ్చుకున్నారో.. ఆ స్టేలు ఎత్తివేయాలని కోర్టులను కోరాలి' అని విజయసాయిరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ త్వరలోనే విశాఖకు మారుతున్నారని, అక్కడి నుంచే పరిపాలన జరుగుతుందని విజయసాయిరెడ్డి చెప్పారు. ముందస్తు ఎన్నికల ప్రసక్తే లేదని, షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయని, అఖండ మెజారిటీతో వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. ఆయన వెంట ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి ఉన్నారు.

మోగని మోత

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ కేడర్ కూడా బయటకు రాలేదు. దీంతో అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేస్తూ నాయకులు బయటకు వచ్చి ఆందోళనలు చేయాలని పదేపదే వేడుకొన్నారు. ఆ ఆడియో క్లిప్‌ను అందరూ విన్నారు. ఆ తర్వాత టీడీపీ నిర్వహించిన రాష్ట్ర బంద్ సహా ఏ కార్యక్రమాన్నీ జనం పట్టించుకోలేదు. ఒకవైపు వరుస అవినీతి కేసులతో చంద్రబాబు విశ్వరూపం బయటపడుతుండటం, కోర్టుల్లో సైతం వారి వాదనలు వీగిపోతుండటంతో ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతున్నాయి. దీంతో టీడీపీ చేస్తున్న ప్రయత్నాలతో ఆ పార్టీకి కనీస సానుభూతి కూడా రావడంలేదు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. అయినా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి ప్రజలను ఏమార్చడానికి టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా శనివారం మోత కార్యక్రమం పెట్టారు. అదీ విఫలమవడంతో వారిలో ఆందోళన పెరిగిపోయింది.

డమరుకం మోగించి, విజిల్ ఊది బ్రాహ్మణి నిరసన



విజిల్ ఊదుతున్న బ్రాహ్మణి

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టీడీపీ నాయకులు శనివారం సాయంత్రం 7 నుంచి 7.05 గంటల వరకు 'మోత మోగిద్దాం' పేరుతో శబ్దాలు చేశారు. రాజమహేంద్రవరంలోని లోకేశ్ క్యాంప్ వద్ద ఆయన సతీమణి నారా బ్రాహ్మణి తమ పార్టీ నేతలతో కలిసి డమరుకం మోగించారు. బూర ఊదడంతోపాటు విజిల్ వేసి, డప్పు వాయించి నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు మద్దతుగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్ 21వ రోజుకు చేరుకుంది.

2న భువనేశ్వరి నిరాహారదీక్ష

- త్వరలో జనసేన–టీడీపీ జాయింట్ యాక్షన్ కమిటీ
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడి



సాక్షి, అమరావతి/సాక్షి, నంద్యాల: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అక్టోబర్ 2వ తేదీన ఆయన సతీమణి భువనేశ్వరి ఒక్క రోజు నిరాహారదీక్ష చేస్తారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. నంద్యాలలో శనివారం పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ నిర్ణయాలను అచ్చెన్నాయుడు మీడియాకు వెల్లడించారు. నారా భువనేశ్వరి రాజమండ్రిలో దీక్ష చేసే రోజు రాత్రి 7 గంటల నుంచి 5 నిమిషాల పాటు తమ ఇంట్లోని లైట్లు అన్నింటినీ ఆపి బయటకు వచ్చి కొవ్వొత్తులతో నిరసన తెలపాలని మద్దతుదారులను కోరారు. చంద్రబాబు అరెస్టు బాధతో 97 మంది చనిపోయారని, ఆయన విడుదలైన తర్వాత వారి కుటుంబాలను కలిసి అండగా నిలబడే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. త్వరలో జనసేన–తెలుగుదేశం పార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జనసేన నుంచి ఐదుగురిని, టీడీపీ నుంచి ఐదుగురిని ఎంపిక చేసి ఈ కమిటీ ద్వారా క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మచిలీపట్నం పర్యటనలో టీడీపీ శ్రేణులు, నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి అన్ని పార్టీలను కలుపుకొని పనిచేస్తామన్నారు.

కోర్టులకు భయపడం: బాలకృష్ణ

ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. కేసులకు, కోర్టులకు తాము భయపడబోమన్నారు. రాష్ట్రంలోని సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికే చంద్రబాబుపై కేసులు పెట్టారని ఆరోపించారు. లోకేశ్ యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందనను చూసి తట్టుకోలేక ఆయన్ను కూడా కేసులతో వేధించాలని ప్రభుత్వం చూస్తోందని, లోకేశ్ వెంట్రుక కూడా పీకలేరని అన్నారు. ఢిల్లీ నుంచి లోకేశ్ జూమ్ ద్వారా పీఏసీ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, యనమల రామకృష్ణుడు, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాపులు కంచాలు కొడితే కేసులు పెట్టారు కదా!

ఇప్పుడు టీడీపీ వారిపైనా కేసులు పెట్టాలి: మాజీ మంత్రి కన్నబాబు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నబాబు. చిత్రంలో ఎంపీ వంగా గీత

కాకినాడ రూరల్: కాపు ఉద్యమం సమయంలో ముద్రగడ పద్మనాభం పిలుపు మేరకు కాపులు కంచాలు కొడితే కేసులు పెట్టారని, ఇప్పుడు స్కిల్ స్కామ్‌లో జైలులో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా కంచాలు కొట్టిన తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు పెట్టరా... అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రశ్నించారు. కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో శనివారం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ 'ముద్రగడ పిలుపు మేరకు కంచాలు కొడితే వందలాది మంది కాపులు, యువతపై కేసులు పెట్టారు. అప్పుడు తప్పు అయితే.. ఇప్పుడు కంచాలు కొట్టినా తప్పే అవుతుంది. చంద్రబాబు ఆ రోజు తప్పు అని చెప్పినట్టే... ఇప్పుడూ తప్పే కాదా... టీడీపీ నాయకులు, వారికి మద్దతు ఇచ్చిన నాయకులపై కచ్చితంగా కేసులు పెట్టాలి. మీకు ఒక న్యాయం, కాపులకు ఒక న్యాయమా..' అని అన్నారు. చంద్రబాబు స్కిల్ స్కామ్ ద్వారా రూ.371కోట్లు ప్రజల ధనాన్ని దోచుకున్నారని, ఆయనకు మద్దతుగా నిరసనలు చేస్తారా.. అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీ వంగా గీత తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్ సూత్రధారి లోకేశ్

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి సురేష్





కార్వేటినగరం/ఒంగోలు (సబర్బన్): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ సూత్రధారి నారా లోకేశ్ అని ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం వారు ఒంగోలు, చిత్తూరు జిల్లా గోపిశెట్టిపల్లిలో మీడియాతో మాట్లాడారు. రింగ్ రోడ్ ప్లాన్‌ను లోకేశ్ మూడుసార్లు మార్చి దోపిడీ పర్వానికి తెరలేపితే.. నిబంధనలకు విరుద్ధంగా టెండర్ లేకుండా నామినేషన్ పద్ధతిపై వ్యవహారం నడిపి అమరావతి రాజధానిని నిలువునా ముంచిన నయవంచకుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. అసలు ఇన్నర్ రింగ్ రోడ్ లేకుండా డ్రాఫ్ట్ ప్లాన్, రివైజ్డ్ ప్లాన్, మాస్టర్ ప్లాన్, ఫైనల్ ప్లాన్ అంటూ గ్రాఫిక్స్ చూపించి రోడ్డు వేయకుండానే ప్లాన్ల కోసం రూ.28.96 కోట్లు కాజేశారని ఆరోపించారు. లింగమనేనికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చి.. ఆయన గెస్ట్‌హౌస్‌లో కాపురం ఉండటం లేదా అని ప్రశ్నించారు. ఇన్నర్ రింగ్ రోడ్ పేరుచెప్పి చంద్రబాబు, లోకేశ్ అప్పటి మంత్రి పొంగూరు నారాయణతో కలిసి దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. లింగమనేని (ఎల్), హెరిటేజ్ (హెచ్), నారా (ఎన్) పేర్లతో రింగ్ రోడ్డును వారి భూముల మీదుగా పోయేవిధంగా మూడుసార్లు మార్చి దోపిడీ పర్వానికి తెరలేపారన్నారు. అన్ని ఆధారాలతో చంద్రబాబు సీఐడీకి పట్టుబడగా.. దీనిని అడ్డం పెట్టుకుని ప్రజల సానుభూతి పొందేందుకు టీడీపీ నాయకులు రివర్స్ డ్రామా ఆడుతూ మభ్యపెట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు.



దుర్మార్గుడు నీతిమంతులకు హేయుడు.
యథార్థవర్తనుడు భక్తిహీనునికి హేయుడు.
– క్రైస్తవ ధర్మం

బ్రాండ్ బాబు బాగోతం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ! తప్పించుకు తిరిగేవాడు దొరికితే సంచలనమే సుమీ!! చార్లెస్ శోభరాజ్ వంటి కరుడుగట్టిన నేరస్తుడు అరెస్టయితేనే అప్పట్లో అదో సంచలన వార్తయింది. అటువంటిది మన అతిపెద్దమనిషి చంద్రబాబు అరెస్టయితే సంచలనం కలగకుండా ఉంటుందా? ఆయనపై ఇప్పటివరకు కనీసం రెండు డజన్ల పెద్దస్థాయి అవినీతి ఆరోపణలు వచ్చాయి. కనీసం ఒక్కదానిపై కూడా విచారణ జరక్కుండా అడ్డుచక్రాన్ని గిరగిరా తిప్పి విసరడంతో ఆయన చూపుడు వేలు నేర్పరితనం ఇప్పటికే రికార్డు పుటల్లోకి ఎక్కింది.

చంద్రబాబును సెంట్రల్ జైలుకు పంపించిన అభియోగాలు ఇప్పుడు న్యాయస్థానాల పరిశీలనలో ఉన్నాయి. కనుక వాటి మీద చర్చను పక్కనపెడితే, ఆయన అరెస్టు మాత్రం పెద్ద వార్తే అయింది. పెద్ద వార్తల చుట్టూ అనేక పిల్ల వార్తలూ, పిట్టకథలూ, ఉపాఖ్యానాలు, వ్యాఖ్యానాలు చేరిపోవడం సహజం. అలా చేరిపోయిన వాటిలో పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని ఇద్దరు నాయకుల రాజకీయ వ్యాఖ్యానాలు మరో చర్చకు దారితీశాయి. ఐటీ ఉద్యోగుల పేరుతో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ వారు రెండు, మూడు ఊరేగింపులు చేశారు. దీనిపై కేటీఆర్ అభ్యంతరం చెబుతూ 'పక్క రాష్ట్ర రాజకీయ అంశంపై ఇక్కడెందుకు నిరసనలు? ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతల సమస్య సృష్టించడమెందుకని ప్రశ్నించారు. వెంటనే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దానిపై స్పందించారు. చంద్రబాబు జాతీయ నాయకుడనీ, ఆయన కోసం ఎక్కడైనా ఆందోళన చేయవచ్చనీ చెబుతూనే 'బీఆర్‌ఎస్‌కు ఆంధ్ర వాళ్ల ఓట్లు కావాలి గానీ, వాళ్ల సమస్యలు అక్కర్లేదా' అని వ్యాఖ్యానించారు.

ఈ చర్చలో అంతర్లీనంగా రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి – ఐటీ రంగ అభివృద్ధికీ, హైదరాబాద్ అభివృద్ధికీ మారుపేరుగా చంద్రబాబును ప్రస్తావిస్తూ ఒక ఫేక్ బ్రాండ్ ఇమేజ్‌ను గత పాతికేళ్లుగా యెల్లో మీడియా పోషించుకుంటూ వస్తున్నది. దాని కొనసాగింపుగానే ఐటీ ఉద్యోగులంతా చంద్రబాబును తమ తాతపాదుల వారిగా తలపోస్తున్నారనే భ్రాంతిని సృష్టించడం కోసం ఈ ర్యాలీలను తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. ఈ ర్యాలీల్లో కూడా ఒక సామాజిక వర్గమే ప్రధాన భూమికను పోషించిందన్న మాట కూడా ఒక నిష్ఠుర సత్యం. ఇక రెండో అంశం – తెలంగాణలో ఆంధ్రావాళ్ల ఓట్లు. సెటిలర్ల ఓట్లన్నీ గంపగుత్తగా తెలుగుదేశం పార్టీ ఖాతాలో, బాబు కనుసైగల అజమాయిషీలో ఉన్నట్టు కూడా యెల్లో మీడియా మరో భ్రాంతి జనిత బ్రాండ్‌ను సృష్టించింది.

ఇద్దరు తెలంగాణ నాయకుల వ్యాఖ్యలు యథాలాపమా, ఆలోచనాపూర్వకమా అనే విషయం వారికి మాత్రమే తెలుసు. కానీ ఆచరణలో అవి స్పష్టమైన పాత్రనే నిర్వహించాయి. చంద్రబాబు మీద కప్పిన ఫేక్ బ్రాండ్ ముసుగును తొలగించే ప్రయత్నం కేటీఆర్ వ్యాఖ్యల్లో కనిపిస్తే, ఆ ముసుగును కాపాడే అంతరార్థం రేవంత్‌రెడ్డి మాటల్లో ధ్వనించింది. రేవంత్‌రెడ్డికి పూర్వాశ్రమంలో చంద్రబాబుతో ఉన్న సాహచర్యం కారణంగా అలా కావాలని మాట్లాడి ఉండవచ్చేమో! చంద్రబాబు పట్ల ఆయన సానుకూల స్పందన పెద్ద విశేషమేమీ కాదు. కానీ, ఆ నకిలీ బ్రాండ్ ముసుగును తొలగించడం బీఆర్‌ఎస్‌కు కచ్చితంగా ఒక రాజకీయ అవసరం. తమ హయాంలో జరిగిన నగరాభివృద్ధినీ, ఐటీ పురోగతినీ కూడా యథేచ్ఛగా యెల్లో మీడియా చంద్రబాబు ఖాతాలో వేస్తుంటే ఏ ప్రభుత్వమైనా ఎంతకాలం భరిస్తుంది?

తెలుగుదేశం పార్టీ నేతలకు తమిళ సినిమారంగ స్టార్ రజనీకాంత్ సన్నిహితుడు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సమయంలో ఆయన హైదరాబాద్‌కు వచ్చి మరీ చంద్రబాబు గ్యాంగ్‌కు మద్దతు పలికిన సంగతి చాలా మందికి గుర్తే. ఆయన ఈమధ్య మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్తే న్యూయార్క్‌కు వెళ్లినట్లుంటుందని చెబుతూ, అందుకు చంద్రబాబే కారకుడని ఓ వీరతాడును ఆయన మెడలో వేశారు. ఈ పదేళ్లలో హైదరాబాద్‌లో జరిగిన పరిణామాలకూ, ఇరవయ్యేళ్ల కిందనే తోక ముడిచిన చంద్రబాబుకూ ఏరకమైన సంబంధముంటుంది? ఇటువంటి ఘటనలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు సహజంగానే అసౌకర్యాన్ని కలిగిస్తాయి. ఆ అసౌకర్యమే కేటీఆర్ మాటల్లో వెల్లడై ఉండవచ్చు.

> తెలంగాణ నాయకులు కేటీఆర్, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు యథాలాపమా, ఆలోచనాపూర్వకమా అనే విషయం వారికి మాత్రమే తెలుసు. కానీ ఆచరణలో అవి స్పష్టమైన పాత్రనే నిర్వహించాయి. చంద్రబాబు మీద కప్పిన ఫేక్ బ్రాండ్ ముసుగును తొలగించే ప్రయత్నం కేటీఆర్ వ్యాఖ్యల్లో కనిపిస్తే, ఆ ముసుగును కాపాడే అంతరార్థం రేవంత్‌రెడ్డి మాటల్లో ధ్వనించింది. రేవంత్‌రెడ్డికి పూర్వాశ్రమంలో బాబుతో ఉన్న సాహచర్యం కారణంగా అలా కావాలని మాట్లాడి ఉండవచ్చేమో! బాబు పట్ల ఆయన సానుకూల స్పందన పెద్ద విశేషమేమీ కాదు. కానీ, ఆ నకిలీ బ్రాండ్ ముసుగును తొలగించడం బీఆర్‌ఎస్‌కు కచ్చితంగా ఒక రాజకీయ అవసరం. తమ హయాంలో జరిగిన నగరాభివృద్ధినీ, ఐటీ పురోగతిని కూడా యథేచ్ఛగా యెల్లో మీడియా చంద్రబాబు ఖాతాలో వేస్తుంటే ఏ ప్రభుత్వమైనా ఎంతకాలం భరిస్తుంది?
>
> టీడీపీ నేతలకు తమిళ సినిమారంగ స్టార్ రజనీకాంత్ సన్నిహితుడు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సమయంలో ఆయన హైదరాబాద్‌కు వచ్చి మరీ బాబు గ్యాంగ్‌కు మద్దతు పలికిన సంగతి చాలా మందికి గుర్తే. ఆయన ఈమధ్య మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్తే న్యూయార్క్‌కు వెళ్లినట్లుంటుందని చెబుతూ, అందుకు బాబే కారకుడని ఓ వీరతాడును ఆయన మెడలో వేశారు. ఈ పదేళ్లలో హైదరాబాద్‌లో జరిగిన పరిణామాలకూ, ఇరవయ్యేళ్ల కిందనే తోక ముడిచిన చంద్రబాబుకూ ఏరకమైన సంబంధముంటుంది?

యెల్లో మీడియాను మాత్రమే అనుసరించే వారి మెదళ్లలో ఈ ఫేక్ బ్రాండ్ గుజ్జు ఎంత నిండిందో తెలియజెప్పే ఉదంతమొకటి ఈమధ్యనే మీడియాలో కనిపించింది. బాబు అరెస్టుకు నిరసన తెలియజేస్తున్న 'ఐటీ ఉద్యోగుల్లో' ఒక యువతి ముందు మన యెల్లో మీడియా మైకు పెట్టింది. "సీబీఎన్ అరెస్టును తెలంగాణ ప్రభుత్వం ఖండించలేదండీ! ఎందుకంటే ఇప్పుడు సీబీఎన్ బయటకొస్తే ఆటోమేటిక్‌గా ఏపీ డెవలపయి పోతుంది. తెలంగాణ వెనకబడుతుంది. అందుకని వాళ్లు ఖండించరు". ఆహా ఎంత పరిణతి! సాక్షాత్తూ జ్ఞాన సరస్వతీ దేవి ఉపదేశమా ఇది. "తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ ... ... సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా!" మనం మరోసారి అక్షరాభ్యాసం చేయాల్సిందే. నిన్నటిదాకా ఆయన బయటే ఉన్నాడు కదమ్మా. ఐదేళ్లు అధికారంలో కూడా ఉన్నాడు కదమ్మా. మరి ఆటోమేటిగ్గా ఏపీ అగ్రస్థానంలోకి ఎందుకు దూసుకెళ్లలేదు తల్లీ అనే సహజమైన ప్రశ్న కూడా ఆ దిగ్భ్రాంతి క్షణాన ఎవరికీ జనించి ఉండదు.

ఆధిపత్య వర్గాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రచార సాధనాల (మీడియా) ద్వారా ప్రజాభిప్రాయాన్ని ఎలా ఉత్పత్తి చేసుకుంటాయో (manufacturing consent) తెలియజెప్పే సిద్ధాంత పత్రాన్ని అమెరికా మేధావులు నోమ్ చోమ్‌స్కీ, ఎడ్వర్డ్ హెర్మాన్‌లు వెలువరించారు. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి రాకపూర్వమే అమెరికా పరిస్థితులను అధ్యయనం చేసి వారు ఈ థియరీని ప్రతిపాదించారు. కానీ, ప్రస్తుత మన యెల్లో మీడియా కర్మాగారాలను, వాటి ఉత్పత్తులను చూసి ఉంటే పరిశోధన పక్కనపెట్టి మూర్ఛపోయేవారు. ఈ కర్మాగారాల్లో తయారైన అతి ముఖ్యమైన ఉత్పత్తి 'బ్రాండ్ బాబు'! ఐటీకి ఆద్యుడుగా, అభివృద్ధికి రోల్‌మోడల్‌గా, హైదరాబాద్ నిర్మాతగా బ్రాండ్ బాబును ప్రచారంలో పెట్టారు. ఇప్పుడీ బ్రాండ్ బాబు ఇమేజిపై పోస్ట్‌మార్టమ్ జరిగి తీరాలి. వర్తమాన చరిత్రకు జరుగుతున్న వక్రీకరణను సరిచేయవలసిన బాధ్యత కూడా వర్తమాన సమాజానిదే!

హైదరాబాద్‌లోనే కాదు, మొత్తం దేశంలో కూడా ఐటీ అభివృద్ధికి సంబంధించి ఏ ఒక్కరికో క్రెడిట్ ఇవ్వాల్సి వస్తే అది మన తెలుగుజాతి కీర్తికిరీటం పీవీ నరసింహారావుకే దక్కాలి. ఆయన ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో హైదరాబాద్ మొదటిది. చంద్రబాబు నిర్మించినట్టుగా మనం చదువుకుంటున్న హైటెక్ సిటీ లేదా సైబర్ టవర్స్‌కు 1993లోనే అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి శంకుస్థాపన చేశారు. దేశంలోనే పెద్దవైన ఐదు ఐటీ కంపెనీల్లో ఒకటైన సత్యం కంప్యూటర్స్ (టెక్ మహీంద్ర) 1987లోనే ఏర్పాటైంది. 1995లో జరిగిన వెన్నుపోటు పట్టాభిషేకం నాటికి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో హైదరాబాద్‌ది మూడో స్థానం. 2004లో చంద్రబాబు గద్దె దిగేనాటికి నాలుగో స్థానం. ఆ తర్వాత వైఎస్‌ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది. ఐటీ ఎగుమతుల్లో ఇప్పుడు హైదరాబాద్‌ది దేశంలో రెండో స్థానం. గూగుల్, ఫేస్‌బుక్, ఆపిల్, క్వాల్‌కామ్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు వాటి అతిపెద్ద క్యాంపస్‌లను (అమెరికా వెలుపల) హైదరాబాద్‌లో చంద్రబాబు అనంతర కాలంలోనే ఏర్పాటు చేశాయి.

ఐటీ రంగం విస్తృతమవుతున్న నేపథ్యంలో నేదురుమల్లి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కొత్తగా 11 ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతినిస్తే, వాటికి వ్యతిరేకంగా చంద్రబాబు నేతృత్వంలో యెల్లో మీడియా ఆధ్వర్యంలో, కమ్యూనిస్టుల తోడ్పాటుతో, పెద్ద ఉద్యమాన్ని లేవదీసి వాటిని ఆపేశారు. చంద్రబాబు గద్దెనెక్కగానే ఏకంగా 30 కాలేజీలను ప్రారంభించారు. ఎవరూ కిమ్మనలేదు. ఆ పదకొండు ఎవరికి చెందినవి, ఈ 30 ఎవరివి అనేది ఒక ప్రత్యేక రాజకీయ – సామాజిక అధ్యయనాంశం. ఇప్పుడు అప్రస్తుతం. వైఎస్‌ఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఇంజనీరింగ్ మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లే విద్యార్థుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో వీసాల కోసం అమెరికా కాన్సులేట్ కార్యాలయాన్ని వైఎస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారు.

ఇవన్నీ వాస్తవాలు! చెరిపేస్తే చెరిగిపోయేవి కావు. ఎవరైనా రికార్డులను పరిశీలించుకోవచ్చు. ఔటర్ రింగ్ రోడ్డును, శంషాబాద్ ఎయిర్‌పోర్టును కూడా యెల్లో మీడియా బాబు ఖాతాలోనే వేస్తున్నది. బాబు సంగతి సరేసరి. 'సెల్‌ఫోన్ కనిపెట్టింది కూడా నేనే' అనే స్థాయికి చేరిన వైపరీత్యం ఆయన మనస్తత్వానిది. ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసిందీ, కొత్త ఎయిర్‌పోర్టును ప్రారంభించిందీ కూడా వైఎస్సార్ హయాంలోనే! ఔటర్ రింగ్‌రోడ్డు కోసం భూసేకరణ దగ్గర్నుంచీ రోడ్డు నిర్మాణం 90 శాతం పూర్తయింది కూడా వైఎస్సార్ హయాంలోనే! ఇక ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి వస్తున్నప్పుడు రజనీకాంత్‌కు కనిపించిన న్యూయార్క్ దృశ్యం ఈ అయిదేళ్లలో ఆవిష్కృతమైన పరిణామం.

పీవీ నరసింహారావుకు, వైఎస్సార్‌కు, కేసీఆర్‌కూ దక్కాల్సిన ఘనతలను కూడా బరబరా లాక్కుని చంద్రబాబుకు కట్టబెట్టే సమాచార గూండాగిరీకి యెల్లో మీడియా పాల్పడుతున్నది. అది ప్రజాభిప్రాయ 'ఉత్పత్తి' దశను దాటి ప్రజాభిప్రాయ 'రిగ్గింగ్' దశకు చేరుకున్నది. అందులో భాగమే తెలంగాణలో, హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్లంతా బాబు వర్గమే అనే ప్రచారం. బాబు వర్గం అంటే వారి ఉద్దేశం ప్రకారం టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గం. సెటిలర్లలో వారు సింహభాగం ఉంటారు. మిగిలిన వారిని ప్రభావితం చేస్తారని వారి ఉద్దేశం. ఈ తప్పుడు లెక్కలతోనే తెలంగాణ రాజకీయ పార్టీలను యెల్లో మీడియా దబాయిస్తున్నది. సెటిలర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయబోయే నాయకులను బెదిరించి చంద్రబాబు అరెస్టును ఖండించే ప్రకటనలు యెల్లో మీడియా చేయిస్తున్నది. కానీ వారు చెబుతున్న లెక్కలు వాస్తవమేనా?

> ఔటర్ రింగ్ రోడ్డును, శంషాబాద్ ఎయిర్‌పోర్టును కూడా యెల్లో మీడియా బాబు ఖాతాలోనే వేస్తున్నది. బాబు సంగతి సరేసరి. 'సెల్‌ఫోన్ కనిపెట్టింది కూడా నేనే' అనే స్థాయికి చేరిన వైపరీత్యం ఆయన మనస్తత్వానిది. ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసిందీ, కొత్త ఎయిర్‌పోర్టును ప్రారంభించిందీ కూడా వైఎస్సార్ హయాంలోనే! ఔటర్ రింగ్‌రోడ్డు కోసం భూసేకరణ దగ్గర్నుంచీ రోడ్డు నిర్మాణం 90 శాతం పూర్తయింది కూడా వైఎస్సార్ హయాంలోనే! ఇక ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు నుంచి నగరానికి వస్తున్నప్పుడు రజనీకాంత్‌కు కనిపించిన న్యూయార్క్ దృశ్యం ఈ అయిదేళ్లలో ఆవిష్కృతమైన పరిణామం.
>
> పీవీ నరసింహారావుకు, వైఎస్సార్‌కు, కేసీఆర్‌కూ దక్కాల్సిన ఘనతలను కూడా బరబరా లాక్కుని చంద్రబాబుకు కట్టబెట్టే సమాచార గూండాగిరీకి యెల్లో మీడియా పాల్పడు తున్నది. అది ప్రజాభిప్రాయ 'ఉత్పత్తి' దశను దాటి ప్రజాభి ప్రాయ 'రిగ్గింగ్' దశకు చేరుకున్నది. అందులో భాగమే తెలంగాణలో, హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్లంతా బాబు వర్గమే అనే ప్రచారం. బాబు వర్గం అంటే వారి ఉద్దేశం ప్రకారం టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గం. సెటిలర్లలో వారు సింహభాగం ఉంటారు. మిగిలిన వారిని ప్రభావితం చేస్తారని వారి ఉద్దేశం. ఈ తప్పుడు లెక్కలతోనే తెలంగాణ రాజకీయ పార్టీలను యెల్లో మీడియా దబాయిస్తున్నది. సెటిలర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయబోయే నాయకులను బెదిరించి బాబు అరెస్టును ఖండించే ప్రకటనలు యెల్లో మీడియా చేయిస్తున్నది. కానీ వారు చెబుతున్న లెక్కలు వాస్తవమేనా?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చేసిన క్షేత్రస్థాయి పరిశీలన ప్రకారం దాదాపు ఇరవై లక్షలమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సెటిలర్లు ఉన్నారు. వీరిలో ఇరవై శాతం వరకు కమ్మవారుంటారని అంచనా. పదిహేను శాతం రెడ్లు, పదిహేను శాతం కాపులు. బీసీలు ముప్పయ్ శాతం. మిగిలిన ఇరవై శాతం ఇతరులు. ఇవి వాస్తవికతకు దగ్గరగా ఉన్న ఉజ్జాయింపు లెక్కలు మాత్రమే. యెల్లో మీడియా దబాయింపు ప్రకారం ఇరవై శాతం సామాజిక వర్గం చెప్పుచేతుల్లోనే ఎనభై శాతం మసలుకుంటున్నట్టు లెక్క. వాస్తవానికి ఆంధ్రా సెటిలర్లు అనేది ఒక ఓటు బ్యాంకు ఎంతమాత్రమూ కాదు. ఎవరి రాజకీయ అభిప్రాయాలు వారివి. కులాల లెక్కలు కూడా చెల్లవు. అసలు ఆంధ్రప్రదేశ్‌లోనే కుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. రాజకీయ పోరాటాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వర్గ పోరాటంగా మార్చివేశారు. పేదలకూ – పెత్తందార్లకూ మధ్య యుద్ధంగా ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇంకా తెలుగుదేశం పార్టీ మాత్రమే ఒక్క కులాన్ని పట్టుకుని వేలాడుతున్నది. అటువంటి విభజనే సెటిలర్లలో కొంతమేరకు ఉండవచ్చు. లేదా స్థానిక అంశాల ఆధారంగా వారి మద్దతు ఉండవచ్చు. సెటిలర్లపై చంద్రబాబు ప్రభావం అనేది యెల్లో మీడియా ఉత్పత్తి చేస్తున్న భ్రాంతి మాత్రమే. తెలంగాణ ప్రజలకు చంద్రబాబులో ఇప్పటికీ ఒక సామాజిక విధ్వంసకుడు కన్పిస్తాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గడిచిన ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠం నేర్చుకున్నదో లేక మరోసారి బలిపీఠం ఎక్కడానికి సిద్ధపడుతున్నదో వేచి చూడాలి.

vardhelli1959@gmail.com

ఆలస్యమే అయినా... మేల్కొన్నట్లేనా?

విశ్లేషణ



డి. పాపారావు

సుమారుగా నాలుగు దశాబ్దాల నుంచి ప్రపంచ దేశాలను శాసిస్తోన్న 'నయా ఉదారవాద' ఆర్థిక విధానాలు నేడు ప్రశ్నించబడుతున్నాయి. నిన్నటి వరకూ ఈ విధానాలకు ప్రతినిధులుగా ఉన్న ఆర్థికరంగ మేధావులు కూడా నేడు భిన్నమైన గొంతుకలను వినిపిస్తున్నారు.

ఈ క్రమంలో, ఈ మధ్యకాలంలో మన దేశంలోని ఇరువురు ప్రముఖుల ప్రకటనలు లేదా ఇంటర్వ్యూలు మనదేశంలో కూడా నయా ఉదారవాద విధానాలను అనివార్యంగా విడనాడవలసిన అవసరాన్ని చెబుతున్నాయి. వీరిలో ఒకరు రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ రంగరాజన్. రెండవవారు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ కె. బెరి. రంగరాజన్ మాటలు నేడు వ్యవస్థలో మౌలికంగానే తలెత్తుతోన్న ప్రశ్నలకు అద్దం పడుతున్నాయి. ఆయన లేవనెత్తిన ప్రశ్న ఉపాధి అవకాశాలను సరిపడా సృష్టించలేని అభివృద్ధి దేనికి అనేది. అలాగే ఆయన తలసరి ఆదాయం పెరిగితేనే అది అసలైన దేశాభివృద్ధి అన్నారు. దానితో పాటుగా నిరుపేదలకు రాయితీలు అవసరమేనని స్పష్టీకరించారు. గతంలో దేశంలో పెట్రోలియం ధరలకు సంబంధించి సబ్సిడీల రద్దులను ప్రతిపాదించిన కమిటీలలో ఒకదానికి నాయకత్వం వహించిన రంగరాజన్ నోట వెలువడిన ఈ మాటలు చాలా కీలకమైనవి. వ్యవస్థలో నేడు మారుతోన్న ఆలోచనలకూ... నయా ఉదారవాద సంస్కరణల వైఫల్యానికీ ఈ మాటలు అద్దంపడుతున్నాయి.

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలనే సూక్ష్మంగా 'నయా ఉదారవాదం' అంటున్నాం. ప్రపంచంలో 1980ల నుంచీ... మనదేశంలో 1991 అనంతరం మొదలైన ఈ విధానాలు కార్పొరేట్‌లకు మరింతగా రాయితీలు ఇవ్వడాన్ని ప్రతిపాదించాయి. అలాగే, జన సామాన్యానికి ఇచ్చే సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై కోతలను ప్రతిపాదించాయి. ఈ విధానాల అమలు క్రమంలోనే నేడు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య, అలాగే విడివిడిగా వివిధ దేశాలలో అంతర్గతంగా కూడా ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోయాయి. ధనికులు మరింత ధనికులూ, పేదలు మరింత పేదలూ అవుతున్నారు. నేడు పరాకాష్ఠకు చేరుకుంటున్న ఈ పరిస్థితి ఈ విధానాలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ క్రమంలోనే రంగరాజన్ వంటివారు కూడా తమ పాత ఆలోచనలను పరిత్యజించవలసి వస్తోంది.

మరో పక్కన నీతి ఆయోగ్ సుమన్ బెరి 1950ల నుంచి బలమైన నమూనాగా ఉన్న మొత్తం ఆర్థిక నమూనానే ప్రశ్నిస్తున్నారు. ఈ నమూనా ప్రకారంగా ఒక దేశ ఆర్థిక అభివృద్ధి క్రమం: తొలుత వ్యవసాయక ప్రాధాన్యత గలదిగా ఉండి, తరువాత సరుకు ఉత్పత్తి పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఉన్నదిగానూ... అనంతరం (చివరగా) సేవా రంగం ప్రాధాన్యత దిశగా సాగాలి. అయితే, ప్రస్తుతం ప్రపంచంలో నెలకొని ఉన్న ఆర్థిక పరిస్థితులూ, అలాగే భారీగా ఆటోమేషన్ దిశగా అభివృద్ధి చెందిన సాంకేతిక రంగం వంటి వాటి దృష్ట్యా నేడు మనదేశానికి ఈ పాత దశల అభివృద్ధి నమూనా పనికి రాదనేది సుమన్ బెరి ప్రతిపాదన. ఈ సందర్భంగా ఆయన 'భూగోళం మరో చైనాను భరించలేదు' అని పేర్కొన్నారు. అంటే, నేడు భూగోళంపై జరుగుతోన్న పర్యావరణ మార్పులూ... వినాశనం దృష్ట్యా చైనా స్థాయిలో పారిశ్రామిక సరుకు ఉత్పత్తి చేయగల మరో దేశం అవసరం లేదన్నమాట. అటువంటిదే జరిగితే ప్రపంచంలో కాలుష్యం మరింత వేగంగానూ, తీవ్రంగానూ పెరిగిపోతుంది. ఈ క్రమంలోనే ఆయన భారతదేశం సరుకు ఉత్పత్తి రంగంలో చైనాతో పాటుగా ఎదిగే ప్రయత్నాన్ని ప్రశ్నించారు. దీనిలో భాగంగానే ఆయన ఏది ఏమైనా సరే భారీ వృద్ధిరేట్లను సాధించాలనే దృక్పథాన్ని విమర్శిస్తూ... దాని స్థానే నేడు భారత్‌కు కావాలిసింది హేతుబద్ధమైన, పర్యావరణం పట్ల చైతన్యం గల వినియోగం, ఉత్పత్తి అని పేర్కొన్నారు.

ఈ సందర్భంలోనే, 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని మోదీ ఆరంభించిన నేపథ్యంలో మాజీ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ అయిన రఘురామ్



రాజన్ మాటలను కూడా గుర్తుచేసుకోవచ్చు. ఆయన ప్రకారంగా 'మేకిన్ ఇండియా' కార్యక్రమం పేరిట ప్రపంచానికి మరో చైనా అవసరం లేదు. నిజానికి మనం కొద్ది దశాబ్దాల క్రితమే పారిశ్రామిక సరుకు ఉత్పత్తి దిగ్గజంగా ఎదిగే అవకాశాన్ని కోల్పోయాం... బస్సు మిస్సయ్యాం! సరుకు ఉత్పత్తి రంగంలో ముందుగానే 1980లలో ప్రయాణం ప్రారంభించిన చైనా నేడు శాచ్యురేషన్ స్థాయిని సాధించి ఉంది. అదీ విషయం. అంటే, రఘురామ్ రాజన్ ఈ మాటలను అంతర్జాతీయ మార్కెట్ తాలూకు అవసరాలు, డిమాండ్ స్థాయుల గురించి వివరిస్తూ చెప్పారు.

అయితే, గత పది సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం తన దృష్టినంతా సరుకు ఉత్పత్తిరంగం పైననే పెట్టింది. దీనిలో భాగంగానే 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ముందుకు వచ్చింది. అనంతరం 2019లో భారీస్థాయిలో కార్పొరేట్ ట్యాక్స్‌ను ప్రభుత్వం తగ్గించింది. ఇక తరువాత ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పేరిట లక్షల కోట్ల రూపాయల రాయితీలతో దేశంలో భారీ పారిశ్రామికీకరణను తలపెట్టింది. కానీ, ఈ ప్రయత్నాలు ఏవీ ఇప్పటివరకూ ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. ఈ కారణం చేతనే కోవిడ్ అనంతర కాలంలో అంతర్జాతీయంగా ముందుకు వచ్చిన 'చైనా+1' ఆలోచన కూడా మనదేశానికి సంబంధించినంత వరకూ పెద్దగా ఫలితాలను సాధించలేదు. మరో పక్కన దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోతోంది. అనేక ఇతరేతర ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. కాబట్టి నేడు మనం పాత దశలవారి సిద్ధాంతం అయిన వ్యవసాయరంగం నుంచి సరుకు ఉత్పత్తి రంగం, అనంతరం సేవారంగంలోకి ప్రయాణం అనే దానికి ఇక ఎంత మాత్రమూ అంటిపెట్టుకోలేము. సరికొత్త మార్గాన్ని అన్వేషించుకోవాలి. ప్రధాని మోదీ కూడా 'ఏదేమైనా వృద్ధిని సాధించడమే ఏకైక లక్ష్యమ'ని ఇక ఎంతమాత్రమూ అనలేము అంటూ ఈమధ్య పేర్కొనటాన్ని గమనించవచ్చు.

ఈ నేపథ్యంలో ముందుకు వచ్చినవే సుమన్ బెరి ఆలోచనలు. వాస్తవానికి నేడు ప్రపంచమంతటా పెరిగిపోతున్న సాంకేతికత దృష్ట్యా సరుకు ఉత్పత్తిరంగంలో ఉపాధి అవకాశాలు వేగంగా క్షీణిస్తున్నాయి. ఇదీ సమస్య తాలూకు మరో కోణం. అంటే, మనం సరుకు ఉత్పత్తిరంగంపై దృష్టిపెట్టి, దానిలో ఒకవేళ బాగా ముందుకు వెళ్ళగలిగినా అది మన ప్రధాన సమస్య అయిన నిరుద్యోగాన్ని పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో మనకు ఉన్న మెరుగైన మార్గాంతరంగా వ్యవసాయరంగంపై దృష్టిపెట్టడం అనేది ఉంది. దీనినే సుమన్ బెరి ప్రతిపాదిస్తున్నారు. ఆయన ప్రకారం మనం పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కరించలేకపోవడం దృష్ట్యా, సరుకు ఉత్పత్తిరంగాన్ని మన ప్రాధాన్యతగా చేసుకోరాదు. మనం చేయవలసింది, వ్యవసాయ రంగంలో సూపర్ పవర్‌గా ఎదగగలగడం.

నేడు మన దేశ జనాభాలో 55–60 శాతం మేరకు వ్యవసాయ రంగంలోనే ఉన్న నేపథ్యంలో, వారి ఉత్పాదకతతోపాటు, వారి ఆదాయాలను కూడా పెంచేదిశగా చర్యలు తీసుకుంటే అవి దేశీయంగానే డిమాండ్ కల్పనకూ... వ్యవసాయరంగాన్ని ఒక మెరుగైన ఉపాధి రంగంగా యువకుల ముందు ఉంచగలిగేటందుకూ ఉపయోగపడతాయి. అటువంటి విధానాలు, దేశంలోని నగర ప్రాంతాలలో కూడా ఆర్థిక కార్యకలాపాల వృద్ధికి ఉపయోగపడతాయి. ఒక రచయితగా నేను 2014లో 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ఆరంభం అయిన నాటి నుంచి పదే పదే వ్యాసాలలో, ఉపన్యాసాలలో వివరించినది ఇదే!

స్థూలంగా నేడు మనదేశంలో కూడా సరికొత్త ఆలోచనల పవనాలు వీస్తున్నాయి. కానీ, పుణ్యకాలం కాస్త అయిపోయిన తరువాత అన్నట్టుగా పది సంవత్సరాల విలువైన కాలాన్ని వృథా చేసుకుని నేడు మనం మరలా బండి చక్రాన్ని కనుగొంటున్నట్లుగా ఇది ఉంది. ఏదేమైనా, నేటికైనా మన దేశ ఆర్థిక నమూనా పాత సైద్ధాంతిక చట్రాలను బద్దలు కొట్టుకొని సరైన దారిలోకి ప్రయాణిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

ఊతకర్రల మవుదాం!

భారతీయ సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో ఒకప్పుడు పెద్దలకు ఎంతో గౌరవం ఉండేది. కుటుంబంలో పెద్దలే నిర్ణయాత్మక శక్తులుగా ఉండేవారు. పిల్లలు కూడా పెద్దవారికి సేవలు చేయడం, వారిని గౌరవించడం తమ విద్యుక్త ధర్మాలుగా భావించేవారు. పిల్లలు తమ సంపాదనను పెద్దల చేతికిచ్చి, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేముందు పెద్దవారితో సలహా సంప్రతింపులు తీసుకొనేవారు. ఈ రకమైన సలహాలు కుటుంబ అభివృద్ధికి అవసరమని ఆనాడు భావించేవారు. గత కాలంలో కుటుంబ పెద్దల మాటకు అగ్రతాంబూలం లభించేది.

నేడు పెద్దలు లేదా వయోవృద్ధుల పట్ల, కుటుంబ సభ్యుల ఆలోచనా ధోరణి విపరీతంగా మారింది. ఈ శతాబ్ది కాలంలో సంభవించిన సామాజిక, ఆర్థిక మార్పుల దృష్ట్యా కుటుంబాలలో వృద్ధుల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు క్రమేపీ క్షీణిస్తున్నాయి. వైద్య విప్లవం, పెరిగిన జీవన ప్రమాణాలు, పోషకాహారం లభ్యత వంటి కారణాలతో మనుషుల ఆయుర్దాయం పెరిగినమాట వాస్తవమే. చాలా దేశాలలో వయోవృద్ధులను వేధించడం, నిర్లక్ష్యానికి గురిచేయడం కనిపిస్తుంది. ఒంటరితనం ఒక శాపంగా మారి, ఎన్నో అవమానాలను భరిస్తూ, కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో వృద్ధులు ఉన్నారు. వృద్ధాప్యంలో జీవిత భాగస్వామిని కోల్పోయిన పిల్లలు లేని వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.



మనదేశంలో ప్రతి పదిమందిలో ఒకరు వృద్ధాప్యంలో ఉన్నారు. 2050 సంవత్సరానికి దేశంలో ఈ వృద్ధ జనాభా 50 కోట్లు దాటుతుందని అంచనా. 'వృద్ధాప్యం ఒక వరం, కారాదు శాపం' అన్నట్లుగా మలిసంధ్య వెలుగుల్ని వృద్ధతరం ఆస్వాదించేటట్లుగా పరిస్థితులను సమాజం సృష్టించాలి. వృద్ధాప్యాన్ని సుఖవంతం చెయ్యని జాతి ఎప్పటికీ ఫలవంతం కాదు. ఏ జాతి కీర్తి, గౌరవ సుఖసంపదలైనా ఆ జాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే!

వయోవృద్ధులకు సంరక్షణ, పోషణ కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాలను రూపొందిస్తున్నాయి. 'తల్లి తండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007'ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఈ చట్టం వయోవృద్ధులకు ఒక భరోసా ఇవ్వగల సంక్షేమ చట్టం. ఈ చట్టాన్ని అనుసరించి పోషణకు నోచుకోని తల్లితండ్రులకు నెలకు పదివేల రూపాయల వరకు ఇవ్వవలసినదిగా కోర్టులు ఆదేశింపవచ్చును. కుటుంబంలో వృద్ధులను సంరక్షించే బాధ్యత ఉన్న వ్యక్తులెవ్వరైనా, వారిని శాశ్వతంగా వదిలించుకొందామనే ఉద్దేశ్యంతో, ఈ వృద్ధులను ఏదైనా ప్రదేశంలో వదలివేస్తే, అలాంటి వ్యక్తులకు మూడు నెలలు జైలు శిక్ష లేదా ఐదు వేల రూపాయల జరిమానా లేదా రెండూ కోర్టులు విధించవచ్చు.

జీవితమనే 'నాటకం'లో చివరి అంకం వార్ధక్యం. మానవ జీవితంలో ఎవరికైనా తప్పని దశ. వృద్ధాప్యం 'శాపం' అనుకొంటూ చీకట్లోకి జారిపోయే కంటే వృద్ధాప్యాన్ని 'రంగుల హరివిల్లు' చేసుకొంటే బాగుంటుందనే సానుకూల దృక్పథం వృద్ధులలోనూ కలగాలి. మలిసంధ్య వెలుగుల్ని ఈ 'వృద్ధతరం' ఆస్వాదించే పరిస్థితులున్న సమాజం సృష్టించడానికి మన మందరం 'ఊతకర్ర'లమవుదాం!

– అంగలకుదిటి నాగ వీర భద్రాచారి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, చీరాల
(నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.విదియ ప.12.13 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అశ్వని రా.11.10 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.19 నుండి 8.52 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.11 నుండి 5.01 వరకు, **అమృతఘడియలు:** సా.4.12 నుండి 5.46 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.48.

క్లుప్తంగా...

నిత్యాన్నదానానికి రూ. 11 లక్షల విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతోన్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ పటమటకు చెందిన వెలగపూడి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు వెలగపూడి ఉమామహేశ్వరరావు, కుటుంబీకుల పేరిట ఈ విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు వైదిక కమిటీ సభ్యులు మురళీధర్ శాస్త్రి, ఆలయ పర్యవేక్షకులు నాగేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అక్టోబర్‌లో తిరుమలలో విశేష ఉత్సవాలు

తిరుమల: అక్టోబర్‌లో తిరుమలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి.1న ఉండ్రాళ్ల తద్దె, 3న మధ్యాష్టమి, 10న మాతత్రయ ఏకాదశి, 13న మాస శివరాత్రి, 14న మహాలయ అమావాస్య, వేదాంత దేశిక ఉత్సవం ప్రారంభం, శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపడతారు. 15న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న గరుడ సేవ, 20న పుష్పక విమాన సేవ, సరస్వతి పూజ నిర్వహిస్తారు. 21న దేవీ త్రిరాత్ర వ్రతం, సేనై ముదలియార్ వర్ష తిరు నక్షత్రం, 22న స్వర్ణ రథోత్సవం, దుర్గాష్టమిలను ఘనంగా నిర్వహిస్తారు. 23న చక్ర స్నానం, మహర్నవమి, విజయ దశమి వేదాంత దేశిక శాత్తుమొర, పిళ్లై లోకాచార్య పోయిగై ఆళ్వార్ వర్ష తిరునక్షత్రం చేపడతారు. 24న పూద ఆళ్వార్ వర్ష తిరునక్షత్రం, 25న మాతత్రయ ఏకాదశి, పెయ్యాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 28న పాక్షిక చంద్ర గ్రహణం, 31న అట్ల తద్దె నిర్వహించనున్నట్లు టీటీడీ పీఆర్వో విభాగం శనివారం తెలిపింది.

ఏపీ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు



కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఏపీ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శనివారం అసోసియేషన్ 46వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరవలి రాఘవరావు, గౌరవాధ్యక్షుడిగా గోరంట్ల పున్నయ్య చౌదరి, ఉపాధ్యక్షులుగా సామినేని కోటేశ్వరరావు, నంబూరు సుబ్బారావు, గౌరవ కార్యదర్శిగా కొత్రపాటి రామారావు, సహాయ కార్యదర్శులుగా ఎన్. సూర్యనారాయణ, యు.సాంబశివరావు, ఎస్. హరిప్రసాదరావు, కోశాధికారిగా మదమంచి రంగారావు, మరో పది మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. రైతు ప్రతినిధులుగా మేకల లక్ష్మీనారాయణ, బండారు శ్రీనివాసరావు నియమితులయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్లు కొనసాగనుంది. నూతన అధ్యక్షుడు పెరవలి రాఘవరావు మాట్లాడుతూ పత్తి రైతులు, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలిపారు.

పోర్టు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మధ్య ఎంవోయూ

- పోర్టు పరిసర ప్రాంతాల్లో కాలుష్యం తగ్గించేందుకు చర్యలు



ఒప్పంద పత్రాలు చూపుతున్న పోర్టు చైర్మన్, ఏపీజీఅండ్‌బీసీ ఎండీ తదితరులు

సాక్షి, విశాఖపట్నం : మహా విశాఖ నగర పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టేలా విశాఖపట్నం పోర్టు అథారిటీ, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. పోర్టు చైర్మన్ డా.అంగముత్తు గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి ఈ ఒప్పంద పత్రాలపై శనివారం సంతకాలు చేశారు. విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు పోర్టు పరిసర ప్రాంతాలలో గాలి కాలుష్యాన్ని తగ్గించటం, కార్బన్ ఉద్గారాలను నిలువరించడమే ఈ ఎంవోయూ ముఖ్య ఉద్దేశమని చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఒప్పందంలో భాగంగా విశాఖపట్నం పోర్టు పరిసరాలలో గ్రీన్ బెల్ట్‌ను అభివృద్ధి చేయడం, పోర్టుకు వెళ్లే ప్రధాన జంక్షన్లలో రోడ్డు డివైడర్ల వద్ద పచ్చదనాన్ని పెంపొందించడం, పోర్టు కార్యాలయాలలో అవసరమైన మేరకు ల్యాండ్ స్కేపింగ్ చేయడం , పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర పనులను ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చేస్తుందని ఎండీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే, చీఫ్ ఇంజినీర్ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బోషాణం పెట్టెలో ఏముంది?

విశాఖ బీచ్‌లోకి కొట్టుకొచ్చిన భారీ చెక్కపెట్టె

- భారీ నిధులు ఉండే అవకాశం ఉందంటూ వదంతులు
- శత్రు దేశాలు విధ్వంసం సృష్టించేందుకు పంపించిన బాక్స్ అని భయాందోళన
- రాత్రంతా బాంబ్ స్క్వాడ్‌తో పహారా కాసిన పోలీసులు
- భారీ పెట్టెను చూసేందుకు ఎగబడిన జనం
- ఆర్కియాలజీ బృందం సమక్షంలో పరిశీలన
- చివరకు లంగర్ కోసం వినియోగించే స్లీపర్ బార్జ్‌గా నిర్ధారణ





సాక్షి, విశాఖపట్నం: విశాఖలోని సాగర తీరానికి భారీ బోషాణం (చెక్క పెట్టె) కొట్టుకు రావడం కలకలం రేపింది. ఆ పెట్టెలో ఏముందనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అందులో భారీ ఎత్తున నిధులు ఉండే అవకాశం ఉందని కొందరు.. స్మగ్లర్లు విలువైన వస్తువుల్ని అందులో దాచి ఉంటారని ఇంకొందరు.. శత్రు దేశాలు విధ్వంసం సృష్టించేందుకు పంపించిన బాక్స్ అని మరికొందరు పేర్కొనడంతో శుక్రవారం రాత్రంతా బాంబ్ స్క్వాడ్ సాయంతో పోలీసులు పహారా కాశారు. శనివారం ఉదయానికి ఈ సమాచారం ఆ నోటా.. ఈ నోటా ప్రచారం కావడంతో భారీ పెట్టెను చూసేందుకు వేలాదిగా జనం ఎగబడ్డారు. చివరకు అది సముద్రం మధ్య నౌకల లంగర్ వేసేందుకు వినియోగించే స్లీపర్ బార్జ్ (చెక్క దిమ్మె)గా నిర్ధారణ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...

అలల ఒడిలో.. భారీ వస్తువు!

విశాఖ సాగర తీరంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో అలల మధ్య భారీ వస్తువేదో కదులుతున్నట్టు సందర్శకులు గుర్తించారు. తొలుత అది భారీ సముద్ర జంతువు అని భయాందోళన చెందారు. ఒడ్డుకు పరుగులు తీశారు. రాత్రి పహారాకు బీట్ కానిస్టేబుళ్లకు కొందరు సమాచారం అందించగా.. అది ఒక భారీ చెక్క పెట్టె అని గుర్తించారు. చైనా, పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఏవైనా పేలుడు పదార్థాలున్నాయా అని భయాందోళనలకు గురయ్యారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అలెర్ట్ అయిన సిటీ సెక్యూరిటీ వింగ్ పొక్లెయిన్ల సాయంతో బాక్స్‌ను ఒడ్డుకు తీసుకొచ్చింది. అది పురాతన బాక్స్‌గా కనిపించడంతో అందరి అనుమానాలు మరింత బలపడ్డాయి. కొందరు బాంబులు ఉన్నాయేమో అని భయపడగా.. భారీ నిధితో కూడిన పెట్టె ఒడ్డుకు వచ్చిందని మరికొందరు భావించారు. భద్రతా బలగాలు బీచ్‌కు చేరుకుని ప్రజల్ని అప్రమత్తం చేశాయి. బీచ్ రోడ్డుని క్లియర్ చేశాయి. శనివారం ఉదయం ఆ భారీ పెట్టె మిస్టరీని ఛేదించేందుకు బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. చేతులతో దానిని తెరిచేందుకు బాంబ్ డిస్పోజల్ టీమ్ ప్రయత్నించగా.. సాధ్యం కాలేదు. బాంబ్ స్క్వాడ్ జాగిలాలతో చెక్ చేశారు. అందులో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని గుర్తించారు. జీవీఎంసీ ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్న రెండు పొక్లెయిన్లను పోలీసులు రంగంలోకి దించారు.

14 గంటల నిరీక్షణ తరువాత..

సమాచారం అందుకున్న ఆర్కియాలజీ బృందం చేరుకుని బాక్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. ఇది పురాతన కాలం నాటి పెట్టె కాదని.. రెండు నుంచి నాలుగేళ్ల క్రితం బర్మా టేకుతో తయారు చేసిన పెట్టె అని నిర్ధారించింది. 10 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు గల దానిని విడదీసేందుకు ప్రయత్నించగా.. చివరకు అది కేవలం చెక్క దిమ్మెగా గుర్తించారు. ఆర్కియాలజీ బృందంతో పాటు మత్స్యకారులు, పోర్టు అధికారులతో పోలీసులు సంప్రదింపులు జరపగా.. అది నౌకల్లో వినియోగించే స్లీపర్ బార్జ్ అని స్పష్టమైంది. చిన్న సైజు నౌకలు అలల తాకిడికి గురైనప్పుడు అవి దెబ్బ తినకుండా కర్రలతో చేసిన స్లీపర్ బార్జ్‌లను ఒక బ్లాక్‌గా బిగించి వినియోగిస్తారని తేలింది. సముద్రం మధ్యలో షిప్‌లని లంగరు వేసేందుకు వీటిని ఉపయోగిస్తారని తెలిసింది. కంటైనర్ కార్గో వెసల్స్ నుంచి కంటైనర్లను దించే సమయంలోనూ ఈ తరహా బార్జ్‌లను వినియోగిస్తుంటారనీ.. వాటిలో ఒకటి షిప్ నుంచి విడిపోయి ఇలా కొట్టుకు వచ్చి ఉంటుందని పోలీసులు వెల్లడించారు. మొత్తానికి విశాఖ నగరానికి 14 గంటల పాటు కంటిమీద కునుకు లేకుండా.. ఓవైపు ఆందోళనల్ని.. మరోవైపు ఉత్కంఠని కలిగిస్తూ.. యాక్షన్ సినిమా తలపించిన భారీ చెక్క కథ సుఖాంతమవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొండంత భక్తి!

తిరుమలలో 5 కిలోమీటర్ల వరకు విస్తరించిన క్యూ

తిరుమల: తమిళనాడు వాసులకు పవిత్రమైన పెరటాసి మాసం ఓ వైపు, మరోవైపు అక్టోబర్ 2 వరకు వరుస సెలవులు రావడంతో తిరుపతి, తిరుమలకు వెళ్లే రహదారులన్నీ భక్తులతో నిండిపోయాయి. అలిపిరి వద్ద పార్కింగ్ ప్రాంతాలన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అలిపిరి నుంచి ఎస్వీ వేద వర్సిటీ వరకు తమిళనాడు నుంచి వచ్చిన బస్సులు నిలిచి ఉన్నాయి. శుక్రవారం నుంచి అలిపిరి రోడ్డుకిరువైపులా బస్సులు బారులు తీరాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2, నారాయణగిరి షెడ్లలోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూ లైన్లు నందకం విశ్రాంతి భవనం దాటి 5 కిలోమీటర్లకు పైగా విస్తరించాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనం, అన్నప్రసాదాలు, వసతి తదితర అంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు అందిస్తోన్న సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. క్యూల్లో ఉన్నవారికి అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా టీటీడీ అందిస్తోంది. 2,500 మంది శ్రీవారి సేవకులు నిరంతరాయంగా భక్తులకు సేవలందిస్తున్నారు. సెప్టెంబర్ 30 నాటికి శ్రీవారి దర్శనానికి టోకెన్ లేని భక్తులకు 48 గంటల సమయం పడుతోంది. టీటీడీ రేడియో, బ్రాడ్‌కాస్టింగ్ విభాగం ఈ విషయమై పలు భాషల్లో ప్రకటనలు చేస్తోంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ తీర్థయాత్రను రూపొందించుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

ఎస్ఎస్‌డీ టోకెన్ల రద్దు

పెరటాసి శనివారాలు, వరుస సెలవుల కారణంగా అధిక రద్దీ దృష్ట్యా, టీటీడీ ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని రద్దు చేసింది. తిరుపతిలో అక్టోబర్ 1, 7, 8, 14, 15వ తేదీల్లో ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేయబోమని టీటీడీ తెలిపింది.



తిరుచానూరు ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ త్రివేది



తిరుచానూరు ఆలయం వెలుపల రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారి

పద్మావతీ అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

గణనాథుని సేవలో పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు

యాదమరి (చిత్తూరు జిల్లా)/చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎం త్రివేది, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ ధ్వజస్తంభ వద్ద మొక్కుకుని అమ్మవారిని మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే, కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని శనివారం పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్ బి.కట్టి దర్శించుకున్నారు.

విశాఖ శ్రీశారదాపీఠం విస్తరణకు ప్రణాళికలు

- ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో నూతన ఆశ్రమాల నిర్మాణం
- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి వెల్లడి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠం విస్తరణకు ప్రణాళికలు రచించామని, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో నూతన ఆశ్రమాలను నిర్మించదలిచామని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో చాతుర్మాస్య దీక్షని ముగించుకుని స్వరూపానందేంద్ర శనివారం విశాఖ జిల్లా చినముషిడివాడలోని శ్రీశారదాపీఠానికి చేరుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..హిమాలయ పాద ప్రాంతంలో చాతుర్మాస్య దీక్ష విజయవంతంగా సాగిందని చెప్పారు. గంగా తీరంలో సనాతన, వైదిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామని తెలిపారు. రాజశ్యామల ఆరాధనతో దీక్షాకాలం ప్రశాంతంగా సాగిందన్నారు. తిరిగి తమ పీఠం ఇలవేల్పు సింహాద్రి అప్పన్న చెంతన ఉన్న శారదా పీఠానికి చేరుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఉత్తర భారత్‌లో కొత్త ఒరవడి సృష్టించేలా వైదిక, సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పీఠానికి చేరుకున్న స్వామీజీకి భక్తులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పీఠం ప్రాంగణంలో ఉన్న రాజశ్యామల, ఇతర దేవతామూర్తుల ఆలయాల్లో స్వరూపానందేంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. న్యూఢిల్లీ విమానాశ్రయం నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకి చేరుకున్న స్వరూపానందేంద్రకు విమానాశ్రయంలో భక్తులు స్వాగతం పలికారు.



శారదాపీఠంలో పూజల అనంతరం భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్న స్వరూపానందేంద్ర

65.78 లక్షల మందికి రూ. 1,813.60 కోట్లు

- నేటి నుంచి పింఛన్ల పంపిణీ
- ఒకరోజు ముందే నిధుల విడుదల

సాక్షి, అమరావతి: ఠంచన్‌గా ఒకటో తేదీనే అవ్వాతాతలకు పింఛన్ల డబ్బులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు ముందే గ్రామ వార్డు సచివాలయాల వారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 65,78,849 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మొత్తం రూ. 1,813.60 కోట్ల మొత్తాన్ని శనివారమే ఆయా సచివాలయాల ఖాతాల్లో జమ చేసింది. అక్టోబర్ ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో శనివారం సాయంత్రానికే దాదాపు అన్నిచోట్ల ఆయా సచివాలయాల ఉద్యోగులు బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసి, వలంటీర్ల వారీగా అందజేయడం కూడా పూర్తయిందని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీకి క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా వలంటీర్లకు అధికారులు స్పష్టమైన సూచనలు చేశారన్నారు.



- మన దేశంలో 2,81,400 మందికి సోలార్ కొలువులు
- అంతర్జాతీయ నివేదికలు వెల్లడి
- ఏపీలో 1,80,918 మందికి ఉద్యోగాల కల్పనకు ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఒప్పందాలు
- ఇప్పటికే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

సాక్షి, అమరావతి: ప్రపంచ పునరుత్పాదక ఇంధన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని అంతర్జాతీయ అధ్యయనాలు మరోసారి రుజువు చేశాయి. ముఖ్యంగా మన దేశ సోలార్ ఫోటోవోల్టాయిక్ (పీవీ)లో ఉద్యోగాలు, ఉపాధి సంఖ్య అనేక అభివృద్ధి చెందిన దేశాలను అధిగమించిందని అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ (ఆర్ఈఎన్ఏ), అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) సంయుక్త నివేదిక తాజాగా వెల్లడించింది. గ్లోబల్‌గా 2022లో 4.9 మిలియన్ల మందికి ఉద్యోగాలు లభించాయి. దీంతో మొత్తం ఉద్యోగాలు 13.7 మిలియన్లకు చేరుకున్నాయి. మన దేశంలో గతేడాది ఆన్-గ్రిడ్ సోలార్‌లో 2,01,400 ఉద్యోగాలు, ఆఫ్-గ్రిడ్‌లో 80,000 ఉద్యోగాలు వచ్చాయి. మొత్తం కొలువుల్లో దాదాపు 40 శాతం మంది మహిళలున్నారు. ఒక్క చైనా మినహా మిగతా ప్రపంచ దేశాలన్నిటి కంటే మన దేశమే ఈ విషయంలో పురోగమనంలో ఉంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యుఎస్ఏ) గతేడాది 2,64,000 మందికి ఉద్యోగాలిచ్చి మనదేశంతో పోల్చితే కాస్త వెనుకబడే ఉంది. యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు 5,17,000 ఉద్యోగాలిచ్చాయి. బ్రెజిల్‌లో ఉద్యోగాల సంఖ్య 2,41,000కి చేరుకుంది. జపాన్ మాత్రం ఈ రంగంలో కేవలం 1,27,000 ఉద్యోగాలతో వెనుకబడి ఉంది.

పెరగనున్న ఉపాధి..

8025 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు ఇప్పటికే,ప్రైవేట్ పెట్టుబడిదారులకు కేటాయించడం జరిగింది. గ్రీన్‌కో గ్రూప్ ద్వారా నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 2,300 మెగావాట్ల సోలార్ విద్యుత్‌కు సంబంధించి సైట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏఎం గ్రీన్ ఎనర్జీ (ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్) 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి పునాది పనులు పురోగతిలో ఉన్నాయి. నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. వీటి ద్వారా 5,300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మరో రెండు వేల మందికి ఎన్‌హెచ్‌పీసీతో కలిసి ఏపీ జెన్‌కో నెలకొల్పనున్న పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల వల్ల లభించనున్నాయి. తద్వారా దేశంలోనే పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఇతర రాష్ట్రాలకంటే ముందుంటూ ఏపీ వాటికి ఆదర్శంగా నిలుస్తోంది.

ముందే మేల్కొన్న ఏపీ..

దేశవ్యాప్తంగా ఇప్పుడు జరుగుతున్న విద్యుత్ వినియోగం 2032 నాటికి 70 శాతం పెరుగుతుందని జాతీయస్థాయిలో అంచనా. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవాల్సిన ఆవశ్యకతను ముందుగానే గ్రహించింది ఏపీ ప్రభుత్వం. ఆ క్రమంలోనే విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టుల స్థాపనకు భారీగా ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పరిశ్రమల రాకతో రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు బాటలు వేసింది. ఏపీ విధానాలు నచ్చి ఏపీ ఇంధన రంగంలో రూ.9,57,1839 కోట్ల పెట్టుబడులతో 42 ప్రాజెక్టులు నెలకొల్పి 1,80,918 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక దిగ్గజాలు జత కలిశాయి. రాష్ట్రంలో 4,552.12 మెగావాట్ల సంచిత సౌర విద్యుత్ సామర్థ్యంతో, 2022–23లో 8,140.72 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ తాజాగా ప్రకటించింది. భారీ ఒప్పందాల కారణంగా రానున్న రోజుల్లో ఏపీలో ఇది మరింతగా వృద్ధి చెందనుంది.

ఏసీబీ వలలో ఎస్ఐ

- కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.40 వేలు డిమాండ్
- బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ
- ఎస్ఐ వెంకటయ్యపై కేసు నమోదు



గుంటూరు రూరల్ : కేసు నమోదు చేయకుండా ఉండేందుకు ఓ వ్యక్తి వద్ద నుంచి లంచం తీసుకుంటూ ఎస్ఐ కట్టా వెంకటయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు.. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్లో అలేఖ్య అనే మహిళ నివాసముంటోంది. ఈ నెల 24న అపార్ట్‌మెంట్ సెక్రటరీ వసంత లక్ష్మీనారాయణతో ఆమెకు వివాదం జరగడంతో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మీనారాయణపై ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా ఇదే లక్ష్మీనారాయణపై అదే అపార్ట్‌మెంట్ వాచ్‌మేన్ భార్య నాగేంద్రం గతంలో.. తనను దూషించాడని ఫిర్యాదు చేయగా.. అప్పుడు ఎస్ఐ వెంకటయ్య కేసు నమోదు చేయకుండా లక్ష్మీనారాయణ వద్ద రూ.10 వేలు తీసుకున్నాడు. కొద్ది రోజులకే అదే లక్ష్మీనారాయణపై అలేఖ్య ఫిర్యాదు చేయడంతో మరలా కేసు ఎస్ఐ వెంకటయ్య వద్దకే వచ్చింది. తనను ఇబ్బంది పెట్టొద్దని లక్ష్మీనారాయణ ఎస్ఐను వేడుకున్నాడు. అందుకు రూ.40 వేలు లంచంగా ఇవ్వాలని ఎస్ఐ కోరాడు. అంత నగదు తన వద్ద లేదంటూ లక్ష్మీనారాయణ రోజులు గడుపుతున్నాడు. దీంతో ఎస్ఐ వెంకటయ్య.. అడిగిన మొత్తం వెంటనే ఇవ్వకుంటే కేసు నమోదు చేసి జైలుకు పంపుతానంటూ లక్ష్మీనారాయణను బెదిరించారు. దీంతో లక్ష్మీనారాయణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహీంద్ర మత్తె పర్యవేక్షణలో డీఎస్పీలు ప్రతాప్‌కుమార్, సత్యానందం పథకం రచించారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఎస్ఐ ఇంటివద్దకు వచ్చి నగదు చెల్లిస్తానని లక్ష్మీనారాయణ ఎస్ఐతో చెప్పాడు. ఎస్ఐ ఇంటి ముందు నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ వద్ద పనిచేస్తున్నట్టు పనివాళ్ల వేషాల్లో అప్పటికే ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. లక్ష్మీనారాయణ ఎస్ఐ ఇంటికి వెళ్లి రూ.40 వేలు లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు ఎస్ఐను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అంతర్జాతీయ స్థాయిలో విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి

- కేంద్ర రైల్వే, జౌళి శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్



రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని కేంద్ర రైల్వే, జౌళి శాఖల సహాయ మంత్రి దర్శనా జర్దోష్ తెలిపారు. వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌తో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ను ఆమె సందర్శించారు. విశాఖ రైల్వేస్టేషన్ దేశంలో రద్దీ స్టేషన్లలో ఒకటని, నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో దీన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రధాని మోదీ ప్రారంభించారని చెప్పారు. ఈ పనులపై గతిశక్తి, వాల్తేర్ డివిజన్ అధికారులతో దర్శనా జర్దోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జరుగుతున్న పనుల గురించి అధికారులు ఆమెకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తర్వాత ఆమె ఒకటో నంబర్ గేట్ వైపు ప్రారంభమైన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను సందర్శించారు. రైల్వేస్టేషన్, స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ కిట్స్‌ను అందజేశారు. అనంతరం ఏటికొప్పాక బొమ్మలతో వన్ స్టేషన్ – వన్ ప్రొడక్ట్ పథకం కింద ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. అమ్మకాలు, స్టేషన్ అధికారుల ప్రోత్సాహం, సహకారం గురించి స్టాల్ యజమానితో మాట్లాడారు.

24/7 రైల్ కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

రైల్వేస్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 24/7 రైల్ కోచ్ రెస్టారెంట్‌ను మంత్రి దర్శనా జర్దోష్ ప్రారంభించారు. రైల్వే ప్రయాణికులకు, నగర వాసులకు ఈ రెస్టారెంట్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. వాల్తేర్ డివిజన్ అధికారుల, సిబ్బంది పనితీరును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రూ.2 వేల నోట్ల మార్పిడికి 7 వరకు గడువు

ముంబై: రూ.2 వేల నోట్ల ఉపసంహరణ గడువును రిజర్వ్ బ్యాంక్ మరో వారంపాటు, అక్టోబర్ 7వ తేదీ వరకు పొడిగించింది. మే 19వ తేదీ నుంచి మొదలైన రూ.2 వేల నోట్ల ఉపసంహరణ, మార్పిడి ప్రక్రియలో సెప్టెంబర్ 19వ తేదీ వరకు ప్రజలు రూ. 3.42 లక్షల కోట్ల విలువైన నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేశారని శనివారం ఒక ప్రకటనలో ఆర్‌బీఐ వెల్లడించింది. దేశంలో మే 19వ తేదీ వరకు చెలామణిలో ఉన్న కరెన్సీలో ఇది 96 శాతానికి సమానమని పేర్కొంది. ప్రస్తుతం రూ.14 వేల కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు మాత్రమే చెలామణిలో ఉన్నాయని తెలిపింది. అక్టోబర్ 7వ తేదీ తర్వాత కూడా రూ.2 వేల నోట్ల మార్పిడి చేసుకోవచ్చని, అయితే ఆ అవకాశం దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది.

సైనికులకు సిరిధాన్యాల ఆహారం

మైసూరు: దేశ రక్షణ కోసం సరిద్దుల్లో పని చేస్తున్న సైనికుల ఆరోగ్యాన్ని పెంపొందించేలా సిరిధాన్యాలను వారి ఆహారంలో వినియోగిస్తామని కేంద్ర రక్షణ, పర్యాటక శాఖల సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు. శనివారం మైసూరులోని కేంద్ర రక్షణ ఆహార పరిశోధనా ప్రయోగాలయం (డీఎఫ్ఆర్ఎల్)లో 'మిలిటరీ రేషన్, పౌష్టికాంశాలతో కూడిన సిరిధాన్యాలు' అంశంపై రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. చిరుధాన్యాల నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి కూడా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ అత్యంత ఎత్తైన సియాచిన్ లాంటి ప్రాంతాల్లో గస్తీ విధులను నిర్వహిస్తుంటారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే సైనికుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా కష్టమైన పని అన్నారు. వారు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు సిరిధాన్యాలతో కూడిన ఆహారాన్ని అధికంగా ఇస్తామని చెప్పారు.

లిప్‌స్టిక్, బాబ్డ్ హెయిర్ మహిళలకే ప్రయోజనం

మహిళా రిజర్వేషన్లపై ఆర్జేడీ నేత వ్యాఖ్య

పట్నా: మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా చట్టసభల్లోకి ప్రవేశించే మహిళలనుద్దేశించి ఆర్జేడీ సీనియర్ నాయకుడు అబ్దుల్ బరి సిద్ధిఖీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. లిప్‌స్టిక్‌లు వేసుకొని, బాబ్డ్ హెయిర్‌తో ఉన్న మహిళలు ఇక చట్టసభల్లోకి అడుగు పెడతారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకి కోటా ఇవ్వకపోవడంతో ఇక లిప్‌స్టిక్ మహిళలే ఆ చట్టం ద్వారా లబ్ధి పొందుతారని వ్యాఖ్యానించారు. ముజఫర్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధిఖీ చేసిన ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తనని తాను సమర్థించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకి అర్థం కావడానికే అలా మాట్లాడానన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు ముగిసేంత వరకు టీవీ, సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని తన అనుచరులకు సూచించారు.

పోలీసు లాంఛనాలతో స్వామినాథన్ అంత్యక్రియలు

సాక్షి, చెన్నై: హరిత విప్లవ పితామహుడు ఎం ఎస్ స్వామినాథన్ పార్థివ దేహానికి శనివారం చెన్నైలో తమిళనాడు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. వయో సంబంధ ఆరోగ్య సమస్యలతో స్వామినాథన్ (98) చెన్నైలో గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి తరమణిలోని ఎం ఎస్ స్వామినాథన్ ఫౌండేషన్‌కు భౌతిక కాయాన్ని తరలించారు. శనివారం ఉదయం 11 గంటలకు తరమణి నుంచి ప్రత్యేక వాహనంలో పార్థివదేహాన్ని బీసెంట్ నగర్ శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. పోలీసులు మూడు సార్లు గాలిలోకి కాల్పులు జరిపిన అనంతరం స్వామినాథన్ పార్థివ దేహాన్ని విద్యుత్ శ్మశాన వాటికలో దహనం చేశారు.

వీల్‌చైర్ వాడేవారి కోసం రైళ్లలో ర్యాంపులు

న్యూఢిల్లీ: వీల్‌చైర్ వాడే వారు, సీనియర్ సిటిజన్ల సౌకర్యం కోసం రైళ్లలో త్వరలో ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఇందుకోసం కొత్తగా రూపొందించిన ర్యాంపుల ఫొటోలను శనివారం ఆయన విడుదల చేశారు. ఇలాంటి వాటిని ఇప్పటికే చెన్నై రైల్వే స్టేషన్‌లో వినియోగించి చూశామని, ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్లు ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా అందిందన్నారు. త్వరలో వీటిని వందేభారత్ రైళ్లలో, ఆ తర్వాత మిగతా రైళ్లలోనూ అందుబాటులోకి తెస్తామని తెలిపారు. టికెట్లు బుకింగ్ చేసుకునే సమయంలోనే వీటి అవసరముందనే విషయం ప్రయాణికులు తెలిపేందుకు వీలుగా మార్పులు చేస్తున్నామన్నారు. దాని ఆధారంగా సంబంధిత రైల్వే స్టేషన్లకు అలెర్ట్ వెళ్తుందని, దాన్ని బట్టి అక్కడి సిబ్బంది ర్యాంపును సిద్ధంగా ఉంచుతారని వివరించారు. బోగీ తలుపుల వద్ద వీటిని సునాయాసంగా ఏర్పాటు చేయొచ్చన్నారు.

గురుత్వాకర్షణ పరిధిని దాటిన ఆదిత్య-ఎల్1

బెంగళూరు: సూర్యుడిపై పరిశోధనలే లక్ష్యంగా ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహం భూమికి 9.2 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, భూ గురుత్వాకర్షణ పరిధిని దాటేసిందని ఇస్రో తెలిపింది. ప్రస్తుతం అది లాగ్రాంజ్ పాయింట్ దిశగా ప్రయాణం సాగిస్తోందని శనివారం 'ఎక్స్'లో వెల్లడించింది. ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ- సి57 రాకెట్ ద్వారా సెప్టెంబర్ 2వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగించిన విషయం తెలిసిందే.

జస్ట్.. 5 గ్రాములు చాలట!



రోజుకు 8 గ్రాముల ఉప్పు చాలా ఎక్కువ

నిర్ధారిత మోతాదు దాటితే ప్రమాదమే..

జర్నల్ నేచర్ తాజా అధ్యయనం చెప్పిందిదే!

రోడ్డు పక్కన వేడివేడి పకోడీ, మిరపకాయ బజ్జీ, సమోసా మొదలుకుని మంట కింద మసాలా దాకా. ఇలా బయట ఏం తిన్నా, మనలో చాలామందికి కాస్త ఉప్పు గట్టిగా పడాల్సిందే. ఇంట్లో కూడా కూరలు మొదలుకుని తెలుగు వారికే ప్రత్యేకమైన నానా రకాల పచ్చళ్ల దాకా అన్నింట్లోనూ ఉప్పు కాస్త ఎక్కువగా వేయనిదే ముద్ద దిగని వాళ్లు చాలామందే ఉన్నారు. ఇలా సగటు భారతీయుడు రోజూ ఎడాపెడా ఉప్పు తినేస్తున్నా డట. ఈ క్రమంలో నిర్ధారిత మోతాదును ఎప్పుడో దాటేశాడని తాజా అధ్యయ నం ఒకటి తేల్చింది...ఆరోగ్య వంతుడైన వ్యక్తి ఆహారంలో రోజుకు 5 గ్రాములు, అంతకంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ భారతీయులు మాత్రం రోజుకు ఏకంగా 8 గ్రాములు లాగించేస్తున్నారు! జర్నల్ నేచర్ పోర్టుఫోలియో తాజాగా జరిపిన అధ్యయనంలో ఈ మేరకు తేలింది.

ఇలా చేశారు...

జాతీయ అంటేతర వ్యాధుల పర్యవేక్షణ సర్వేకు సేకరించిన శాంపిల్‌నే ఈ సర్వేకు ఆధారంగా తీసుకున్నారు.

- వారిలో 3,000 మంది వయోజనులను రాండమ్‌గా ఎంచుకున్నారు.
- ఉప్పులో కీలకంగా ఉండే సోడియం మోతాదు వారి మూత్రంలో ఏ మేరకు ఉందో పరిశీలించారు.
- అంతర్జాతీయ ప్రమాణాలతో దాన్ని పోల్చి చూశారు.
- వారందరూ మోతాదుకు మించి చాలా ఎక్కువగా ఉప్పు తీసుకుంటున్నట్టు తేలింది!

'ఉప్పు' వీరులు పురుషులే!

సర్వేలో చాలా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి...

- అన్ని సామాజిక వర్గాల వారూ ఉప్పు చాలా ఎక్కువగా తింటున్నారు. అయితే ఈ విషయంలో మహిళలతో పోలిస్తే పురుషులదే పైచేయి.
- మహిళలు రోజుకు 7.9 గ్రాముల ఉప్పు తింటుంటే పురుషులు 8.9 గ్రాములు లాగిస్తున్నారు!
- ఉద్యోగులు 8.6 గ్రాములు, పొగ తాగేవారు 8.3 గ్రాములు, హై బీపీ ఉన్నవారు 8.5 గ్రాముల ఉప్పు తింటున్నారని తేలింది.
- ఇక ఊబకాయులైతే ఏకంగా రోజుకు 9.3 గ్రాముల ఉప్పు తినేస్తున్నారు.
- వీరితో పోలిస్తే నిరుద్యోగులు, పొగ తాగని వారు, బీపీ, ఊబకాయం లేనివారు ఉప్పు తక్కువ తీసుకుంటున్నట్టు తేలడం విశేషం!

సోడియం కథా కమామిషు...

- నరాలు, కండరాల పనితీరుకు సోడియం చాలా అవసరం. అలాగని ఒంట్లో దాని స్థాయి మితిమీరకూడదు కూడా.
- ఒక వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ సోడియం తీసుకోవాలి.
- అంతకంటే ఎక్కువైతే హైబీపీ, హైపర్ టెన్షన్ వంటివాటికి దారితీస్తుంది.
- సోడియం పరిమాణం తక్కువగా ఉన్న ఉప్పు తినడం ఆరోగ్యవంతులకు మంచిదే. కానీ షుగర్ పేషెంట్లు, హృద్రోగులు తదితరులకు రక్తంలో హెచ్చు పొటాషియం హైపర్ కలేమియాకు దారి తీస్తుంది. దానివల్ల కండరాలు బలహీనపడతాయి. అంతేగాక పల్స్, గుండె కొట్టుకునే వేగం కూడా పడిపోతాయి!
- సోడియం ఎక్కువగా ఉండే తిండి హై బీపీ, హైపర్ టెన్షన్ రిస్కును బాగా పెంచుతుందని ఈ అధ్యయనం మరోసారి తేల్చింది.
- అవి చివరికి గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి దారితీసి ప్రాణాంతకంగా మారతాయి.
- అందుకే ఆరోగ్యవంతులైనా, మరొకరైనా ఆహారంలో ఉప్పు మోతాదు వీలైనంత తగ్గించడమే మంచిది.

> 'మనమంతా ఆహారంలో ఉప్పును రోజుకు కనీసం 1.2 గ్రాముల మేరకు తగ్గిస్తే చాలు. హైబీపీ కేసులు సగానికి సగం తగ్గిపోతాయి! కనుక ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతపై అందరిలోనూ, ముఖ్యంగా భారతీయుల్లో అవగాహన పెరిగేలా ప్రచార తదితర కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం చాలా ఉంది'
>
> – డాక్టర్ ప్రశాంత్ మాథుర్, అధ్యయనకర్త, డైరెక్టర్, ఐసీఎంఆర్- నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్, ఇన్ఫర్మాటిక్స్ అండ్ రీసెర్చ్

– సాక్షి, నేషనల్ డెస్క్

యూకే గురుద్వారాలో భారత హైకమిషనర్ అడ్డగింత

- స్కాట్‌లాండ్‌లో రెచ్చిపోయిన సిక్కు యువకులు
- అవమానించారంటూ మండిపడిన భారత హైకమిషన్ కార్యాలయం



దొరైస్వామి

లండన్: ఖలిస్తాన్ సానుభూతిపరుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. కెనడాతో ఖలిస్తాన్ అంశంలో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే అవి యూకేకు కూడా పాకాయి. స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఒక గురుద్వారాలోకి వెళ్లకుండా భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామిని ఖలిస్తానీ అతివాదులు అడ్డుకున్నారు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ (టీఎఫ్‌సీ) హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్కాట్‌లాండ్‌లో ఖలిస్తానీ సిక్కు యువత రెచ్చిపోవడం ఆందోళన కలిగిస్తోంది. యూకే పర్యటనలో ఉన్న దొరైస్వామి అల్బర్ట్ డ్రైవ్‌లోని గ్లాస్గోలో గురుద్వారా గురు గ్రంథ సాహిబ్ కమిటీ సభ్యులతో సమావేశమవడానికి శుక్రవారం వచ్చారు. ఈ విషయాన్ని ముందే తెలుసుకున్న ఖలిస్తానీ యువత ఆయనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. గురుద్వార సిబ్బందిని కూడా వారు బెదిరించారు. ఈ క్రమంలో అక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గురుద్వారా కమిటీ ఆహ్వానం మేరకే భారత హైకమిషనర్ అక్కడికి వచ్చినా సిక్కు యువకులు వారిని అడ్డుకున్నారు. ఇద్దరు యువకులు విక్రమ్ దొరైస్వామి కూర్చున్న కారు తలుపుని తీయడానికి ప్రయత్నించారు. దీంతో మరింత ఘర్షణని నివారించడానికి దొరైస్వామి అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

అడ్డుకోవడం అవమానకరం

దొరైస్వామి కాన్వాయ్‌ని ఖలిస్తానీ సానుభూతిపరులు అడ్డుకోవడాన్ని భారత ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బ్రిటన్ ప్రభుత్వం దృష్టికి దీనిని తీసుకువెళ్లింది. మరోవైపు లండన్‌లో భారత హైకమిషన్ ఈ చర్యను ఉద్దేశపూర్వకంగా అవమానించారంటూ మండిపడింది. బ్రిటన్ ప్రభుత్వానికి, పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేసింది.

ఆన్‌లైన్ గేమింగ్‌లపై 28 శాతం జీఎస్టీ

నేటి నుంచి అమలులోకి

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు బెట్టింగ్‌ల పూర్తి విలువపై 28 శాతం జీఎస్టీని ఈరోజు(అక్టోబర్ 1వ తేదీ) నుంచి వసూలు చేయనున్నాయి. ఈ రంగంలో విదేశాల నుంచి భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. సెంట్రల్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ చట్టాలలో సవరించిన నిబంధనలకు అక్టోబర్ 1వ తేదీని అపాయింటెడ్ డేట్‌గా ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా నోటిఫై చేసింది. కేంద్ర జీఎస్టీ చట్టంలోని మార్పుల ప్రకారం ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందాలను ఇక నుంచి లాటరీ, బెట్టింగ్, జూదం మాదిరిగా పరిగణిస్తారు. ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు భారత్‌లో రిజిస్ట్రేషన్ తీసుకోవడంతోపాటు దేశీయ చట్టానికి అనుగుణంగా 28 శాతం పన్ను చెల్లించడం తప్పనిసరి చేసింది. రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు నిబంధనలను పాటించడంలో విఫలమైతే విదేశాలలో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను నిరోధించేందుకు ఈ సవరణలు వీలు కల్పిస్తాయి. కాగా, ఆర్థిక శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాకు ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ లేఖ రాసింది. 15 రాష్ట్రాలు స్టేట్ జీఎస్టీ చట్టాల్లో మార్పులు ఇంకా చేయలేదని.. ఆయా రాష్ట్రాల ఆటగాళ్ల నుండి పొందిన డిపాజిట్లపై ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు అనుసరించాల్సిన జీఎస్టీ విధానం ఏమిటో తెలపాలని లేఖలో కోరింది. ఈ నోటిఫికేషన్లను పునఃపరిశీలించాలని, జీఎస్టీ స్కీమ్, భారత సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలు తమ సంబంధిత సవరణలను ఆమోదించే వరకు వాటిని నిలిపివేయాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఈలోగా తాము పేర్కొన్న సమస్యలను అవసరమైన వివరణలతో పరిష్కరించాలని కోరింది.

ఎల్‌నినో ఉన్నప్పటికీ సాధారణ వర్షపాతం

- దక్షిణాది రాష్ట్రాల్లో 8% లోటు
- భారత వాతావరణ విభాగం వెల్లడి

న్యూఢిల్లీ: ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ మొత్తమ్మీద సాధారణ వర్షపాతంతో ఈ సీజన్ ముగిసిందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. నాలుగు నెలల వర్షాకాలంలో దేశంలో దీర్ఘకాల సగటు వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, ఈసారి ఎల్‌నినో పరిస్థితులను నిలువరించే సానుకూల కారకాల ప్రభావంతో 820 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది 94.4 శాతమని ఐఎండీ తెలిపింది. దీర్ఘకాలం సరాసరి వర్షపాతం 94–106 శాతం మధ్య నమోదైతే సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తారు. వాతావరణ మార్పుల కారణంగా రుతుపవనాల్లో అస్థిరత ఏర్పడినట్లు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర శనివారం మీడియాతో అన్నారు. దేశంలోని 36 వాతావరణ సబ్ డివిజన్లకుగాను మూడింటిలో అధిక వర్షపాతం, 26 సబ్ డివిజన్లలో సాధారణ, ఏడింట్లో లోటు వర్షపాతం నమోదైందని చెప్పారు. లోటు వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, జార్ఖండ్, బెంగాల్, బిహార్, యూపీలో కొంత భాగం, కర్ణాటక దక్షిణ ప్రాంతం, కేరళ ఉన్నాయన్నారు. అదేవిధంగా, దక్షిణాది రాష్ట్రాల్లో 8% లోటు వర్షపాతం నమోదైందని చెప్పారు. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు (హిందూ మహాసముద్రం డైపోల్), గాల్లో మేఘాలు, వర్షాలు తూర్పు దిశగా కదిలే తీరు(మాడెన్-జులియన్ ఆసిలేషన్) ఈ దఫా రుతుపవనాలను ప్రభావితం చేశాయని మహాపాత్ర విశ్లేషించారు. ఈ రెండు పరిస్థితులు ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించాయని వివరించారు. నైరుతి రుతు పవనాల సమయంలో ఏటా సాధారణంగా 13 వరకు అల్పపీడనాలు ఏర్పడుతుంటాయి, ఈసారి 15 అల్ప పీడనాలు ఏర్పడినప్పటికీ వాటి వృద్ధి సక్రమంగా లేదన్నారు. ఎల్‌నినో కారణంగానే 1901 తర్వాత అత్యంత వేడి మాసంగా ఈ ఏడాది ఆగస్ట్ రికార్డు సృష్టించిందన్నారు. నైరుతి రుతుపవనాల తిరోగమనం ఈసారి 8 రోజులు ఆలస్యంగా సెప్టెంబర్ 25వ తేదీన పశ్చిమ రాజస్తాన్ నుంచి ప్రారంభమయిన విషయం తెలిసిందే.

బీసీననే నాపై ద్వేషం

- కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు
- ఇండియా కూటమి ఓ అహంకారుల గ్రూప్ అంటూ ధ్వజం
- ఛత్తీస్‌గఢ్‌లో ఆ పార్టీకి మళ్లీ అధికారమిస్తే మరింత అవినీతే
- ఈసారి బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపు



వేదికపై ప్రధాని మోదీ అభివాదం

బిలాస్‌పూర్: కాంగ్రెస్ సారథ్యంలోని విపక్షాల ఇండియా కూటమిని అహంకారుల గ్రూప్‌గా, కాంగ్రెస్‌కు తానంటే ఎనలేని ద్వేషమని ప్రధాని మోదీ ఆరోపించారు. 'అసలు బీసీలన్నా, ఎస్సీలు, ఎస్టీలన్నా, ముఖ్యంగా పేదలన్నా ఆ పార్టీకి ఎనలేని ద్వేషం. అందుకే కాంగ్రెస్ వాళ్లు నన్ను నోటికొచ్చినట్టు తిట్టిపోస్తుంటారు. ఆ నెపంతో వాళ్లు అవమానించేది నిజానికి బీసీలను' అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు కోర్టు శిక్షించినా వారి వైఖరి అసలే మారలేదని దుయ్యబట్టారు. 'రాష్ట్రపతి పదవికి దళితుడైన రామ్‌నాథ్ కోవింద్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. తాజాగా ఆదివాసీ మహిళ అయిన ద్రౌపదీ ముర్ము అభ్యర్థిత్వాన్నీ అలాగే వ్యతిరేకించింది. ఆయా సామాజికవర్గాల పట్ల ద్వేషమే అందుకు కారణం తప్ప సైద్ధాంతిక విభేదాలు కాదు. లేదంటే యశ్వంత్ సిన్హా వంటి మాజీ బీజేపీ నేతను పోటీగా బరిలో దింపేవారే కాదు' అని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం బిలాస్‌పూర్‌లో బీజేపీ నిర్వహించిన 'పరివర్తన్ మహాసంకల్ప' ర్యాలీలో మోదీ మాట్లాడారు. 30 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఏమీ చేయని కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీల అహంకార గ్రూప్ తాను బిల్లును ఆమోదం దాకా తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయిందన్నారు. 'అందుకు వాళ్లు నాపై ఆగ్రహంగా కూడా ఉన్నారు. విధి లేని పరిస్థితుల్లో మాత్రమే మహిళా బిల్లుకు వాళ్లు మద్దతిచ్చారు. ఇప్పుడిక మోదీకి మహిళలంతా ఎక్కడ మద్దతు పలుకుతారోనని భయపడుతున్నారు' అని ఎద్దేవా చేశారు. 'ఇప్పుడు మహిళా రిజర్వేషన్లను ఓబీసీలకు కూడా వర్తింపజేయాలంటూ కొత్త నాటకానికి కాంగ్రెస్ తెర తీసింది. తద్వారా మహిళల మధ్యా విభేదాలు రాజేసేందుకు ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు. 'మహిళా రిజర్వేషన్ల ప్రభావం వేలాది ఏళ్ల పాటు ఉంటుంది. మీ కూతుళ్ల భవిష్యత్తును బంగారుమయం చేస్తుంది' అని అన్నారు. 'అమ్మలారా. అక్కాచెల్లెళ్లారా! కాంగ్రెస్ వంటి అబద్ధాలకోర్ల వలలో పడకండి. నాకు మీ ఆశీస్సులు ఇలాగే కొనసాగాలి. అప్పుడే మీతో పాటు ప్రతి ఒక్కరి ఆకాంక్షలనూ నెరవేర్చగలుగుతా' అని పేర్కొన్నారు.

అవినీతి కూపంలో కాంగ్రెస్

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ పాలన పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని మోదీ ఆరోపించారు. ఖజానాలో డబ్బులకు కొదవే లేదని, కేంద్రం నుంచి వేలాది కోట్లు వస్తున్నాయని సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన ఉప ముఖ్యమంత్రే వేదికపై చెప్పారని గుర్తు చేశారు. 'రాష్ట్రంలో ప్రతి స్కీమ్‌లోనూ స్కామే. ఆ పార్టీకి గనక మరో అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని మరింత దోచుకుంటుంది' అని దుయ్యబట్టారు.

ఉగ్రవాదాన్ని కెనడా ప్రోత్సహిస్తోంది

- నిజ్జర్ హత్య కంటే అదే అతి పెద్ద సమస్య
- కెనడా ప్రభుత్వంపై జైశంకర్ ధ్వజం

వాషింగ్టన్: ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై నెలకొన్న విభేదాలను భారత్, కెనడా ప్రభుత్వం పరస్పరం చర్చించుకుంటే పరిష్కరించుకోవచ్చునని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. నిజ్జర్ హత్య కంటే ఉగ్రవాదాన్ని కెనడా ప్రభుత్వం ప్రోత్సహించడం అత్యంత తీవ్రమైన అంశంగా చూడాలని అన్నారు. ఖలిస్తానీ ఉగ్రవాదానికి, హింసాత్మక కార్యక్రమాలకు ట్రూడో ప్రభుత్వం అనుమతులిస్తోందని వెంటనే వాటిని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న జై శంకర్ వాషింగ్టన్‌లో శుక్రవారం భారతీయ జర్నలిస్టులతో మాట్లాడారు. నిజ్జర్ హత్య వెనుక భారతీయ ఏజెంట్లు ఉన్నారంటూ కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణల్ని భారత్ గట్టిగా తిప్పి కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కచ్చితమైన ఆధారాలుంటే చూపించాలన్నారు. వాటిని పరిశీలించడానికి భారత్ సిద్ధంగా ఉందని జైశంకర్ చెప్పారు. ''కెనడా ప్రభుత్వం నుంచి భారత్ చాలా కాలంగా ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటోంది. ఉగ్రవాదం, హింసాత్మక కార్యకలాపాలపై వారి ఉదాసీన వైఖరే ఇందుకు కారణం. భారత్‌లో నేరాలు చేసిన ఎందరో కెనడాలో తలదాచుకుంటున్నారు. వారిని అప్పగించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా కెనడా ప్రభుత్వం స్పందించడం లేదు. నిజ్జర్ హత్యపై ఆధారాలు ఇవ్వకుండా అభాండాలు వేస్తోంది. మేము నాలుగ్గోడల మధ్య లేము. ఏదైనా పరిశీలిస్తాం'' అని జై శంకర్ మండిపడ్డారు. నిజ్జర్ హత్య కంటే కెనడా ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే అతి పెద్ద సమస్యని దానినే మొట్టమొదట పరిష్కరించుకోవాలని అన్నారు.

ఓ వైపు గాంధీ.. మరోవైపు గాడ్సే

- వచ్చే ఎన్నికలు సిద్ధాంతాల మధ్య పోరాటం
- అధికారంలోకి వస్తే కులగణన చేపడతామన్న రాహుల్
- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ జన ఆక్రోశ్ ర్యాలీ



భోపాల్: అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరిగే యుద్ధంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఒక వైపు మహాత్మాగాంధీ, మరోవైపు ఆయనని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే మధ్య ఎన్నికల పోరు జరగనుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఓబీసీల సంఖ్య తెలుసుకోవడానికి కులగణన చేపడతామని చెప్పారు. ఈ డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లోని షాజపూర్‌లో జన ఆక్రోశ్ ర్యాలీలో రాహుల్ గాంధీ శనివారం పాల్గొన్నారు. ''ఈ సారి ఎన్నికల పోరు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతుంది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ, మరోవైపు బీజేపీ, ఆరెస్సెస్, ఒక వైపు మహాత్మాగాంధీ మరోవైపు గాడ్సేలు నిలిచి పోరాడతారు. ప్రేమ, సోదరభావం ద్వేషానికి మధ్య ఈ పోరాటం ఉంటుంది'' అని రాహుల్ చెప్పారు. బీజేపీ ప్రజలకి ఏం ఇస్తే వారు అదే తిరిగి ఇస్తారని, ఇన్నాళ్లూ బీజేపీ వారిలో విద్వేషం నింపిందని, ఇప్పుడు ప్రజలే బీజేపీని ద్వేషిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ దేశంలో ఆరెస్సెస్‌కు చెందిన కొందరు కేంద్ర ప్రభుత్వ అధికారులే చట్టాలు చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, బీజేపీ ప్రజాప్రతినిధులకి ఎలాంటి పాత్ర లేదని అన్నారు. ఆరెస్సెస్ చెప్పినట్టుగా కేంద్ర ప్రభుత్వం ఆడుతోందని రాహుల్ ఆరోపించారు.

అవినీతి కేంద్రంగా ఎంపీ

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల ప్రాతిపదికన జనాభా గణన చేపడతామని రాహుల్ మరోసారి స్పష్టం చేశారు. ఇతర వెనుకబడిన కులాల (ఓబీసీ) సంఖ్యను తెలుసుకోవడానికే కుల గణన చేపడతామన్నారు. అవినీతికి మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని రాహుల్ ఆరోపించారు. బీజేపీ హయాంలో గత 18 ఏళ్లలో 18 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని రాహుల్ చెప్పారు.

న్యూయార్క్‌లో వరద విలయం

న్యూయార్క్: అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్క్ అకాల వర్షాలతో అతలాకుతలమవుతోంది. శుక్రవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి వీధులు, సబ్‌వేలు, హైవేలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 20 సెంమీ. వర్షం కురిసింది. విమానాలు రద్దయ్యాయి. మెట్రో రైళ్లను నిలిపివేశారు. మెట్రో స్టేషన్లను మూసివేశారు. వరదల ధాటికి జనజీవనం స్తంభించింది. నగరంలో ఎమర్జెన్సీ విధించినట్టుగా రాష్ట్ర గవర్నర్ కాథి హొచల్ ప్రకటించారు. ''నగరంలో వర్ష బీభత్సం ప్రమాదకరంగా మారింది. ఇల్లు దాటి బయటకు వస్తే ప్రాణాలు తీసేటట్టుగా ఉంది. అందుకే న్యూయార్క్ నగరం, లాంగ్ ఐలాండ్, హడ్సన్ వ్యాలీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి విధిస్తున్నాం'' అని హొచల్ వెల్లడించారు.

అమెరికాలో ఆర్థిక ప్రతిష్టంభన తప్పదా?


వాషింగ్టన్: అమెరికా మరోసారి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోతోంది. ఫెడరల్ ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక ద్రవ్య బిల్లును విపక్ష రిపబ్లికన్ పార్టీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో అక్టోబర్ 1 నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం చెల్లింపులన్నీ నిలిచిపోయే ముప్పు ఉంది. రిపబ్లికన్ల డిమాండ్ మేరకు సరిహద్దు భద్రత సహా వివిధ ఏజెన్సీల చెల్లింపుల కోసం ప్రతిపాదిత బడ్జెట్‌లో 30% మేరకు నిధుల్లో కోత విధించినప్పటికీ మద్దతునివ్వడానికి వారు అంగీకరించడం లేదు. ప్రజాప్రతినిధుల సభలో రిపబ్లికన్లకే స్వల్ప మెజార్టీ ఉండడంతో ఈ బిల్లు పాస్ కాకపోతే ఏం చెయ్యాలన్న ఆందోళనలో అధ్యక్షుడు జో బైడెన్ ఉన్నారు. అదే జరిగితే 20 లక్షల మందికి పైగా భద్రతా సిబ్బంది జీతాల్లేకుండా పని చేయాల్సి ఉంటుంది. వివిధ పథకాలకు నిధులు కేటాయించలేరు.

పాఠాలు మానేసి ఇన్‌స్టా రీల్స్

లక్నో: స్కూలు పిల్లలకి పాఠాలు చెప్పే టీచర్లు సోషల్ మీడియా రీల్స్‌లో మునిగి తేలుతున్నారు. ఒక టీచర్ కెమెరా ముందు యాక్షన్ చేస్తే, మరో టీచర్ దానిని షూట్ చేయడం, ఇంకో టీచర్ ఎడిటింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లు పోస్టు చేయడం ఇదీ తంతు. అక్కడితో వారు ఆగలేదు. తమ చానెల్‌ను లైక్, షేర్ చేసి సబ్‌స్క్రైబ్ చేయాలంటూ పిల్లలపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో గత కొద్ది నెలలుగా ఇదే జరుగుతూ వస్తోంది. దీంతో విసిగిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ టీచర్లపై చర్యలు తీసుకోవాలంటూ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (డీఎం)కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ''మా టీచర్స్ అంబికా గోయెల్, పూనమ్ సింగ్, నీతూ కశ్యప్ ప్రతి రోజూ రీల్స్ చేస్తారు. వాటిని లైక్ చేసి షేర్ చేయాలని మాపై ఒత్తిడి తెస్తారు. అలా చేయకపోతే కొడతామంటూ వార్నింగ్ కూడా ఇస్తున్నారు'' అని అన్ను అనే విద్యార్థిని తన గోడు చెప్పుకుంది. తమ చేత టీ పెట్టించుకోవడం, వారి కోసం వండి పెట్టడం వంటి పనులు కూడా చేయించుకుంటారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే టీచర్లు ఈ ఆరోపణల్ని కొట్టి పారేశారు.

ఐఎన్ఎస్ అధ్యక్షునిగా రాకేశ్ శర్మ

నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న ది ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ



న్యూఢిల్లీ: ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ(ఐఎన్ఎస్)కి 2023–24 కాలానికి నూతన అధ్యక్షునిగా రాకేశ్ శర్మ(ఆజ్ సమాజ్) ఎన్నికయ్యారు. వార్తాసంస్థలు, మ్యాగజైన్‌లు, పీరియాడికల్స్ సంస్థల సంఘమైన ఐఎన్ఎస్ 84వ వార్షిక సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఇప్పటిదాకా సంస్థకు కె.రాజ ప్రసాద్ రెడ్డి(సాక్షి) అధ్యక్షునిగా కొనసాగిన విషయం తెల్సిందే. 2023–24 కాలానికి గాను ఐఎన్ఎస్ డిప్యూటీ ప్రెసిడెంట్‌గా శ్రేయాంస్ కుమార్(మాతృభూమి), వైస్ ప్రెసిడెంట్‌గా వివేక్ గుప్తా(సన్మార్గ్), గౌరవ ట్రెజరర్‌గా తన్మయ్ మహేశ్వరి(అమర్ ఉజాలా) ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.రాజ ప్రసాద్ రెడ్డి(సాక్షి), ఐ.వెంకట్(ఈనాడు, అన్నదాత)సహా 41 మంది ఎన్నికయ్యారు. సొసైటీకి సెక్రెటరీ జనరల్‌గా మేరీ పాల్ ఎంపికయ్యారు. మరోవైపు అధ్యక్షునిగా కొనసాగిన కాలంలో తనకు పూర్తి సహాయక సహకారాలు అందించిన ఐఎన్ఎస్ ఉపాధ్యక్ష, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, తదితరులకు మాజీ అధ్యక్షుడు కె.రాజ ప్రసాద్ రెడ్డి(కేఆర్‌పీ రెడ్డి) కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023

ఓటేరిలో ఆలయ ఆస్తులు స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై ఓటేరి సెల్వ పిల్లయార్ ఆలయానికి సొంతమైన రూ.1.5కోట్ల విలువైన ఆస్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు దేవదాయశాఖ అధికారులు ఆలయాలకు చెందిన ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఓటేరి సెల్వ పిల్లయార్ ఆలయానికి చెందిన రూ.1.5 కోట్లు విలువ చేసే ఆస్తులను దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ జాముల్లై, అధికారులు సి.నిత్య సమక్షంలో పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రాణం తీసిన ఏసీ
– ఇద్దరు మృతి

సాక్షి, చెన్నై: ఏసీలో ఏర్పడిన మంటలు, పొగ కారణంగా ఊపిరి ఆడకపోవడంతో తల్లి కుమార్తె మరణించారు. శనివారం ఈ ఘటన అంబత్తూరు సమీపంలోని చోటు చేసుకుంది. వివరాలు.. చెన్నై శివారులోని అంబత్తూరు మీనంబేడు ఏకాంబర నగర్‌లో ఆదిల(50) తన కుమార్తె నస్రీన్(16)తో నివాసం ఉన్నారు. ఆమె భర్త రహ్మాన్ ఇటీవల మరణించాడు. తమ బంధువుకు చెందిన ఇంట్లో వీరు అద్దెకు ఉన్నారు. నస్రీన్ సమీపంలోని పాఠశాలలో ప్లస్‌-2 చదువుతోంది. ఆదిల అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం వీరు నివాసం ఉన్న ఇంటి నుంచి పొగ రావడాన్ని ఇరుగు పొరుగు వారు గుర్తించారు. తలుపులు పగుల కొట్టి చూడగా... లోపల తల్లికుమార్తె స్పృహ తప్పిపడి ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. తర్వాత ఆ ఇద్దరు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కీల్పాకం ఆస్పత్రికి పోలీసులు తరలించారు. విచారణలో ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు, పొగ రావడంతో కారణంగా ఊపిరి ఆడక ఆ ఇద్దరూ మరణించినట్లు తేలింది.

ఎంఎస్‌ఎంఈలకు ఊరట
– మెట్టు దిగిన విద్యుత్ బోర్డు

సాక్షి, చెన్నై: విద్యుత్ చార్జీల వడ్డనకు వ్యతిరేకంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈ)ల పోరాటంపై ప్రభుత్వం స్పందించింది. సీఎం స్టాలిన్ ఆదేశాలతో కొన్ని రకాల చార్జీల వ్యవహారంలో పాత పద్ధతిని అనుసరించేందుకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ శనివారం నిర్ణయించింది. వివరాలు.. గత ఏడాది నుంచి ఏటా విద్యుత్ చార్జీ వడ్డన దిశగా విద్యుత్ రెగ్యులేటరి కమిషన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గృహాలకు ఈ ఏడాది విద్యుత్ చార్జీలు పెంచలేదు. అయితే వర్తక, వాణిజ్య సంస్థలు, చిన్న,మధ్య తరహా, భారీ పరిశ్రమలకు చార్జీల వడ్డన మోగించారు. అయితే, అతి పెద్ద పరిశ్రమలకు విధించినట్టుగానే తమకు కూడా పీక్ అవర్స్ తదితర అన్ని రకాల చార్జీలను తమపై భారంగా మోపడాన్ని ఎంఎస్‌ఎంఈలు తీవ్రంగా పరిగణించారు. పెద్ద పరిశ్రమలతో సమానంగా తమపై అన్ని రకాల చార్జీలను మోపడాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 25వ తేదీన రాష్ట్రంలోని కోయంబత్తూరు, తిరుచ్చి, తిరుప్పూర్, నామక్కల్, విరుదునగర్, కృష్ణగిరి, తూత్తుకుడి, చెన్నై తదితర జిల్లాలోని ఎంఎస్‌ఎంఈలు ఒక రోజు నిరసనగా సమ్మె నిర్వహించాయి. దీంతో అధికారులు, మంత్రులు స్పందించి ఎంఎస్‌ఎంఈ యాజమాన్యాలతో చర్చించారు. ఇందులో ఫలితం దక్కని దృష్ట్యా ఈనెల 14వ తేదీ మళ్లీ పోరుకు నిర్ణయించారు. ఈ పరిస్థితుల్లో సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ శనివారం ప్రకటన చేసింది. కొన్ని రకాల చార్జీల వ్యవహారంలో పాత పద్ధతే అమలు అవుతుందని ప్రకటించింది. దీంతో ఎంఎస్‌ఎంఈలకు కాస్త ఊరట లభించినట్లయ్యింది.

కారును ఢీకొన్న బస్సు
– ముగ్గురి మృతి

అన్నానగర్: తిరుమయం సమీపంలో శుక్రవారం సాయంత్రం కారును బస్సు ఢీకొనడంతో తల్లి, కొడుకు సహా ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. శివగంగై సమీపంలోని ఒక్కూరు సమీపంలో ఉన్న కీళపూంగుడికి చెందిన అంజలి (45). ఈమె కుమారులు ముకిలన్ (22), ఆదీశ్వరన్ (14), అఖిలన్ (17). ఈ నేపథ్యంలో అంజలి తన కుమారులతో కలిసి పుదుకోట్టై జిల్లాలోని పెరైయూర్ నాగనాథ దేవాలయంలో స్వామి దర్శనం కోసం ముత్తుపట్టికి చెందిన సంతోష్ (25) కారులో శుక్రవారం ఉదయం పేరైయూర్ నాగనాథ ఆలయానికి వెళ్లారు. అనంతరం ఆలయంలో స్వామి దర్శనం చేసుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కారు పుదుకోట్టై జిల్లా తిరుమయం సమీపంలో వస్తుండగా మదురై నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి కారును వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజలి, డ్రైవర్ సంతోష్, ముఖిలన్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం గాయపడిన ఆదీశ్వరన్, అఖిలన్‌ను పుదుకోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి తీవ్రచికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

75 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: మన్నార్కుడి సమీపంలో శుక్రవారం రాత్రి ఇంటి తాళం కోసి 75 సవర్ల నగలు దోచుకెళ్లిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. తిరువారూరు జిల్లా మన్నార్కుడి సమీపం మహాలక్ష్మి నగర్‌కు చెందిన అరుణాచలం (45) సింగపూర్‌లోని ఓ నిర్మాణ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని భార్య లావణ్య(35). వీరి కుమార్తె సుష్మ(18). అరుణాచలం సెప్టెంబర్ 18న సింగపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. అతని తల్లి యశోద సమీపంలోని సోనాపేట్ గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. అరుణాచలం శుక్రవారం సాయంత్రం తల్లిని చూసేందుకు కుటుంబ సమేతంగా సోనాపేటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ముందు తలుపు తాళం పలుగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని 75 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి మన్నార్‌గుడి నగర పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

రాష్ట్రంలో మహారాజకీయం

అన్నాడీఎంకేలో చిచ్చుపెట్టే దిశగా బీజేపీ వ్యూహాలు పన్నుతోందనే ప్రచారం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆ పార్టీలో సీనియర్‌గా ఉన్న ఎస్పీ వేలుమణిని అస్త్రంగా చేసుకుని పళణి స్వామికి వ్యతిరేకంగా కేంద్రపెద్దలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఫలితంగా అన్నాడీఎంకే నుంచి త్వరలో ఓ ఏక్‌నాథ్ షిండే వస్తారని, మహారాష్ట్ర తరహా రాజకీయం తమిళనాడులో చూడబోతున్నామనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో ఊపందుకుంది.

కమలం.. గాలం?
- అన్నాడీఎంకేలో చీలికకు బీజేపీ యత్నం
- కేసులను సాకుగా చూపి వేలుమణిని తమవైపు తిప్పుకునేందుకు యత్నం
- ఊహాగానాలను ఖండించిన వేలుమణి
- నేడు అమిత్ షాతో అన్నామలై భేటీ


ఎస్పీ వేలుమణి, అన్నామలై

సాక్షి, చెన్నై: ఎన్డీయే కూటమి నుంచి అన్నాడీఎంకే ఇటీవల బయటకు వచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో పళణిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే వర్గాలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను టార్గెట్ చేసి విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టే పనిలో పడ్డారు. రాయబారానికి, సామరస్యానికి చోటు లేదని స్పష్టం చేస్తూ, ఇక బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ఈ పరిణామాలను బీజేపీ అధిష్టానం పెద్దలు నిశితంగా పరిశీలిస్తున్నారు. అయితే అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటిస్తున్నారు. అదే సమయంలో కొత్త వ్యూహాలకు సైతం పదును పెట్టినట్లు తెలుస్తోంది.

చిచ్చు ప్రయత్నాలు

అన్నాడీఎంకే సీనియర్లలో ఎస్పీ వేలుమణి కీలక నేత. ఆయనపై అనేక కేసులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసులను అస్త్రంగా చేసుకుని ఆయన్ని తమ దారికి తెచ్చుకునేందుకు బీజేపీ వ్యూహ రచన చేస్తున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఎస్పీ వేలుమణి ద్వారా అన్నాడీఎంకేలో చిచ్చు పెట్టే అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నట్లు చర్చ జోరందుకుంది. అన్నాడీఎంకేలో ఎస్పీ వేలుమణి ఓ ఏక్‌నాథ్ షిండే (మహారాష్ట్ర సీఎం) అన్న ట్యాగ్‌లైన్‌తో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలో శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రేను ఏవిధంగా ఏక్‌నాథ్ షిండే కూల దోశాడో..అదే తరహాలో పళణి స్వామికి ఎస్పీ వేలుమణి చుక్కలు చూపించబోతున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఇది కాస్త అన్నాడీఎంకేలో కొత్త చర్చకు దారి తీశాయి. దీంతో ఎస్పీ వేలుమణి స్పందించారు. తాను అప్పుడు.. ఇప్పుడు..ఎల్లప్పుడూ అన్నాడీఎంకేకు విశ్వాస పాత్రుడినే అని స్పష్టం చేశారు. తాను సైకిల్ యాత్ర చేసిన ఫొటోను ట్యాగ్ చేస్తూ తన సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాలకు ముగింపు పలికే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా, అన్నాడీఎంకే కూటమి సీఎం అభ్యర్థిగా అన్నామలైను ప్రకటించాలని బీజేపీ ఒత్తిడి తీసుకు రావడంతోనే కూటమి నుంచి తాము బయటకు వచ్చామని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కరుప్పన్నన్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బీజేపీకి వారి బలం ఏమిటో లోక్ సభ ఎన్నికలు స్పష్టం చేస్తాయని మరో సీనియర్ నేత కేపీ మునుస్వామి వ్యాఖ్యానించారు.

నేడు అమిత్ షాతో అన్నామలై

అన్నాడీఎంకే కటీఫ్ ప్రకటన నేపథ్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపుతో అన్నామలై అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాతో ఆయన భేటీ కానున్నారు. దూకుడు మీదున్న అన్నామలై అమిత్ షా ముందు కొత్త ప్రతిపాదనను ఉంచేందుకు సిద్ధమైనట్లు చర్చ ఊపందుకుంది. రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయడానికి అనుమతి ఇవ్వాలని అమిత్‌షాను ఆయన కోరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అప్పుడే తమిళనాడులో బీజేపీ బలం ఏమిటో తెలుస్తుందని, అందుకు అనుగుణంగా భవిష్యత్తుకు కార్యాచరణ సిద్ధం చేయవచ్చు అనే విషయాన్ని తెలియజేస్తూ ఓ నివేదికను సిద్ధం చేసుకుని మరీ ఆయన ఢిల్లీ వెళ్తున్నట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పళణి కొత్త ప్రయత్నాలు

బీజేపీతో ఇక దోస్తీ లేదని తేల్చిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి కొత్త కూటమి ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు సమాచారం. బలమైన కూటమి దిశగా తమతో కలిసి రావాలని పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్, డీఎండీకేలకు ఆహ్వానం పలికేవిధంగా రాయబార ప్రయత్నాలు మొదలెట్టినట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఈ మూడు పార్టీలతోపాటు కొన్ని చిన్న పార్టీలను తన వైపునకు తిప్పుకునే దిశగా ప్రయత్నాలను జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది. డీఎంకేలో అసంతృప్తిగా ఉన్న కొన్ని చిన్న పార్టీలను సైతం కలుపుకునే ప్రయత్నంలో పళణిస్వామి ఉన్నట్లు అన్నాడీఎంకే నేతలు పేర్కొంటున్నారు.



గవర్నర్‌తో డీఎండీకే నేత ప్రేమలత భేటీ


గవర్నర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రేమలత విజయకాంత్

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవితో డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్ శనివారం భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులు, పలు సమస్యలను గవర్నర్‌కు వివరించారు. మరికొన్ని అంశాలపై ఫిర్యాదు చేశారు. ఉదయం డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు పలువురు రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఈసందర్భంగా గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని పరిస్థితులు, పలు సమస్యలు, కావేరి వ్యవహారం తదితర అంశాలపై ఈ భేటీలో చర్చించారు. అనంతరం మీడియాతో ప్రేమలత విజయకాంత్ మాట్లాడుతూ, ఈ భేటిలో చర్చించిన అంశాలు, ఫిర్యాదులు గురించి వివరించారు. కావేరి వ్యవహారంలో కర్ణాటక తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రంతో చర్చించి త్వరితగతిన ఈ వివాదానికి ముగింపు ఇవ్వాలని, కావేరి జలాలపై తమిళులకు ఉన్న హక్కులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు వివరించారు. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారంగా జాతీయ, రాష్ట్ర నదులను అనుసంధానించాలని డీఎండీకే డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కావేరి వ్యవహారంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రిదురై మురుగన్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కడలూరు జిల్లా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్‌కు స్థలాలు ఇచ్చిన వారికి ఉద్యోగాలు దక్కకపోవడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్ఎల్‌సీ కార్మికులకు న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. జాలర్లపై శ్రీలంక నేవీ దాడులను ప్రస్తావించామని, ఈ దాడులకు ముగింపు పలికేవిధంగా భారత భూభాగం కచ్చ దీవులను మళ్లీ స్వాధీనం చేసుకోవాలని గవర్నర్‌కు విన్నవించామన్నారు.

ఇద్దరు బిడ్డలతో తల్లి ఆత్మాహుతి

- షాక్‌గురై గుండెపోటుతో తండ్రి మృతి
- ఉలందూరు పేటలో విషాదం

సాక్షి, చెన్నై : ఇద్దరు బిడ్డలు సహా ఓ తల్లి ఆత్మాహుతికి పాల్పడింది. షాక్‌లో ఆమె తండ్రి గుండెపోటుతో కుప్పకూలాడు. రక్షించే ప్రయత్నంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా ఉలందూరు పేట సమీపంలోని నత్తామూరు గ్రామానికి చెందిన పొన్ను రంగన్(70)కు నలుగురు కుమార్తెలు. స్థానికంగా సిమెంట్, యూరియా స్టోర్‌ను పొన్ను రంగన్ నడుపుతున్నాడు. చిన్న కుమార్తె ద్రవ్యం(42)కు కిలాపాళయానికి చెందిన మదురై వీరన్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రియాషిని(4), విజయకుమారి(3) అనే కుమార్తెలు ఉన్నారు. రెండో బిడ్డ కాన్పు కోసం నత్తామూరుకు వచ్చిన ద్రవ్యం ఆ తర్వాత భర్త ఇంటికి వెళ్ల లేదు. ఆమె మానసికంగా బాధ పడుతూ రావడంతో తండ్రి ఆమెను తన ఇంట్లోనే ఉండి పోమని సూచించాడు. కాలక్రమంలో ద్రవ్యం మానసిక రోగిగా మారింది. శుక్రవారం తాను ఆత్మహత్య చేసుకోనున్నట్టు పేర్కొని, ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రయత్నం చేసింది. తండ్రితో పాటు బంధువులు బుజ్జగించడంతో మౌనంగా తన గదిలోకి వెళ్లి పోయింది. రాత్రి భోజనాల అనంతరం తన గదిలోకి పిల్లలతోపాటు వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. నిద్రిస్తున్న పిల్లలకు సైతం మంటలు వ్యాపించాయి. పిల్లలు పెడుతున్న కేకలతో బంధువులు పరుగులు తీశారు. గది తలుపులు పగలు కొట్టిలోనికి వెళ్లేలోపు తల్లి, కుమార్తెలు సజీవదహనం అయ్యారు. ఈ ఘటనను చూసిన ద్రవ్యం తండ్రి పొన్నురంగన్ షాక్ గురై కుప్పకూలి పోయాడు. ఆయన్ని ఆస్పత్రికి తరలించగా గుండె పోటుతో మరణించినట్లు వైద్యులు తేల్చారు. ద్రవ్యంను రక్షించే ప్రయత్నంలో బంధువు విజయకుమార్(30) తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ఇంట్లో ఉన్న బంధువు కుమారుడు వివేక్(4)కు కూడా గాయాలయ్యాయి. ఈ ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం విల్లుపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మాహతి చేసుకోవడం, షాక్‌తో మరొకరు మరణించడం వారి బంధువుల్ని తీవ్రంగా కలిచి వేసింది.

సుప్రీంకోర్టుకు పొన్ముడి

- సుమోటో కేసుపై అప్పీల్ పిటిషన్
- మదురైకు జస్టిస్ ఆనంద వెంకటేషన్ బదిలీ
- మూడు నెలలు ధర్మాసనంలోనే విధులు


పొన్ముడి


జస్టిస్ ఆనంద వెంకటేషన్

సాక్షి, చెన్నై: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో తన విడుదలను వ్యతిరేకిస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఆనంద వెంకటేషన్ నమోదు చేసిన సుమోటో కేసుపై అప్పీల్‌కు వెళ్లారు. వివరాలు.. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి పొన్ముడిపై గతంలో అనేక కేసులు దాఖలైన విషయం తెలిసిందే. ఈ కేసుల నుంచి ప్రస్తుతం ఆయనకు ఊరట కలగడం, విడుదల చేస్తూ తీర్పులు రావడం జరుగుతోంది. ఇందులో రెండు నెలల క్రితం వేలూరు కోర్టు ఇచ్చిన తీర్పు చర్చకు దారి తీసింది. 1996–2011లో రవాణా మంత్రిగా ఉన్న సమయంలో పొన్ముడి ఆదాయానికి మించి ఆస్తులు గడించినట్టు వచ్చిన ఫిర్యాదులతో అన్నాడీఎంకే ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ కేసులో 172 మంది సాక్ష్యాలను విచారణ అధికారులు నమోదు చేశారు. తొలుత విల్లుపురం కోర్టులో, ఆ తర్వాత వేలూరు కోర్టులో విచారణ జరిగింది. గత నెల కోర్టు ఇచ్చిన తీర్పులో పొన్ముడి నిర్దోషిగా విడుదలయ్యారు. ఆధారాలు లేవని న్యాయమూర్తి వసంత లీల తీర్పు వెలువరించారు. అయితే, ఈ విడుదలను వ్యతిరేకిస్తూ ఏసీబీ తరపున ఎలాంటి అప్పీల్ పిటిషన్ దాఖలు కాలేదు. ఇది చర్చకు దారి తీసిన నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తి ఆనంద వెంకటేషన్ స్పందించారు. సుమోటోగా కేసు నమోదు చేస్తూ విచారణకు నిర్ణయించారు. పొన్ముడితో పాటు ఈ కేసులో ఉన్న వారందరికి నోటీసులు జారీ చేశారు. ఇది కాస్త పొన్ముడిని ఇరాటంలో పెట్టినట్లయ్యింది. దీంతో ఆనంద వెంకటేషన్ బెంచ్ సుమోటోగా స్వీకరించిన కేసుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తలుపు తట్టారు. అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. సుమోటో కేసు విచారణకు స్టే విధించాలని కోరారు. ఇదిలా ఉండగా, పొన్ముడితో పాటు తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తదితర మంత్రులు, మాజీ సీఎం పన్నీరు సెల్వం, అన్నాడీఎంకే మాజీ ఎంపీ వలర్మతిని సైతం ఇరకాటంలో పెట్టే విధంగా ఆనంద వెంకటేషన్ సుమోటో కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.

జస్టిస్ ఆనంద వెంకటేషన్ బదిలీ

ప్రజా ప్రతినిధులకు సంబంధించిన కేసులను విచారించే అధికారం కలిగిన జస్టిస్ ఆనంద వెంకటేషన్ గత నెల రోజులుగా వార్తల్లో వ్యక్తిగా ఉన్నారు. కింది కోర్టులు క్లీన్‌చీట్ ఇవ్వడంతో కేసుల నుంచి బయట పడ్డ ప్రజా ప్రతినిధులను మళ్లీ ఇరకాటంలో పెట్టే విధంగా సుమోటోగా కేసులను ఆయన నమోదు చేస్తూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ని మదురై ధర్మాసనానికి బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మదురై ధర్మాసనంలో 3 నెలలు ఆయన విధులను నిర్వర్తించనున్నారు. ఈకాలంలో ఆయన ఖనిజ సంపద, స్థల వివాదాలు, ఆస్తుల కేసులు, పింఛన్లు తదితర వ్యవహారాలకు సంబంధించిన కేసులను విచారించనున్నారు. మదురై ధర్మాసనానికి ఆయన బదిలీ నేపథ్యంలో సుమోటో కేసుల విచారణ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

హరిత విప్లవ పితామహుడుకి కన్నీటి వీడ్కోలు

- పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు


స్వామినాథన్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న పళణి స్వామి

సాక్షి, చెన్నై: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. చెన్నై బీసెంట్ నగర్ శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు జరిగాయి. వివరాలు.. భారత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులతో ఆహార కొరతను ఎదుర్కొనేందుకు మేలైన వరి వంగడాలను సృష్టించిన ఘనత ఎంఎస్ స్వామినాథన్‌కే దక్కిందన్న విషయం తెలిసిందే. దశాబ్ద కాలం పాటు భారత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు ఎంఎస్ స్వామినాథన్ నాంది పలికారు. ఈ క్రమంలో గురువారం శాశ్వత విశ్రాంతిలోకి వెళ్లారు. చెన్నై తేనంపేట నివాసంలో వయోభారం సమస్యలతో స్వామినాథన్ (98) కన్ను మూశారు. ఆయన పార్థీవ దేహాన్ని గురువారం రాత్రి తరమణిలోని ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ పరిశోధనా కేంద్రానికి తరలించారు. శుక్రవారం అంతా అక్కడే ఉంచారు. ఆయనభౌతిక దేహానికి సీఎం స్టాలిన్ తొలుత అంజలి ఘటించారు. శనివారం ఉదయం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి తదితరులు నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు తరమణి నుంచి అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా ఎంఎస్ పార్థీవ దేహాన్ని బీసెంట్ నగర్ శ్మశాన వాటికకు తరలించారు. పలువురు ప్రముఖులు, సన్నిహితులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు అంతిమయాత్రకు తరలి వచ్చారు. బీసెంట్ నగర్ ఎలక్ట్రిక్ శ్మశాన వాటిక వద్ద ఆయన పార్థీవ దేహానికి చివరి చూపుగా కుమార్తెలు, ఆప్తులు చూసుకుని కన్నీటి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమిళనాడు పోలీసు యంత్రాంగం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గాలిలో మూడు రౌండ్ల కాల్పుల అనంతరం ఎంఎస్ స్వామినాథన్ పార్థీవ దేహాన్ని విద్యుత్ శ్మశాన వాటికలో దహనం చేశారు.

పది జిల్లాలకు వరుణగండం

సాక్షి, చెన్నై: బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నెలకొన్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో 10 జిల్లాలో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కన్యాకుమారి, రామేశ్వరం జాలర్లు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వివరాలు.. వాతావరణ మార్పుల నేపథ్యంలో చెన్నై, శివారు జిల్లాలో గత కొద్ది రోజులుగా ఉదయం భానుడి ప్రతాపం, రాత్రులలో వరుణుడి బీభత్సం కొనసాగుతూ వస్తున్న విషయం తెలిసిందే. శుక్ర, శనివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆరేబియా సముద్రంలో ఓ వైపు, బంగాళాఖాతంలో మరోవైపు ప్రస్తుతం అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో కన్యాకుమారి సముద్ర తీరం అల్లకల్లోలంగా ఉంది. ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో జాలర్లను వేటకు వెళ్లకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇక, బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనంతో చెన్నై నుంచి తూత్తుకుడి వరకు సముద్ర తీరాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు అనేక చోట్ల పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. మూడురోజుల పాటు కోయంబత్తూరు, తిరునల్వేలి, నీలగిరి, తేని, దిండుగల్, రాణి పేట, కాంచీపురం, చెంగల్పట్టు , విల్లుపురం జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుముల మెరుపుల వర్షం అనేక చోట్ల పడే అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. సముద్రంలో గాలి ప్రభావం అధికంగా ఉండడంతో రామేశ్వరం, నాగపట్నం జాలర్లు వేటకు వెళ్ల లేదు.


కూలిన పెట్రోల్ బంక్ పైకప్పు


వర్షంలో వాహనదారులు

కూలిన పెట్రోల్ బంక్ పై కప్పు

చెన్నైలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం పడింది. సైదాపేట సమీపంలో పెట్రోల్ బంక్ పైకప్పు కూలడంతో ఒకరు మరణించారు. వర్షం పడుతున్న సమయంలో వాహన దారులు, పాదచారులు పెట్రోల్ బంక్ వద్ద తలదాచుకున్నారు. అయితే, గాలిధాటికి పైకప్పు కూలింది. భయంతో అక్కడున్న వారు పరుగులు తీశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని ఆస్పత్రికి తరలించారు. ఇందులో కందస్వామి అనే వ్యక్తి మరణించాడు. మరో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అనేక ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పెట్రోల్ బంక్ మేనేజర్ వినోద్‌ను అరెస్టు చేశారు. ఆబంక్‌ను సీజ్ చేశారు.

జ్వరాలు స్వైరవిహారం

వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. చెన్నైలో డెంగీ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చెన్నైలో పది రోజుల క్రితం డెంగీతో మరణించిన బాలుడి సోదరుడికి సైతం ప్రస్తుతం అదే జ్వరం నిర్ధారణ అయ్యింది. ఆ బాలుడికి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మేట్టూరు పోలీసు అకాడమీలో శిక్షణలో ఉన్న 54 మంది జ్వరం బారిన పడడంతో వీరందరినీ ప్రత్యేక వార్డుకు తరలించారు.

పీజీ డాక్టర్ అనుమానాస్పద మృతి


డా.సింధుజ (ఫైల్)

మైసూరు: కర్ణాటక రాష్ట్రం చామరాజనగర జిల్లాలోని కొళ్లేగాలలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో పీజీ చేస్తున్న డాక్టర్ డాక్టర్ సింధుజ (28) అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. తమిళనాడులోని చెన్నైకి చెందిన వెంకటాచలం అనే వ్యక్తి కుమార్తె సింధుజ. తమిళనాడులో ఎంబీబీఎస్ పూర్తి చేసి తరువాత పరీక్షలు రాసి పీజీ అనస్తీషియా (మత్తు) కోర్సుకు అర్హత సాధించింది. గత 8 నెలల నుంచి కొళ్లేగాల ప్రభుత్వ ఉప విభాగం ఆస్పత్రిలో చదువుకుంటూ, శ్రీమహాదేశ్వర కాలేజీ రోడ్డులో అద్దె ఇంటిలో నివసిస్తోంది.

డ్యూటీకి రాకపోవడంతో..

సింధుజ శుక్రవారం ఆస్పత్రికి విధులకు రాలేదని, దీంతో మరో డాక్టర్ లోకేశ్వరి ఆమెకు కాల్ చేసినా స్పందన రాలేదు. మధ్యాహ్నం 3 గంటల వరకూ రాకపోవడంతో అనుమానం వచ్చి ఆస్పత్రి సిబ్బంది ఒకరికి చూసి రమ్మని ఆమె ఇంటికి పంపారు. తలుపు కొట్టినా ఎలాంటి సమాధానం రాకపోడంతో కిటికీలో నుంచి చూడగా సింధుజ నేలపైన బోర్లా పడి ఉంది. పక్కనే సిరెంజి, చాకు కనిపించాయి. పోలీసులు వచ్చి తలుపులు తీసి వెళ్లి చూడగా సింధుజ చనిపోయి పడివుంది. విషపూరిత ఔషధాలను తీసుకుని చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

క్లుప్తంగా

పెరుమాళ్ మట్టి విగ్రహం లభ్యం

అన్నానగర్: ఎయిర్‌వాడీ సమీపంలో శుక్రవారం పెరుమాళ్ విగ్రహం లభ్యమైంది. తిరునెల్వేలి జిల్లా ఎయిర్‌వాడీ సమీపంలోని తలపతి సముద్రం మెల్లారులో మహిళా కార్మికులు 100 రోజుల పని పథకంలో గ్రామాన్ని శుభ్రం చేసే పనిలో శుక్రవారం నిమగ్నమయ్యారు. అప్పుడు వారు మట్టిలో పాతిపెట్టిన పెరుమాళ్ పురాతన విగ్రహాన్ని గుర్తించారు. దాని ఎత్తు సుమారు 4 అడుగులు దీనిపై గ్రామ పరిపాలన అధికారికి సమాచారం అందించారు. అనంతరం నాంగునేరి తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు పెరుమాళ్ విగ్రహాన్ని సురక్షితంగా తీసుకెళ్లి నంగునేరి తహసీల్దార్ సమక్షంలో అక్కడి ట్రెజరీకి అప్పగించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కొరుక్కుపేట: టీవీ మెకానిక్ హత్యకేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. చెన్నైలోని పెరుంబాక్కం పక్కనే ఉన్న వెలచ్చేరిలోని ఎస్సిల్‌నగర్‌కు చెందిన రాజా (39) టీవీ మెకానిక్. ఆయనకు భార్య శాంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతడు శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోకి రాగా.. మద్యం మత్తులో అక్కడికి వచ్చిన గోపి(24), బాబులు, మఖాబుల్ బాషా, డీవో సత్య, శీను, అజిత్‌కుమార్ కత్తులు, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన రాజా కేకలు వేయడంతో స్థానికులు గోపి, అజిత్ కుమార్‌ని పట్టుకున్నారు. ఇక రాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రూ.24 లక్షల విలువైన బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో శనివారం ఉదయం రూ.24 లక్షల స్మగ్లింగ్ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురుని అరెస్టు చేశారు. తిరుచ్చి విమానాశ్రయానికి శనివారం ఉదయం కౌలాలంపూర్, షార్జా, దుబాయ్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణికులను విమానాశ్రయంలోని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. కౌలాలంపూర్‌కు చెందిన ఓ ప్రయాణికుడు లో దుస్తుల్లో బంగారు ఆభరణాలను తీసుకెళ్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా దుబాయ్, షార్జాలకు చెందిన ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా జీన్స్ ప్యాంట్లలో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నట్లు తేలింది. అనంతరం కస్టమ్స్ అధికారులు ముగ్గురిని అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ.24 లక్షల 84 వేల విలువైన 401 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అవార్డు గ్రహీతలతో వెంకయ్యనాయుడు


బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవంలో వెంకయ్యనాయుడు

మహనీయుల జీవితాలు ఆదర్శం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- అల్పాహార ప్రాజెక్టుకు శ్రీకారం
- వెంకయ్య నాయుడుకి కర్మయోగి బిరుదు ప్రదానం

కొరుక్కుపేట: మహాత్మా గాంధీ, వినోబాబావే, దీదీ నిర్మలా దేశ్‌పాండే వంటి మహనీయుల జీవితాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం హరిజన్ సేవక్ సంఘ్, తక్కరి బాపా విద్యాలయ సమితి సంయుక్తంగా మహాత్మా గాంధీ, వినోబాబావే, దీదీ నిర్మలా దేశ్‌పాండే జయంతి వేడుకలు, 75వ ఆల్ ఇండియా హరిజన సేవక్ సంఘ్ ప్రస్తుత అధ్యక్షుడు, ప్రొఫెసర్ శంకర్ కుమార్ సన్యాల్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. చెన్నై టి.నగర్‌లోని తక్కర్ బాపా విద్యాలయ క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా తక్కర్ బాపా విద్యాలయ సమితికి చెందిన ఐటీఐ విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ సహకారంతో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని వెంకయ్య నాయుడు ప్రారంభించారు. అనంతరం బాపుజీ, ఆచార్య వినోబాబావే, గాంధేయవాది దీదీ నిర్మలా దేశ్‌పాండే చిత్రపటాలకు నివాళులర్పించారు. మహనీయులు జీవితాలు త్యాగానికి సంబంధించిన పాఠాలు, సమాజానికి సేవ చేయాలనే అంకితభావానికి ఉదాహరణలు అని వ్యాఖ్యానించారు. ఆల్ ఇండియా హరిజన సేవక్ సంఘ్ అధ్యక్షుడు శంకర్ కుమార్ సన్యాల్ జీ దేశం, విదేశాల్లో గాంధీ మిషన్‌ను అవిశ్రాంతంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గాంధేయ విలువలను పెంపొందించే వ్యక్తులకు గుర్తింపుగా హరిజన బంధు అవార్డులను 10 మందికి అందించారు. అలాగే హరిజన్ సేవక్ సంఘ్, తక్కర్ బాపా విద్యాలయ సమితి తరపున వెంకయ్య నాయుడు, ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ కుమార్ సన్యాల్‌లకు కర్మయోగి బిరుదును ప్రదానం చేశారు. హరిజన్ సేవక్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మారుతి, సలహాదారు డి.రాజేంద్రన్, శ్రీగీతా భవన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మను గోయల్, మక్కల్ కురల్ ఎడిటర్ ముత్తుకుమార్ పాల్గొన్నారు.

ఆటిజం పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల

కొరుక్కుపేట: కొత్త చాకలిపేటలోని పోర్ట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో చెన్నై పోర్ట్ అండ్ ఎన్నూర్ కామరాజర్ పోర్ట్, స్వబోధిని చారిటబుల్ ఆర్గనైజేషన్ కలిసి ఆటిజం పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. చెన్నై ఎన్నూర్ కామరాజ్ నగర్ ప్రభుత్వ అధికారి సునీల్ పాలివాల్ ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. ఆటిజం, అభిజ్ఞ బలహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు వైద్య సలహా, వ్యాయామం, వృత్తి శిక్షణ, కోచింగ్ అందించనున్నారు. ఇక్కడ శిక్షణ పొందే విద్యార్థులు ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పొందేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం 20 మంది పిల్లలు చేరారు. భవిష్యత్తులో 200 మందికి శిక్షణ ఇచ్చేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ ఎస్. విశ్వనాథన్, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ మురళీకృష్ణ, స్వాబోధిని చారిటబుల్ ఫౌండేషన్ ఫారెస్ట్ ఆర్గనైజర్ రాధా గణేషన్, నందిని ప్రియా కుమారి, ప్రీతి పాల్గొన్నారు.

లంచం తీసుకున్న ఇన్‌స్పెక్టర్‌కు మూడేళ్ల జైలు

అన్నానగర్: భద్రత కల్పించేందుకు రూ.5 వేలు లంచం తీసుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు కడలూరు కోర్టు శుక్రవారం 3 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కడలూరు జిల్లా సేత్తియాతోప్పు సౌత్ మెయిన్ రోడ్డుకు చెందిన మనోహరణ్ (60) స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారు. అనంతరం ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని మనోహరన్ చెన్నై హైకోర్టులో కేసు వేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపునకు భద్రత కల్పించాలని 2011లో సేతియాతోపు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె. ప్రభాకరన్ (64)కు మనోహరన్ అర్జీ పెట్టుకున్నాడు. భద్రత కల్పించాలంటే రూ. 5 వేలు లంచంగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే లంచం ఇవ్వడానికి ఇష్టపడని మనోహరన్ కడలూరు అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ విభాగంలో ఫిర్యాదు చేశాడు. 2011 జూలైలో నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కడలూరు చీఫ్ క్రిమినల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు వేశారు. రుజువు కావడంతో 3 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

50 కిలోల సముద్రపు నత్తలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నత్తలు

అన్నానగర్: సేదుబావచత్రం సమీపంలో శుక్రవారం 50 కిలోల సముద్రపు నత్తలను అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాలు.. తంజావూరు జిల్లా సేదుబావచత్రం ప్రాంతంలో సముద్రపు నత్తలు నిల్వ ఉన్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులకు శుక్రవారం సాయంత్రం సమాచారం అందింది. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ నేతృత్వంలో పోలీసులు బీచ్‌లో తనిఖీ నిర్వహించింది. అనంతరం అక్కడ అనుమానాస్పదంగా గోనె సంచులతో నిలబడి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణలో వారు తూత్తుక్కుడి జిల్లా త్రేస్పురానికి చెందిన మాణికం (48), రామనాథపురం జిల్లా తొండికి చెందిన రాజా (45) అని తేలింది. అలాగే వారి వద్ద ఉన్న బస్తాల్లో 50 కిలోల నిషేధిత సముద్రపు నత్తలు ఉన్నట్లు గుర్తించి మాణిక్యం, రాజాను అరెస్టు చేశారు.

కావేరిలో హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు



ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్ బాబు

సాక్షి, చెన్నై: వడపళనిలోని కావేరి ఆసుపత్రిలో కార్డియో వాస్కులర్ కేర్‌ను అభివృద్ధి పరిచే విధంగా అత్యాధునిక సౌకర్యాలతో హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని హిందూ, దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతికత గురించి కావేరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవిందన్ సెల్వరాజ్ మీడియాకు వివరించారు. అధునాతన కార్డియాక్ ఎంఆర్ఐ, సీటీ స్కానర్‌తో పాటు సరికొత్త రోగ నిర్ధారణ పరికరాలను కొలువు దీర్చామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమగ్ర గుండె సంరక్షణ సేవలకు కార్డియాక్ నిపుణుల బృందం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి కార్డియాక్ కేర్‌గా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ, ఇటీవల కాలంగా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని గుర్తు చేశారు. యువత సైతం గుండెపోటుకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో గుండె సంబంధింత వ్యాధుల నివారణ, అవగాహన కల్పించే విధంగా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయడం ఆహ్వానిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్

తిరువళ్లూరు: మద్యం సేవించి వాహనాలను నడపవద్దని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అన్నారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ వాహనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడడం సరికాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యార్థులు బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణం చేయవద్దన్నారు.

ఊయల చీర గొంతుకు చుట్టుకుని బాలుడి మృతి

అన్నానగర్: చెన్నై తురైపాక్కంలోని కన్నగి నగర్‌కు చెందిన వేలాయుధం (45) పెయింటర్. ఇతని భార్య మహాలక్ష్మి(40) వీరికి మణికంఠన్ (15), సెల్వ (12) అని ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం స్కూల్ ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన సెల్వ తన తండ్రికి కంటిలో మందు వేసి బయటకు వచ్చాడు. సరదాగా ఇంటి గుమ్మం దగ్గర చీరతో ఊయల కట్టుకుని అందులో కూర్చుని ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు చీర మెడకు బిగుసుకుపోయి మృతి చెందాడు. కన్నగి నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నటుడైన మరో దర్శకుడు

తమిళ సినిమా: ఇప్పటికే పలువురు దర్శకులు నటులుగా రాణిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రముఖ దర్శకుడు శీను రామసామి కూడా నటుడిగా అవతారం ఎత్తారు. తంగం సినిమాస్ పతాకంపై ఎస్ తంగరాజ్ నిర్మిస్తున్న చిత్రం ద్వారా విజయ్ కార్తీక్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన దర్శక నిర్మాత సీవీ కుమార్ శిష్యుడు అన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ద్వారా దర్శకుడు శీను రామస్వామి నటుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్ర షూటింగ్ శుక్రవారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. అరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఇందులో నటి నిరంజనా నాయకిగా నటిస్తున్నారు. చిత్ర విరాలను దర్శకుడు తెలుపుతూ ఇది నూతన సమాజానికి దోహదపడే కథా చిత్రంగా ఉంటుందన్నారు. దర్శకుడు శీను రామసామి ముఖ్యపాత్రను పోషిస్తున్నట్లు చెప్పారు. చిత్రాన్ని ప్రారంభించిన రోజునే సహాయ నటీనటులతో కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు చెప్పారు. తదుపరి విళ్లుపురం, కోవై, పొల్లాచ్చి ప్రాంతాల్లో షూటింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ఏఎస్ సూర్య ఛాయాగ్రహణం, ఎస్ఆర్ హరి సంగీతాన్ని అందిస్తున్నట్లు చెప్పారు.


దర్శకుడు శీను రామసామి నటుడిగా పరిచయం అవుతున్న చిత్రం ప్రారంభోత్సవం

కోలీవుడ్ టాక్స్

హిట్లర్‌గా విజయ్ ఆంటోని


హిట్లర్ చిత్రం ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్

తమిళ సినిమా: సంగీత దర్శకుడు, నటుడు విజయ్ ఆంటోని వరుసగా చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఈయన కథానాయకుడిగా నటించిన రక్తం చిత్రం అక్టోబర్ 6వ తేదీ తెరపైకి రానుంది. తాజాగా విజయ్ ఆంటోని నటించిన హిట్లర్ చిత్రం ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇంతకుముందు పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించిన చందూర్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ అధినేతలు టీడీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ నిర్మిస్తున్న ఏడో చిత్రం ఇది. డి.రాజా సమర్పణలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ కథాచిత్రం హిట్లర్. పడై వీరన్, వానం కొట్టటుం చిత్రాల ఫేమ్ ధనా కథా, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చిత్రంలో నటి రియా సుమన్ నాయకిగా నటిస్తుండగా, నటుడు చరణ్ రాజ్ చాలా గ్యాప్ తర్వాత ఇందులో ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. విజయ్ ఆంటోనికి సమానమైన పాత్రలో దర్శకుడు గౌతమ్ మీనన్ నటిస్తున్నారు. వీరితో పాటు రెడిన్ కింగ్స్, వివేక్ ప్రసన్న, ఆడుగళం నరేన్, దర్శకుడు తమిళ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వివేక్ మెరివిన్ సంగీతాన్ని, నవీన్ కుమార్ చాయగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు తెలిపారు. హిట్లర్ చరిత్రలో ఒక సర్వాధికారిగా పేరుగాంచిన వ్యక్తి అన్నారు. విజయ్ ఆంటోని నటిస్తున్న పాత్ర ఆ తరహాలో ఉండడంతో దీనికి హిట్లర్ అనే పేరును పెట్టినట్లు చెప్పారు. ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటుందన్నారు. చిత్ర ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్ విడుదల చేయగా మంచి స్పందన వస్తోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, చిత్ర ఆడియో, ట్రైలర్ విడుదల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపారు.

రక్తం మరుగుతోంది


నటి రిత్విక సింగ్

తమిళ సినిమా: మహిళలపై జరుగుతున్న అకృత్యాల గురించి చదువుతుంటే ఒంట్లో రక్తం మరుగుతోందని నటి రిత్విక సింగ్ పేర్కొంది. రియల్ బాక్సర్ అయిన ఈ ముద్దుగుమ్మ హిందీ, తమిళం భాషల్లో రూపొందిన ఇరుది చుట్రు చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయ్యింది. ఆ తర్వాత అదే చిత్రం రీమేక్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. అదే విధంగా తమిళంలో ఆండవన్ కట్టలై, శివలింగ, ఓమై కడవలే, కొలై తదితర చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. కాగా ఈమె సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై తీవ్రంగా స్పందించింది. తన ట్విట్టర్(ఎక్స్)లో స్త్రీలు, యువతులు, బాలికలను వేధింపులకు గురి చేయడం, అత్యాచారాలకు పాల్పడడం, హత్యలు చేయడం వంటి వార్తలు చదువుతుంటే రక్తం మరుగుతోందని పేర్కొంది. ప్రతి రెండు గంటలకు ఇలాంటి సంఘటనలు జరుగుతుంటే భయం వేస్తోందని తెలిపింది. ఇలాంటివి చాలా మంది ఎదుర్కొంటున్నారని చెప్పింది. మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంది. వ్యాయామం, ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తప్పుగా ప్రవర్తించే వారికి మీరు కొడతారనే భయం కలగాలని.. పిల్లలు చురుగ్గా ఉండడానికి తల్లిదండ్రులు వారికి ఆత్మరక్షణ విద్య నేర్పించాలని సూచించారు. మహిళలను ఆట వస్తువులా చూడరాదని మగ మృగాలకు తెలియజేయాలని నటి రిత్విక సింగ్ పేర్కొంది.

మా ముఖ్యమంత్రిని వదులుకోం



కటాక్షం చిత్రం ఆడియో ఆవిష్కరణ వేదికపై సినీ ప్రముఖులు

తమిళ సినిమా: మహిళ నిర్మాత శ్యామల రమేష్ నిర్మించిన చిత్రం కటాక్షం. పట్టుకోట్టై శివ దర్శకుడుగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో కార్తీక్ చరణ్, మహాన అనే నవ జంట హీరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు కె. భాగ్యరాజ్ కీలకపాత్రలో పోషించిన ఈ చిత్రానికి సంగీత దర్శకుడు చార్లీ సంగీతాన్ని అందించారు. కాగా నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో కె. భాగ్యరాజ్, ఆర్‌వీ ఉదయకుమార్, పేరరసు, జాగ్వర్ తంగం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కె. భాగ్యరాజ్ ఆడియోను ఆవిష్కరించగా పేరరసు, ఆర్‌వీ ఉదయ్ కుమార్ తదితరులు తొలి ప్రతిని అందుకున్నారు. సందర్భంగా ఆర్‌వీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఈ చిత్ర కథానాయకి తమిళ భాషలో చాలా చక్కగా మాట్లాడారని ప్రశంసించారు. నిర్మాత శ్యామల రమేష్ షూటింగ్ స్పాట్లో ఉదయం ఐదు గంటలకే అందరినీ నిద్రలేపి రెడీ చేయించడం అన్నది అభినందనీయం అన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ ప్రస్తుతం కర్ణాటకలో కొన్ని సంఘాలు చేస్తున్న ఆందోళన వివాదంగా మారుతుందని వాళ్లు మన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను దూషించడం సరికాదన్నారు. తమిళనాడులో అనేక పార్టీలు ఉండవచ్చునని భేదాభిప్రాయాలు ఉండవచ్చునని, అయితే మనం తమిళనాడు దాటితే మనం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఎవరేమన్నా సహించేది లేదని పేర్కొన్నారు. కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ చిన్న చిత్రాలు లేనిదే చిత్రపరిశ్రమ లేదని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి థియేటర్లోనూ చిన్నచిత్రాలను ఒక్క షో అయినా ప్రదర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్న బడ్జెట్లో చిత్రాలు చేయడానికి నిర్మాతలు రావద్దని ఎవరు అన్నారని, అలా అనే హక్కు వారికీ లేదని చిత్ర నిర్మాత రమేష్ పేర్కొన్నారు. తమ చిత్ర షూటింగ్ సమయంలో ఎందరో కళాకారులు, సాంకేతిక వర్గం జీవిస్తున్నారని తాను కళ్లారా చూశానని తమలాంటి చిన్న చిత్రాల నిర్మాతలు రాకపోతే అలాంటి వారికి జీవనోపాధి ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. తను వారి కోసం అయినా మరో చిత్రం చేస్తానని ఆయన అన్నారు.

కనిపిస్తే కోట్లు ఇవ్వాల్సిందే


నటి నయనతార

తమిళ సినిమా: ఇప్పుడు నయనతారను చూస్తుంటే ఆరంభంలో అవకాశాల కోసం బస్సులో కొచ్చి నుంచి చెన్నైకి వచ్చిన నటేనా అని ఆశ్చర్యం కలిగించకమానదు. కేరళా రాష్ట్రంలోని మారుమూల గ్రామం నుంచి వచ్చిన నయనతార ఇప్పుడు కోట్లకు పడగెత్తి చెన్నైలో అధునాతనమైన భవనంలో సుఖ జీవితాన్ని అనుభవిస్తున్నారు. అదీ లక్ అంటే. కెరీర్ మొదట్లో సినీ రంగంలో ఎన్నో అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్న నయనతార నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తరువాత కూడా వ్యక్తిగత జీవితంలో పలుమార్లు చేదు అనుభవాలను చవి చూశారు. కాలం అన్నింటినీ అధిగమిస్తుందంటారు. అలా తన జీవితం నేర్పిన గుణపాఠాలతో రాటుదేలిన నయనతార అవరోధాలు, అవమానాలకు అందనంత ఉన్నత స్థాయి ఎదిగిపోయారు. ఎంతగా అంటే దక్షిణాది చిత్ర పరిశ్రమలోనే అత్యధిక పారితోషికం డిమాండ్ చేసేంత స్థాయికి. ఈ లేడీ సూపర్ స్టార్ ఒక్కో చిత్రానికి రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్లు పుచ్చుకుంటున్నట్లు సమాచారం. ఇటీవలే జవాన్ చిత్రం ద్వారా బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చిన నయనతార ఈ చిత్రానికి ఐక్షరాలా రూ.10 కోట్లు పారితోషికం అందుకున్నట్లు సినీ వర్గాల భోగట్టా. కాగా స్టార్ హీరోయిన్ అంతస్తుకు చేరుకున్న తర్వాత కూడా వాణిజ్య ప్రకటనల్లో నటించడానికి దూరంగా ఉన్న నయనతార వివాహానంతరం ఆ ఆదాయానికి కూడా గేట్లు తెరిచేశారు. అందుకే అంటారు డబ్బెవరికి చేదు అని. ప్రస్తుతం నయనతార పలు వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్నారు. ఇటీవల ఒక 50 సెకన్ల వాణిజ్య ప్రకటనలో నటించడానికి రూ.5 కోట్లు తీసుకుంటున్నారట. ఇప్పుడు ఇదే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఆమె ఇప్పటి వరకు కూడబెట్టిన ఆస్తులు ఎంతో తెలుసా? రూ. 300 కోట్లకు పై చిలుకేనని సమాచారం. నయనతార నటన, చిత్ర నిర్మాణం వంటి వాటితో పాటు ఇతర రంగాల్లోనూ వ్యాపారాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆంధ్రా యువతి అదృశ్యం

తిరువళ్లూరు: ఆంధ్రా యువతి అదృశ్యంపై పెనాలూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. తిరువళ్లూరు జిల్లా పెనాలూరుపేట సమీపంలోని కల్‌కలోడ్డై గ్రామానికి చెందిన నాగస్ (50) వద్ద తిరుపతి జిల్లా నాగాలాపురం సమీపంలోని అడవికండ్రిగ గ్రామానికి చెందిన సమీప బంధువు కృష్ణయ్య కుమార్తె కోమల (20) ఆశ్రయం పొందుతోంది. సెప్టెంబర్ 27న తన సమీప బంధువు శుభ కార్యక్రమానికి హాజరైన కోమల అక్కడి నుండి అదృశ్యమైంది. కోమల ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేక పోవడంతో పెనాలూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో 14 ఏళ్ల జైలు

తిరువొత్తియూరు: తోటి కూలీని హత్య చేసిన కేసులో వ్యక్తికి 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. వివరాలు..కడలూరు జిల్లాకు చెందిన పరమశివం (39) చెన్నై తిరువేర్కాడు శివశంకరి వీధికి చెందిన వెంకటేష్ (45) కోయంబేడు మార్కెట్‌లో కూలి పనులు చేస్తున్నారు. గత ఏడాది వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వెంకటేష్, పరమ శివన్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. దీనిపై కోయంబేడు ఇన్‌స్పెక్టర్ రమేష్ కన్నా నేతృత్వంలో పోలీసులు కేసు నమోదు చేసి వెంకటేష్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై విడుదలైన వెంకటేష్ ఎగ్మోర్ కోర్టులో హాజరవుతున్నాడు. శుక్రవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో వెంకటేష్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ జరిమానా చెల్లించలేని ఎడల మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. వెంకటేష్‌ను పోలీసులు పుళల్ జైలుకు తరలించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఇంట్లో చోరీ

అన్నానగర్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారి ఇంట్లో చోరీ జరిగింది. మధురైకు చెందిన ప్రిన్స్ రిచర్డ్‌సన్ (34) బెంగళూరులోని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో అధికారిగా పని చేస్తున్నారు. పెరుంగుడిలోని ఆయన తల్లి కొద్ది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కొడుకును చూసేందుకు బెంగళూరు వెళ్లింది. శనివారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువలో ఉన్న 25 సవర్ల నగలు అదృశ్యమయ్యాయి. దీంతో రిచర్డ్‌సన్ అవనియాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

నగలు చోరీ.. మహిళ అరెస్టు

తిరువొత్తియూరు: అల్లుడి ఇంట్లో నగలు చోరీ చేసిన అత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. తూత్తుకుడి సమీపంలోని ఆంటోనీ అంతోనియార్‌పురానికి చెందిన మాడకన్ను భార్య సెల్వామణి (22). ఈమె మేనమామ సుబ్బయ్య నెల్లై జిల్లా నాంగునేరిలో నివాసం ఉంటున్నాడు. పళయంకులంలో పెరుమాళ్ ఆలయంలో జరిగిన కుంభాభిషేకంలో పాల్గొనడానికి సెల్వామణి వచ్చింది. తన 10 సవర్ల చైన్, 4 సవర్లు నెక్లెస్, 5 సవర్ల డాలర్‌తో కూడిన నగలను ఒక సంచిలో ఉంచింది. మరుసటి రోజు చూడగా సంచిలో ఉండాల్సిన 19.5 సవర్ల నగలు కనిపించలేదు. వాటి విలువ సుమారు రూ. 8 లక్షలు చేస్తుంది. దీనిపై సెల్వామణి మొడైప్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణలో సుబ్బయ్య భార్య ముత్తులక్ష్మి దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఆమెను పోలీసులు అరెస్టు చేసి 19.5 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మధురై జిల్లా తిరుమంగళం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన వీరమణికి భార్య జయలక్ష్మి (35), ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరమణి గత ఏడాది ఆత్మహత్య చేసుకున్నాడు. జయలక్ష్మి చేపల వ్యాపారం చేసేది. కూతురు నందిని (15) తిరుమంగళం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. మనస్తాపం చెందిన నందిని శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలిసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

తిరువొత్తియూరు: మద్యం మత్తులో గొడవ పడిన భర్తను కర్రతో కొట్టి చంపిన భార్యకు శివగంగై కోర్టు యావజ్జీవ ఖైదు శిక్ష విధించింది. శివగంగై సమీపంలోని సతరాసన్ కోటకు చెందిన రామచంద్రన్ (47)కు భార్య రాణి (44) ఉంది. మద్యానికి బానిసైన రామచంద్రన్ 2014 మే 10న మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. స్థానికులు వారికి నచ్చజెప్పారు. మరుసటి రోజు తెల్లవారుజామున 2 గంటలకు మరోసారి గొడవ జరిగింది. ఆగ్రహించిన రాణి అక్కడున్న కర్రతో తీవ్రంగా దాడి చేసింది. రామచంద్రన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివగంగై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి రాణిని అరెస్టు చేశారు. ఈ కేసు శివగంగై అదనపు సెషన్స్ కోర్టులో జరిగింది. శుక్రవారం కేసును విచారించిన న్యాయమూర్తి సత్యదార భర్తను హత్య చేసిన రాణికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని ఎడల 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.





వేలూరులోని టీటీడీ సమాచార కేంద్రంలో పుష్పాలంకరణలో స్వామి వారు, దర్శనానికి క్యూలో వేచివున్న భక్తజనం, ధరణి వరాహస్వామి

ఘనంగా పెరటాసి శనివారం పూజలు

సాక్షి, చెన్నై: పెరటాసి రెండో శనివారం సందర్భంగా రాష్ట్రంలోని పెరుమాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. తిరుచ్చి శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయం, రామనాథపురం రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, చెన్నై ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాల్ అమ్మవారి ఆలయంలో ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. తిరుమల శ్రీవారి ఆలయం నుంచి అమ్మవారికి ప్రత్యేకంగా సారెను తీసుకువచ్చి అధికారులు సమర్పించారు. తిరువొత్తియూరులోని కల్యాణ వరదరాజ స్వామి ఆలయంలో స్వామివారికి విశిష్ట పూజల అనంతరం 20 కేజీల లవంగాలతో ప్రత్యేక మాలలను తయారు చేసి అలంకరించారు.

వేలూరులో..

వేలూరు: తమిళ పురటాసి మాస రెండవ శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారి ఆలయాల్లో భక్తులు కిటకిట లాడారు. రెండవ శనివారం రోజున భక్తులు అధికసంఖ్యలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఉపవాసంతో మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడింది. వేలూరులోని తిరుమల తిరుపతి దేవస్థాన సమాచార మందిరంలో ఉదయం 5 గంటలకే స్వామి వారికి విశేష పూజలు చేసి వివిధ పుష్పాలతో అలంకరించారు. అదే విదంగా ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో బారులుదీరారు. అదే విధంగా వేలపాడిలోని వరదరాజ పెరుమాల్ ఆలయం, అరసంబట్టు పెరుమాల్ ఆలయం, బ్రహ్మపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. అదేవిధంగా వాలాజలోని శ్రీ దన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి డాక్టర్ మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీనివాస పెరుమాల్‌కు ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణలు చేశారు. వేలూరు జిల్లాతో పాటు తిరువణ్ణామలై జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి.

ధరణి వరాహస్వామి ఆలయంలో...

పళ్లిపట్టు: పెరటాసి శనివారం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో సందడి నెలకొంది. భక్తులు క్యూలలో వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. పెరటాసి నెల రెండవ శనివారం సందర్భంగా ఎగువ పొదటూరులోని ధరణి వరాహస్వామి ఆలయంలో వేకువజామున స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు చేపట్టి బంగారు ఆభరణాలతో అలంకరించి మహాదీపారాధన చేపట్టారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని భారీ క్యూలో వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. తిరుత్తణి బ్రహ్మణ్యస్వామి ఆలయానికి అనుసంధంగా ఉన్న ఎస్‌వీజీ.పురంలోని సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో పెరటాసిన రెండవ శనివారం వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. స్వామికి విశిష్ట అలంకరణ చేపట్టి పూజలు చేశారు.

హిజ్రాగా మారిన భార్య

• పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

సాక్షి, చెన్నై: అదృశ్యమైన తన భార్య తిరునంబీగా (హిజ్రా) మారి స్నేహితురాలితో సహజీవనం చేస్తుండడం ఓ భర్తకు షాక్‌గా మారింది. ఈ వ్యవహారంపై ఆ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం వివరాలు.. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపంలోని అర్ధనారీ పాళయానికి చెందిన 27 ఏళ్ల యువకుడికి ఏడు నెలల క్రితం సమీపంలోని మరో గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతితో వివాహం జరిగింది. ఓ మూడు నెలలు అత్తారింట్లో ఉన్నా గంటల తరబడి తన స్నేహితురాలైన యువతితో ఫోన్లో మాట్లాడుతూ ఉండేది. భర్తను దూరం పెట్టడమే కాకుండా, ఆమె నడవడిక మారడంతో కుటుంబ సభ్యులు అందరూ విస్మయం చెందారు. ఆ తర్వాత ఓ రోజున ఆమె అదృశ్యమైంది. తన భార్య కనిపించడం లేదంటూ ఆలియూరు పోలీసులను ఆ భర్త ఆశ్రయించాడు. పోలీసులు యువతి కోసం మూడు నెలలు తీవ్రంగానే గాలించారు. చివరకు విచారణలో ఆ యువతి తిరునంబీ (హిజ్రా)గా మారి చెన్నైలో తన స్నేహితురాలితో కలిసి భార్య, భర్తలుగా జీవనం సాగిస్తున్నట్లుగా గుర్తించారు. గత వారం రంగంలోకి దిగిన పోలీసులు హిజ్రాగా మారిన ఆ యువతిని, ఆమె స్నేహితురాలిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఇద్దర్నీ విడదీశారు. హిజ్రాగా మారిన తన భార్యను చూసిన ఆ భర్తకు షాక్ తప్పలేదు. హిజ్రాగా మారిన ఆ యువతిని ఆమె భర్తతో పోలీసులు పంపించేశారు. స్నేహితురాలిని చెన్నైకు వెళ్లమని ఆదేశించారు. ఇక్కడే అసలైన ట్విస్టు ఆ భర్తకు ఎదురైంది. హిజ్రాగా మారిన తన భార్య మూడు నెలల గర్భవతి అని తేలడంతో తలలు పట్టుకున్నారు. ఆ నోటా... ఈ నోటా పడి చివరకు గ్రామానికి ఈ సమాచారం తెలియడంతో శనివారం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇదే అదనుగా హిజ్రాగా మారిన ఆ యువతి, చెన్నైలోని తన స్నేహితురాలి వద్దకే మళ్లీ ఉడాయించడం గమనార్హం. దీంతో తన మానసిక పరిస్థితి ఏమిటో అంతు చిక్కక ఆ భర్త మళ్లీ పోలీసుల వద్దకు వచ్చి తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేయడం కొసమెరుపు.

నీటి తొట్టెలో మహిళ అనుమానాస్పద మృతి

తిరువొత్తియూరు: నీటి తొట్టెలో మునిగి మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సెలంలో జరిగింది. కలరంపట్టి నేతాజీ వీధికి చెందిన తమిళ్ సెల్వాన్ (30) కార్పెంటర్. ఇతని భార్య మహేశ్వరి (26). వీరికి మూడేళ్ల కుమారుడు, 20 రోజుల మగ, ఆడ కవలలు ఉన్నారు. ఇంటిలో తమిళ్ సెల్వాం తమ్ముడు రాజమాణిక్యం నేత పనిచేసేవాడు. తమిళ్ సెల్వాన్ నివాసం ఉంటున్న ఇంటిలోని పడక గదిలో అడుగు భాగంలో నీటి తొట్టె కట్టి ఇనుప రేకుతో మూత వేసి ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మహేశ్వరి బిడ్డతో సహా పడక గదికి వెళ్లి చాలా సమయం వరకు బయటకు రాకపోవడంతో తమిళ్ సెల్వాన్‌కు సందేహం కలిగింది. అదే సమయంలో బిడ్డ ఏడుపు వినిపించింది. తమిళ్ సెల్వాన్, రాజమాణిక్యం కిటికీలో చూశారు. లోపల బిడ్డ మాత్రమే ఉంది. మహేశ్వరి కనబడలేదు. వెంటనే తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా మహేశ్వరి నీటిలో మునిగి ఉంది. ఆమెను బయటకు తీసి సేలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మహేశ్వరి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై మహేశ్వరి తండ్రి గోవిందరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సహాయ పోలీస్ కమిషనర్ రామమూర్తి కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి విచారణ చేస్తున్నారు. అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆర్డీఓ విచారణకు సిఫార్సు చేశారు. ఆర్డీఓ సమక్షంలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో 10 వేల రోడ్లకు మరమ్మతులు

• మంత్రి నెహ్రూ

కొరుక్కుపేట: చెన్నైలో 10 వేల రోడ్ల మరమ్మతులకు టెండర్లు జారీ చేసినట్లు మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తండయార్‌పేటలోని కామరాజ్ నగర్‌లో అర్బన్ హెల్త్ స్కీమ్ కింద రూ. 2.90 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని మంత్రి కేఎన్ నెహ్రూ శనివారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చెన్నైలో డెంగీ నియంత్రణ, దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షపు నీటి తరలింపు పనులు త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. చెన్నైలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోందని అన్నారు. వర్షపు నీటి పారుదల పనులు వారంలో పూర్తవుతాయని తెలిపారు. చెన్నైలో 10,600 రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించి టెండర్లు ఆహ్వానించామన్నారు. నెమిలిలో సముద్రపు నీరు శుద్ధీకరణ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశామని.. 10 రోజుల్లో ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ ప్రారంభించనున్నారని తెలిపారు. చెన్నైలో నీటి సమస్య రానివ్వమని, చెంబరంబాక్కం సరస్సు పూర్తి స్థాయికి చేరుకుందన్నారు. తగినంత నీరు ఉందని.. నీటి కొరత ఉండదని చెప్పారు. మంత్రి పీకే శేఖర్ బాబు, మేయర్ ప్రియ, ఎంపీ కళానిధి వీరేస్వామి, ఎమ్మెల్యే ఆర్‌డీ శేఖర్, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

26 గంటల పాటు నిర్విరామంగా టాక్‌షో



బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 29వ తేదీ తిరుత్తణి బీఆర్‌టీ నర్సింగ్ కళాశాలలో 352 మంది విద్యార్థినులు, ఆధ్యాపకులు గుండె సంరక్షణపై అవగాహన టాక్ షో నిర్విరామంగా 26 గంటల పాటు నిర్వహించారు. తమిళం, తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విద్యార్థులు అవగాహన కల్పించారు. పరిశీలకులుగా రికార్డు క్రియేటర్ డాక్టర్ గోకుల్‌రాజ్ వ్యవహరించారు. టాక్ షో విజయవంతంగా పూర్తి చేయడంతో అబ్దుల్‌కలాం బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ప్రతినిధులు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపిక చేసి కళాశాల ప్రిన్సిపల్ పద్మావతికి శనివారం సర్టిఫికెట్ అందజేశారు.

పరిశోధనల్లో గుర్తింపు



గత నాలుగేళ్లలో వైద్య పరిశోధనలలో కొత్త బెంచ్ మార్కును సృష్టిస్తూ 102 పేటెంట్లను చెన్నైలో శ్రీ బాలాజీ వైద్య కళాశాల దక్కించుకుంది. దక్షిణ భారతదేశంలో తమకు దక్కిన గుర్తింపు వివరాలను శనివారం స్థానికంగా ఆ కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ జె. శ్రీనిష వెల్లడించారు. ఈ గుర్తింపు ధ్రువీకరణ పత్రాన్ని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ గుణశేఖరన్ చైర్‌పర్సన్‌కు అందజేశారు. 2024లో పరిశోధనలను విస్తృతం చేసి మరో 60 పేటెంట్లను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. – సాక్షి, చెన్నై

చెన్నై మ్యూజియంలో క్లీనింగ్ డ్రైవ్



చెత్తను సేకరిస్తున్న ఎన్‌ఎల్‌సీ ఉద్యోగులు

కొరుక్కుపేట: ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో చెన్నై ప్రభుత్వ మ్యూజియంలో క్లీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ నెల 15 నుంచి అక్టోబరు 2 వరకు ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా ప్రచారం కింద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చెన్నైలోని ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన ఉద్యోగులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను సేకరించి, వేరు చేసి ప్రభుత్వ మ్యూజియం బృందానికి అప్పగించారు. పీఆర్ అండ్ లైజనింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభు కిషోర్ పర్యవేక్షించారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

తిరువళ్లూరు: కోల్‌కత్తాకు లోడ్‌తో వెళ్తున్న లారీ డ్రైవర్‌కు గుమ్మిడిపూండి వద్ద గుండెపోటు రావడంతో మృతి చెందాడు. వివరాలు..తిరుచ్చి జిల్లా దురైయూర్ ప్రాంతానికి చెందిన రంగస్వామి(56). ఇతడు స్థానికంగా ఉన్న మారియమ్మన్ అండ్ కో సంస్థలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న తిరుచ్చి పల్లాడం నుంచి కోల్‌కత్తాకు లోడ్ లారీతో బయలుదేరాడు. శుక్రవారం రాత్రి తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలో రాగానే గుండెపోటుకు గురయ్యాడు. క్లీనర్ స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పొన్నేరి వైద్యశాలకు తరలించారు. గుమ్మిడిపూండి సిప్‌కాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

తిరువొత్తియూరు: చెన్నై నుంచి కారైకుడికి 20 మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు శనివారం ఉదయం బయలుదేరింది. పుదుకోట జిల్లా తిరుమయం, తామరై కన్మాయి వద్ద ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో లారీ బోల్తా పడింది. అదే సమయంలో బస్సు ఎదురుగా వస్తున్న జౌళి వ్యాపారి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. బైక్‌పై వచ్చిన మణికంఠన్ (41) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, ప్రజల సహాయంతో బస్సులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. తిరుమయం పోలీసులు విచారణ చేస్తున్నారు.

విజయవంతంగా చైతన్య ఫెస్ట్

కొరుక్కుపేట: గ్రూప్ డాన్సులు, గ్రూప్ సింగింగ్, కార్వింగ్ ఆర్ట్, హ్యాండ్ పెయింటింగ్‌లతో చైతన్య ఫెస్ట్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఇందులో వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలకు ట్రోఫీలను, సర్టిఫికెట్లను బహూకరించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల కళాలయ ఫైనాన్స్ అసోసియేషన్ ఐఏ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో చైతన్య 2023– 24 పేరిట చైతన్య మెగా ఇంటర్ – కాలేజియేట్ ఫెస్ట్ మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ పోటీలు శనివారం సాయంత్రంతో విజయవంతంగా ముగిశాయి.



వివిధ పోటీల్లో విజేతలతో న్యాయనిర్ణేతలు

ఎస్ఐ హత్య కేసులో యువకుడికి యావజ్జీవం

అన్నానగర్: మేకల దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించిన తిరుచ్చి సబ్ ఇన్‌స్పెక్టర్‌ను హత్య చేసిన కేసులో యువకుడికి జీవిత ఖైదు విధిస్తూ పుదుకోట్టై కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. తిరుచ్చి జిల్లా నవల్పట్టు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా భూమినాథన్ (52) పనిచేస్తున్నారు. 2021 నవంబర్ 20వ తేదీ రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్నారు. ఆయనతో పాటు హెడ్ కానిస్టేబుల్ చిత్రవేల్ ఉన్నారు. పూలంగుడి కాలనీ బస్ స్టాప్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో మేకల దొంగ తారసపడ్డారు. వారిని అడ్డుకునేందుకు భూమినాథన్, చిత్రవేల్ ప్రయత్నించగా బైక్ ఆపకుండా పారిపోయాడు. వెంబడించి విజయనగర్ రైల్వే బ్రిడ్జి దగ్గర పట్టుకున్నారు. భూమినాథన్‌పై కత్తితో దాడి చేసి నిందితుడు పారిపోయాడు. తంజావూరు జిల్లా థోకూర్‌కు చెందిన మణికంఠన్ (19)ని పోలీసులు అరెస్టు చేశారు. పుదుకోట్టై జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో శుక్రవారం తుది విచారణ ముగిసింది. నేరం రుజువు కావడంతో మణికంఠన్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయ ఆనంద్ తీర్పు వెలువరించారు.

కావేరి నీటి వివాదం.. నామ్ తమిళర్ పార్టీ ధర్నా



అన్నా రోడ్డులో ధర్నా చేస్తున్న నామ్ తమిళర్ పార్టీ నాయకులు

వేలూరు: తమిళనాడుకు కావేరి నీటి విడుదల విషయంలో కర్ణాటక ప్రభుత్వ తీరును నిరసిస్తూ నామ్ తమిళర్ పార్టీ ఆధ్వర్యంలో వేలూరు అన్నా రోడ్డులో ధర్నా చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమిళనాడుకు కావేరి నుంచి నీరు వచ్చేదని.. అయితే ప్రస్తుత కర్ణాటక ప్రభుత్వం నీరు ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు సుప్రీంకోర్టులో కేసులు వేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కూటమిలో ఉన్న డీఎంకే ప్రభుత్వం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో చేతులు కలిపి తమిళనాడును మోసం చేయాలని చూస్తోందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. త్వరలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఆర్గనైజర్ అబుబక్కర్, రీజినల్ ఆర్గనైజర్ హరిమా సెంథిల్‌నాథన్, మణిమారన్ పాల్గొన్నారు.

కావేరి నదిలో పంచలోహ కాళి విగ్రహం లభ్యం



లభ్యమైన పంచలోహ విగ్రహం

అన్నానగర్: తిరుచ్చి జిల్లా ముసిరి సమీపంలోని ఉమయాల్‌పురం కావేరి నదిలో శుక్రవారం సాయంత్రం చెల్లముత్తు (65) స్నానం చేస్తున్నాడు. అతని కాలికి ఏదో తగిలింది. వెంటనే దానిని నీటిలో నుంచి బయటకు తీశాడు. కాళీ మాత విగ్రహమని తేలింది. ఈ విషయాన్ని సేవాంతలింగపురం గ్రామ పరిపాలన అధికారి యమునకు తెలిపారు. ముసిరి తహసీల్దార్ ఫాతిమా సహాయరాజ్ విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తీసుకొచ్చారు. కాళీ విగ్రహం 22 సెంటీమీటర్ల పొడవు, 1.620 కిలోల బరువు ఉంది. శంఖం, చక్రం, కొడవలి, గద, ఖడ్గం, డాలు, విల్లు, తెగిన తల మొదలైన వాటిని ధరించి మెడలో కబాల మాల ధరించి 10 చేతులతో పీఠంపై నిలబడిన గోలంలో కాళీ విగ్రహం కనిపిస్తుంది. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి విగ్రహాన్ని పరిశీలించారు. తొలిదశ పరీక్షలో అది పంచలోహ విగ్రహమని తేలింది. ఆ తరువాత, కాళీ విగ్రహాన్ని భద్రంగా పెట్టెలో ఉంచి, తాళం వేసి ముసిరి సబ్‌డివిజన్‌లోని ఖజానాలో భద్రంగా ఉంచారు.

ఇద్దరు పిల్లలను కడతేర్చి తల్లి ఆత్మహత్యాయత్నం

అన్నానగర్: కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను విషం ఇచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. పిల్లలు మృతిచెందగా తల్లి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలోని మల్లాపురం గ్రామానికి చెందిన దామోదరన్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య భారతి (28). వీరికి కుమారుడు సంజయ్ (10), కుమార్తె మదియాళగి (8), మునీశ్వర్ (6 బాబు) ఉన్నారు. ఈ స్థితిలో దామోదర్ అంజలై(26)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి కవి రాజ్ అనే కుమారుడు ఉన్నాడు. దామోదరన్ ఇద్దరు భార్యలతో ఒకే ఇంట్లో ఉండేవాడు. రెండో పెళ్లి కారణంగా దామోదరన్, భారతి మధ్య గొడవలు జరిగాయి. సెప్టెంబర్ 25వ తేదీ రాత్రి మరోసారి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భారతి శీతల పానీయంలో విషం కలిపి సంజయ్, మదియాళగికి ఇచ్చింది. మునీశ్వర్‌కు శీతల పానీయం ఇవ్వలేదు. తరువాత భారతి కూడా తాగింది. తెల్లవారుజామున తేరుకుని జరిగిన విషయం భర్తకు చెప్పింది. ముగ్గురిని 108లో శంకరాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భారతిని విల్లుపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి, సంజయ్, మదియాలగిలను సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం పిల్లలు ఇద్దరూ మృతి చెందారు. భారతి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

76 మందితో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం ఏర్పాటు

- అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి(ప్రకాశం జిల్లా)ని నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో పార్టీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

జీపీఎస్‌పై చర్చకు సిద్ధం

- విద్యాశాఖ మంత్రి బొత్స



విజయనగరం అర్బన్: హామీ ఇచ్చిన ప్రకారమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా జీపీఎస్‌ను చట్టం చేసి అమలు చేస్తున్నామని, ఇందులో ఏవైనా అంశాలు మార్పు కావాలని కోరితే ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఓపీఎస్ అమలు వల్ల రాబోయే తరంలో ఆర్థికభారం పడుతుందని చెప్పారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద శనివారం పలు అంశాలపై వివరించారు. టీడీపీ, జనసేన ఇద్దరే కాదు.. మరో ఆరుగురు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. 'ఇప్పటివరకు టీడీపీ, జనసేన వేర్వేరు వాహనాల్లో వేర్వేరు ప్రాంతాల్లో తిరిగారు... ఇప్పుడు ఒకే వాహనంలో ఒకే ప్రాంతంలో తిరుగుతారు.. ఇందులో మేము భయపడడానికి కొత్తగా ఏముంది' అంటూ విలేకరులను ప్రశ్నించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లంచాలు మింగితే.. కంచాలు మోగించడం సిగ్గుచేటు

1,098వ రోజు దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: పేదోడి కంచాల్లోని బువ్వను అడ్డంగా దోచుకున్న దోపిడీ దొంగలు చంద్రబాబు, లోకేశ్ బినామీల కోసం కంచాల మోతలు, విజిల్స్ వేయడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 1,097వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ అధికారంలో ఉండగా నిలువుదోపిడీ చేసిన చంద్రబాబు వంటి దొంగలను కాపాడేందుకు రాష్ట్రంలో ప్రజలను రెచ్చగొట్టాలని చూసిన టీడీపీ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. రాజధాని పేరుతో ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌తో పాటు అసైన్డ్ భూముల కుంభకోణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలకు 54 వేల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే తప్పుడు కేసులు వేయించినందుకే బాబుకు పేదల ఉసురు తగిలిందనేది బహిరంగ సత్యమన్నారు. నమ్మి భూములిచ్చిన రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు మోసాలను గమనించిన రాజధాని రైతులు గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, మాదిగాని అన్నా సృజన, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శిగా దేబశ్రీ ముఖర్జీ

సాక్షి, అమరావతి: కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శిగా దేబశ్రీ ముఖర్జీని కేంద్రం నియమించింది. ప్రస్తుతం ఆ శాఖ కార్యదర్శిగా పనిచేస్తోన్న పంకజ్‌కుమార్ శనివారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆ శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తోన్న దేబశ్రీ ముఖర్జీకి కేంద్రం పదోన్నతి కల్పించి ఆ శాఖ కార్యదర్శిగా నియమించింది.

మరింత మంది రైతన్నలకు లబ్ధి

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో మరిన్ని మార్పులు

- ప్రస్తుతం ఒకే పంటకు కొన్ని చోట్ల దిగుబడి, మరికొన్ని చోట్ల వాతావరణం ఆధారంగా బీమా
- దీంతో ఒకేలా నష్టం వాటిల్లినా పరిహారంలో వ్యత్యాసంతో రైతులకు నష్టం
- ఇకపై నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా ఒకే రీతిలో బీమా రక్షణ
- ఖరీఫ్‌లో మిరప, పసుపు, జొన్న పంటలకు దిగుబడి ఆధారంగానే పరిహారం
- పత్తి, వేరుశనగ పంటలకు వాతావరణం ఆధారంగా పరిహారం
- దానిమ్మ, బత్తాయి, నిమ్మ, జీడిమామిడి పంటలకూ వాతావరణం ఆధారంగా బీమా
- కొత్తగా బీమా పరిధిలోకి ఆముదం పంట
- ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే వర్తింపు
- పంటలవారీగా నోటిఫికేషన్ జారీ



సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలకు అన్ని విధాలుగా అండదండలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో మరింత మంది రైతులకు మేలు చేకూర్చేలా మరిన్ని సంస్కరణలు తెచ్చారు. నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా ఒకే రీతిలో బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టారు. మరో వైపు కొన్ని జిల్లాల్లో పెరిగిన సాగు విస్తీర్ణాన్నిబట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తెచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాల్లో మార్పులు చేయడమే కాకుండా, ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే అమల్లోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులపై పైసా భారం పడకుండా ఈ క్రాప్‌లో నమోదే ప్రామాణికంగా నోటిఫై చేసిన పంటలకు యూనివర్సల్ బీమా కవరేజ్‌ను కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఒక సీజన్‌కు సంబంధించిన బీమా పరిహారాన్ని మరుసటి ఏడాది అదే సీజన్ ప్రారంభానికి ముందే చెల్లిస్తోంది. ఇలా 2019లో శ్రీకారం చుట్టిన ఈ పథకం ద్వారా గడిచిన 4 ఏళ్లలో 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్ల పరిహారం చెల్లించింది.

పరిహారం లెక్కింపులో పారదర్శకత కోసమే

సాధారణంగా ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్ కేటగిరీల్లో పంటలు సాగవుతుంటాయి. పూర్వం నుంచి ఇరిగేటెడ్ (నీటి వసతి కల్గిన) విభాగంలో సాగయ్యే పంటలను దిగుబడి ఆధారితంగా, నాన్ ఇరిగేటెడ్ (వర్షాధారం) కేటగిరిలో సాగయ్యే పంటలను వాతావరణ ఆధారితంగా పరిగణనలోకి తీసుకొని బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటలకు వాస్తవ, హామీ దిగుబడిలోని వ్యత్యాసాల ఆధారంగా, వాతావరణ ఆధారిత పంటలకు ప్రతికూల, సాధారణ వాతావరణ పరిస్థితుల్లోని వ్యత్యాసాలను బట్టి బీమా పరిహారం లెక్కిస్తారు. స్థానికంగా ఉండే నీటి వసతినిబట్టి కొన్ని జిల్లాల్లో ఒకే పంట రెండు కేటగిరిల్లోనూ సాగవుతుంటుంది. దీంతో ఒకే జిల్లాలో ఒకే పంటకు సాగయ్యే విధానాన్ని బట్టి రెండు విధాలుగా బీమా కవరేజ్ కల్పిస్తూ నోటిఫై చేయాల్సి వచ్చేది. ఫలితంగా పక్క పక్క సర్వే నంబర్లలో సాగయ్యే ఒకే పంటకు ఒకే పంట కాలంలో కొంత వాతావరణ, మరికొంత దిగుబడి ఆధారంగా లెక్కించి పరిహారం చెల్లించాల్సి వచ్చేది. ఫలితంగా జరిగిన పంట నష్టం ఒకటే అయినా, పరిహారంలో వ్యత్యాసాలు ఉండేవి.

ఉదాహరణకు నోటిఫైడ్ జిల్లాల్లో ప్రధానంగా పత్తి, వేరుశనగ పంటలు 95 శాతం విస్తీర్ణంలో వర్షాధారం, 5 శాతం నీటి వసతి కింద, మిరప 85 శాతం నీటి వసతి, 15 శాతం వర్షాధారం కింద సాగవడం వలన ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిలో పరిహారం ఉండేది. ఖరీఫ్‌లో నోటిఫై చేసిన పసుపు పంటకు కృష్ణా జిల్లాలో వాతావరణ ఆధారంగా, అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ జిల్లాల్లో దిగుబడి ఆధారంగా పరిగణించేవారు. ఇలా మిరప, పత్తి, పసుపు, జొన్న, వేరుశనగ వంటి పంటల విషయంలో పూర్వం నుంచి రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పరిహారం లెక్కింపు, పంపిణీలో అసమానతలు తొలగించడమే లక్ష్యంగా పంటల బీమా మార్గదర్శకాల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఇక నుంచి నోటిఫై చేసిన జిల్లాల్లో ఖరీఫ్‌లో మిరప, పసుపు జొన్న పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా పూర్తిగా దిగుబడి ఆధారంగానే పరిగణిస్తారు. పత్తి, వేరుశనగ పంటలను పూర్తిగా వాతావరణ ఆధారితంగా పరిగణిస్తారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో విస్తారంగా సాగవుతున్న ఆముదం పంటను కొత్తగా పంటల బీమా పరిధిలోకి తెచ్చారు. నోటిఫైడ్ జిల్లాల్లో దానిమ్మ, బత్తాయి, నిమ్మ, జీడిమామిడి పంటలను వాతావరణ ఆధారిత బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. నాటిన మూడో ఏడాది నుంచి దానిమ్మకు, నాలుగో ఏడాది నుంచి బత్తాయి పంటకు ఖరీఫ్‌లోనూ, మూడో ఏడాది నుంచి జీడిమామిడి, నాలుగో ఏడాది నుంచి నిమ్మ తోటలకు రబీలోనూ బీమా రక్షణ కల్పిస్తారు.

అసమానతలకు తావులేకుండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంటల బీమా లెక్కింపు, పరిహారం చెల్లింపుల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు పంటల బీమా మార్గదర్శకాల్లో కీలకమైన మార్పులు తీసుకొచ్చాం. నీటి వసతి, వర్షాధారం ప్రాతిపదికన కాకుండా ఇక నుంచి పూర్తిగా వాతావరణ, దిగుబడి ఆధారంగానే పంటలకు బీమా రక్షణ ఉంటుంది. నోటిఫై చేసిన జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలు నష్టపోయే రైతులకు ఒకే రీతిలో పరిహారం దక్కుతుంది. లెక్కింపులో, చెల్లింపుల్లో ఎలాంటి అసమానతలు ఉండవు.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

2023–24 సీజన్ కోసం నోటిఫికేషన్ జారీ

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక తొలి ఏడాది పీఎంఎఫ్‌బీవైతో కలిసి బీమా పథకం అమలు చేయగా, యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం విముఖత చూపడంతో ఆ తర్వాత రెండేళ్ల పాటు కంపెనీలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పరిహారం చెల్లించింది. ఈ క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం దిగి రావడంతో 2022–23 సీజన్ నుంచి దిగుబడి ఆధారిత పంటలకు పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. వాతావరణ ఆధారిత పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా బీమా రక్షణ కల్పిస్తోంది. 2023–24 సీజన్ కోసం దేశంలోనే అత్యల్ప ప్రీమియంతో బీమా కవరేజ్‌కు ముందుకొచ్చిన కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. జిల్లాలవారీగా కవరేజ్ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలతో ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. ఖరీఫ్–2023లో 15 పంటలకు దిగుబడి ఆధారంగా, 6 పంటలకు వాతావారణ ఆధారంగా, రబీ 2023–24లో 13 పంటలకు దిగుబడి ఆధారంగా, 4 పంటలకు వాతావరణ ఆధారంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుబడి ఆధారిత పంటలకు ఖరీఫ్‌లో గ్రామం, మండల, జిల్లా యూనిట్‌గా బీమా కవరేజ్ కల్పిస్తుండగా, వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం మండలం యూనిట్‌గా బీమా కవరేజ్ కల్పిస్తున్నారు.

డ్రైవర్ల విజయోత్సవం

- సీఎం జగన్‌కు కృతజ్ఞతగా గొల్లపూడిలో ఆటోలతో ర్యాలీ



వాహనమిత్ర ఐదో విడత సాయం అందించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెబుతూ గొల్లపూడిలో ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో శనివారం విజయోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు వరుసగా ఐదోసారి ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతాపూర్వకంగా ర్యాలీ నిర్వహించారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని వన్ సెంటర్, సాయిపురం కాలనీ, పంచాయతీ కార్యాలయం, పటమట బజార్ వంటి ముఖ్యకూడళ్ల మీదుగా ఆటోల ర్యాలీ సాగింది. దాదాపు 250 ఆటోలలో వచ్చిన ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కొనియాడుతూ పాడిన పాటలతో ఆయా కూడళ్లు మార్మోగాయి. 'సంక్షేమ సారథి జగనన్న.. మళ్లీ మీరే ముఖ్యమంత్రిగా రావాలి' అంటూ డ్రైవరన్నలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

దేశంలో మరెక్కడా లేనివిధంగా..

దేశంలో మరెక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే తమకు ఏటా ఆర్థిక సహాయం అందించారని డ్రైవరన్నలు కొనియాడారు. సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాటినుంచి ఇప్పటివరకు ఒకొక్కరికి రూ.50 వేల చొప్పున లబ్ధి చేకూరిందన్నారు. నవరత్నాల పేరిట అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో ఒక్కొక్కరికీ రూ.లక్షల లబ్ధి చేకూరిందని, సీఎం జగన్ తమ కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ర్యాలీలో ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, గంగవరపు శివాజీ, ధూళిపాళ చిన్ని, కోమటి రామమోహన్‌రావు, సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు కష్టాలుండవిక

- ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్ల నిర్మాణం చేపట్టిన ఏపీ మారిటైమ్ బోర్డు
- భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువు, దొండవాక, ఉప్పలంకల్లో నిర్మాణం
- ప్రస్తుతం ఈ రేవుల దగ్గర 1,732 బోట్లు



ఫిష్ ల్యాండింగ్ సెంటర్	ప్రస్తుత బోట్ల సంఖ్య
భీమిలి – విశాఖ జిల్లా	149
రాజయ్యపేట – అనకాపల్లి జిల్లా	249
దొండవాక – అనకాపల్లి జిల్లా	390
చింతపల్లి – విజయనగరం జిల్లా	382
రాయదరువు – తిరుపతి జిల్లా	347
ఉప్పలంక – కాకినాడ జిల్లా	215

సాక్షి, అమరావతి: సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల కష్టాలను తీర్చడానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మత్స్యకారుల కోసం రాష్ట్రంలో ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్ల నిర్మాణానికి ఏపీ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ) చర్యలు చేపట్టింది. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ.3,500 కోట్లతో మినీ ఓడరేవులను తలపించేలా ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం .. తాజాగా మత్స్యకారులు వారి బోట్లను సురక్షితంగా నిలుపుకొని చేపలను ఒడ్డుకు చేర్చుకునేలా ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి రాష్ట్ర మత్స్య శాఖ ఏపీ మారిటైమ్ బోర్డుకు బాధ్యతలు అప్పగించింది. విశాఖపట్నం జిల్లా భీమిలి, అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, దొండవాక, విజయనగరం జిల్లా చింతపల్లి, తిరుపతి జిల్లా రాయదరువు, కాకినాడ జిల్లా ఉప్పలంకల్లో ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లోని మత్స్యకారులు తమ పడవలను బీచ్‌ల్లోనే నిలుపుకొని చేపలను ఒడ్డుకు చేర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తుపాన్లువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పడవలు, వలలు కొట్టుకుపోయి పేద మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పడవలను నిలుపుకొనేందుకు ఒక జెట్టీ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి చేపలను సురక్షితంగా మార్కెట్‌కు తరలించుకునేలా వీటిలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఫిషింగ్ హార్బర్లలో భారీ మెకనైజ్‌డ్ బోట్ల కోసం బ్రేక్ వాటర్ వంటివి ఉండాలని, కానీ ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లలో స్థానిక మత్స్యకారులు చిన్న నాటు పడవలు, మెకనైజ్డ్ బోట్లను నిలుపుకొనేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటుకు పర్యావరణ, కోస్టల్ రెగ్యులేషన్ జోన్, ఏపీ కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీల నుంచి అనుమతులు పొందడానికి కన్సల్టెన్సీ ఎంపికకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ఆరు ప్రాంతాల్లో ఎంతమంది మత్స్యకారులు ఉన్నారు, సముద్రపు ఒడ్డున ఎన్ని పడవలు నిలుపుతున్నారన్న అంశాలపై అధ్యయనం చేశామని, దీనికి అనుగుణంగా ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటర్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ ఆరు చోట్ల 1,732 బోట్లు నిలుపుతున్నారని, ఇంతకంటే ఎక్కువ సంఖ్యలో బోట్లను నిలిపేలా వీటిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం వీరంతా అనధికారికంగా చేపల వేట చేపడుతుండటంతో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని, ఫిష్ ల్యాండింగ్ సెంటర్స్ ఏర్పాటయితే ఈ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.

ఐబీ సిలబస్ అమలుపై అధ్యయనం

ఢిల్లీలోని ఎస్‌కేవీని సందర్శించిన ప్రవీణ్ ప్రకాశ్ బృందం



వెస్ట్ వినోద్‌నగర్‌లోని సర్వోదయ కన్య విద్యాలయ (ఎస్‌కేవీ) లోని చిన్నారులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం మొదలైంది. ఇప్పటికే గుంటూరు, విజయవాడల్లోని ఐబీ స్కూళ్లలో సిలబస్ అమలును పాఠశాల విద్యా శాఖ పరిశీలించింది. అయితే, ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియెట్ సిలబస్ రెండేళ్లుగా అమలవుతోంది. ఈ క్రమంలో శనివారం పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ నేతృత్వంలోని బృందం అక్కడి పాఠశాలలను పరిశీలించింది. ఐబీ సిలబస్ బోధిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ, నైపుణ్యాలు, విద్యార్థులకు బోధిస్తున్న విధానంపై అధ్యయనం చేసింది. ఏపీలో ఐబీ సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు ఉపాధ్యాయుల శిక్షణ, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ఆవశ్యకతను అర్థం చేసుకునేందుకు, విధివిధానాలను తెలుసుకునేందుకు ఢిల్లీ వెస్ట్ వినోద్‌నగర్‌లోని సర్వోదయ కన్య విద్యాలయ (ఎస్‌కేవీ)ను వీరు సందర్శించారు. ఒకటి, మూడు, ఐదో తరగతి విద్యార్థులతో మమేకమై వివిధ అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలు, ఐబీ సిలబస్ అమలుపై పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ప్రభుత్వం ఇటీవల స్టీరింగ్ కమిటీని నియమించిన నేపథ్యంలో ఆ కమిటీ ఢిల్లీ స్కూళ్లను పరిశీలించింది.

ఏయూలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం

ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య ప్రసాదరెడ్డి



పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రానున్న ఐదేళ్లలో ఆంధ్ర యూనివర్సిటీలో ఐటీ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమాన్ని బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ విద్యాలయంలో లేని విధంగా మొదటి సంవత్సరంలో ఇండస్ట్రియల్ 4.0 టెక్నాలజీ పాఠ్యాంశాన్ని చేర్చిన ఘనత ఏయూకు దక్కుతుందన్నారు. విద్యను ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే విధంగా నేర్చుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణల దిశగా విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'మీ అండ్ మై ప్లాంట్' కార్యక్రమాన్ని రూపొందించామని, ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని పరిరక్షించాల్సి ఉంటుందన్నారు. దీనికి ప్రత్యేకంగా మార్కులు కేటాయిస్తామన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శోభశ్రీ రావు, మహిళ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భట్టి, లా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

• తెలంగాణ

నేడు హైదరాబాద్‌కు ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం హైదరాబాద్ రానున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రధానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వాగతం పలకనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి ప్రధాని చేరుకుంటారు.

2ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌కు పేటెంట్ హక్కులు

- మెషీన్ రూపొందించిన విద్యార్థి మర్రిపల్లి అభిషేక్
- విద్యార్థి తండ్రికి పత్రాలు అందజేసిన సిరిసిల్ల కలెక్టర్

సిరిసిల్ల ఎడ్యుకేషన్/వేములవాడ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం బస్తాల్లో నింపే సమయంలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిన ఓ విద్యార్థి తయారు చేసిన ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్‌కు పేటెంట్ హక్కులు దక్కాయి. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన విద్యార్థి మర్రిపల్లి అభిషేక్ 2019లో 8వ తరగతి చదువుతుండగా ఇన్‌స్పైర్ మానక్‌లో భాగంగా ప్యాడీ ఫిల్లింగ్ మెషీన్ తయారు చేశాడు. ఇది జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. దీనిని వివిధ స్థాయిలలో పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఇన్నాళ్లకు పేటెంట్ హక్కులు కల్పించింది. ఈ పేటెంట్ హక్కులు విద్యార్థి తండ్రి లక్ష్మీరాజం పేరిట వచ్చేలా పత్రాలు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం పంపిన పేటెంట్ హక్కుపత్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం వారికి అందించారు. ఒక విద్యార్థికి పేటెంట్ హక్కులు దక్కడం తెలంగాణలో ఇదే తొలిసారి కావడం విశేషం. అభిషేక్‌ను డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, స్కూల్ హెచ్‌ఎం శ్రీకాంత్‌రావు, గైడ్ టీచర్ కోరెం వెంకటేశం అభినందించారు.

బాబు, లోకేశ్, బాలకృష్ణ సైకోలే : ఎమ్మెల్సీ పోతుల



సాక్షి, అమరావతి/ఒంగోలు టౌన్: 'చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసి స్టే తెచ్చుకొని ఇంతకాలం బతికారు. చంద్రబాబు, లోకేశ్ పాపం పండింది. అందుకే అనుభవిస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే.. వెన్నుపోటుతో చంద్రబాబు ఆ పార్టీని లాక్కుని.. తెలుగు దొంగల పార్టీగా మార్చేశారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ చావుకు చంద్రబాబు కారణమై ఎంతో మంది నాయకుల జీవితాలను నాశనం చేశారన్నారు. దుర్మార్గం చేసిన వారు ఎవరైనా జీవిత చరమాంకంలో ఇలాంటి శిక్ష అనుభవించక తప్పదన్నారు. సొంత తమ్ముడు, బంధువులు, స్నేహితులు, ఎన్టీఆర్ అభిమానులను చంద్రబాబు మోసం చేశారని.. వారి ఉసురు తగిలి జైలుకెళ్లారని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ 6 నెలలుగా రోడ్లపైకి వచ్చి ధైర్యం ఉంటే తమను అరెస్ట్ చేసి జైలులో పెట్టు అన్నారని.. తథాస్తు దేవతలు ఆశీర్వదించడంతో ముందుగా చంద్రబాబు రాజమండ్రి జైలులో పడ్డారన్నారు. ఇప్పుడు లోకేశ్ వంతు రాగా సీఐడీ నోటీసులు ఇచ్చిందని.. ఆ తరువాత ఏం జరుగుతుందో అందరూ చూస్తారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఎవరిపైనా కక్ష లేదని.. కక్ష సాధింపే అయితే సీఎం అయిన ఏడాదిలోనే వారిని జైలుకు పంపించేవారని అన్నారు.

లోకేశ్ జైలుకెళ్లాక మోగించుకో!

మోత మోగిద్దాం కార్యక్రమాన్ని లోకేశ్ అరెస్టయి జైలుకెళ్లాక చేసుకుంటే మంచిదని పోతుల సునీత ఎద్దేవా చేశారు. ఒంగోలు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. లోకేశ్ ఏ తప్పూ చేయకపోతే ఢిల్లీలో ఎందుకు తలదాచుకున్నాడో చెప్పాలని నారా బ్రాహ్మణిని నిలదీశారు. రెండెకరాల చంద్రబాబు రూ.20 వేల కోట్ల హెరిటేజ్‌ని ఎలా నిర్మించాడని ప్రశ్నించారు. ఇన్నర్ రింగ్ రోడ్, అమరావతిలో భవనాలు, పోలవరం ప్రాజెక్ట్, స్కిల్ కుంభకోణం ద్వారా రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడి నిప్పు అని చెప్పుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బ్రాహ్మణి మామ చంద్రబాబు, అత్త భువనేశ్వరి, తండ్రి బాలకృష్ణలేఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి హత్య చేశారన్నారు. ఆ ముగ్గురితో క్షమాపణలు చెప్పించిన తర్వాతే బ్రాహ్మణి ప్రజల ముందుకు రావాలన్నారు.

బండారుపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

రాష్ట్ర మంత్రి ఆర్కే రోజాపై మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఏపీ మహిళా కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఫిర్యాదు చేసింది. మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, పలువురు మహిళా నాయకులతో కలిసి శనివారం మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లి కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ఫిర్యాదు అందజేశారు.

టీడీపీ నేత పట్టాభికి కోర్టు చీవాట్లు


- 41ఏ నోటీసులు తీసుకుని సమాధానం ఇవ్వాలని ఆదేశం



తణుకు పోలీస్‌స్టేషన్ వద్ద పట్టాభి

తణుకు: టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాంకు పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణ పోలీసులు శనివారం 41(ఎ) నోటీసులిచ్చారు. న్యాయస్థానం చీవాట్లు పెట్టడంతో పట్టాభి ఎట్టకేలకు తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయనకు నోటీసులు అందజేసిన పోలీసులు సుమారు మూడు గంటల పాటు స్టేషన్‌లోనే విచారించారు. ఈ ఏడాది మే ఆరో తేదీన టీవీ–5 చానెల్‌లో డిబేట్‌లో పాల్గొన్న పట్టాభిరాం.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్రకుమార్ మే 8న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 153, 153(ఎ), 505(2), 504, 120(బి) రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద అప్పటి పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పట్టాభిరాం ఎ–1 కాగా, యాంకర్ మూర్తి ఎ–2, టీవీ–5 యాజమాన్యం ఎ–3గా ఉన్నారు. అప్పట్లో ఎ–1 పట్టాభిరామ్‌కు 41(ఎ) నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించినా స్పందించకపోగా తనను పోలీసులు వేధిస్తున్నారని పేర్కొంటూ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తణుకు పోలీసులు స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నోటీసులు తీసుకోకపోవడంతో పాటు సరైన సమాధానం ఇవ్వకపోవడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ తక్షణమే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నోటీసులు తీసుకుని సమాధానం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో శనివారం తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పట్టాభిరాంకు పోలీసులు నోటీసులు అందించారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి రూరల్ సీఐ మూర్తి నేతృత్వంలో తణుకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాస్ నోటీసులిచ్చి వాంగ్మూలం తీసుకున్నారు.

50 గోల్డెన్ బాబీ



50 ఏళ్లు పూర్తి చేసుకున్న బాలీవుడ్ బంపర్ హిట్ చిత్రం బాబీ (1973) కి సంబంధించిన జ్ఞాపకాలు, తెలిసిన విషయాలు, తెలియని విషయాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. బాగా ఇష్టపడి చేసిన సినిమా పరాజయం పాలైతే లేచి నిల్చోవడానికి, అడుగులు వేయడానికి, పరుగులు తీయడానికి శక్తి కావాలి. ఆ శక్తి రావాలంటే 'ఎలాగైనా హిట్టు కొడతాను' అనే కసి ఉండాలి. 'మేరా నామ్ జోకర్' సినిమాతో పరాజయం, అప్పుల పాలైన రాజ్ కపూర్‌లో ఆ కసి దండిగా ఉంది. కసి సంగతి సరే, ఇప్పుడొక సూపర్‌స్టారుడు కావాలి కదా. అప్పుల పాలైన తనతో సినిమా చేయడానికి ఎవరు ధైర్యం చేస్తారు? 'ఇక అంతా అయిపోయింది. మిగిలింది ఏమీలేదు' అనుకున్నప్పుడు ఎక్కడ లేని ధైర్యం వస్తుందట. ఆ ధైర్యంతోనే కుమారుడిని హీరోగా పెట్టి 'బాబీ' తీసి తిరుగులేని విజయాన్ని అందుకున్నాడు రాజ్ కపూర్. ఆర్‌కే స్టూడియోస్‌కు ఇది మకుటాయమాన చిత్రం అయింది. రిషి కపూర్, డింపుల్ కపాడియాలను ఎక్కడికో తీసుకెళ్లింది. 'బాబీ' గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే...కమర్షియల్ రోమాంటిక్ ఫిల్మ్ 'ఫార్మట్'ను సెట్ చేసింది. మినీ–స్కర్ట్స్, హాట్ ప్యాంట్స్, లెదర్ ఔట్‌ఫిట్స్, వోవర్ సైజ్‌డ్ గ్లాసెస్, పోల్కా–డాటెడ్ నాటెడ్ టాప్స్ మన దేశంలోని ఫ్యాషన్ ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్స్‌ను మోసుకొచ్చాయి.

వైరల్

ఈ స్టూడెంట్ వయసు జస్ట్... 92



'చదువుకు వయసుతో పనేమిటి' అనేది పాత డైలాగే కావచ్చు గానీ 92 సంవత్సరాల సలీమాఖాన్‌కు మాత్రం ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం, నేర్చుకోవడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే బామ్మను 92 ఏళ్ల వయసులోనూ బడి బాట పట్టించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులందర్‌షహర్‌కు చెందిన సలీమాకు బడి సౌకర్యం లేకపోవడం, రకరకాల పరిస్థితుల వల్ల చదువుకునే అవకాశం దొరకలేదు.

ఆరు నెలల క్రితం బడిలో చేరిన సలీమా పిల్లలతో పాటు క్లాస్‌రూమ్‌లో కూర్చునేది. చదవడం, రాయడం నేర్చుకుంది. 'నేను కూడా చదవగలుగుతున్నాను. రాయగలుగుతున్నాను అనే సంతోషాన్ని చెప్పడానికి మాటలు లేవు' అంటుంది సలీమాఖాన్. 'మొదట్లో ఆమెకు చదువు చెప్పడానికి టీచర్‌లు తటపటాయించారు. అయితే ఆమెను వద్దనడానికి మా దగ్గర ఏ కారణం కనిపించలేదు. ఆమె పట్టుదల చూసి టీచర్‌లకు ఉత్సాహం వచ్చింది. అక్షరాస్యురాలిని కావాలి అనే ఆమె పట్టుదల టీచర్‌లకు నచ్చింది' అంటుంది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ శర్మ.

బంగారంలాంటి కూతురు



దివ్యాకృతి సింగ్, అనూష్, హృదయ్, సుదీప్తిలతో కూడిన ఇండియన్ టీమ్ ఈక్వెస్ట్రియన్ డ్రెస్సెజ్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకొని చరిత్ర సృష్టించింది. ఈ బృందంలో ఒకరైన దివ్యాకృతిసింగ్‌కు తండ్రి విక్రమ్ రాథోడ్ అన్నిరకాలుగా అండగా నిలిచాడు. ఆమె ట్రైనింగ్ కోసం ఇంటిని కూడా అమ్మాడు. ఈ విషయాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఢిల్లీలోని జీసస్ అండ్ మేరీ కాలేజీలో చదువుకునే రోజుల్లో పోటీ పడేందుకు గుర్రం లేకపోవడంతో రెండు సంవత్సరాలు పోటీకి దూరంగా ఉంది దివ్యాకృతి. ఆసియా క్రీడల్లో పాల్గొనాలనే కూతురు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని జర్మనీలో గుర్రాన్ని కొన్నాడు. గుర్రం కొనడం నుంచి స్పాన్సరర్‌ల చుట్టూ కాళ్లరిగేలా తిరగడం వరకు విక్రమ్ రాథోడ్ పడని కష్టం లేదు. ఏమైతేనేం, ఆయన శ్రమ ఫలించింది. కుమార్తె బంగారు కల నెరవేరింది.

కళ్లు మూసుకొని... కళ్లు చెదిరే విజయం



ఎన్నో అద్భుత విజయాలు సాధించిన విజేతల అద్భుత విజయాలను డాక్యుమెంటరీలలో చూసిన తరువాత తాను కూడా ఏదైనా సాధించాలనుకుంది మలేసియాకు చెందిన పది సంవత్సరాల పునీత మలర్ రాజశేఖర్. ఈ చిన్నారికి చెస్ అంటే ఇష్టం. తాజాగా... కళ్లకు గంతలు కట్టుకొని కేవలం 45.72 సెకన్‌లలో చెస్‌బోర్డ్‌పై అత్యంత వేగంగా 32 పావులను సెట్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. తండ్రి సహకారంతో నాలుగు నెలల పాటు కష్టపడి ఈ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.

ఏనుగమ్మ ఏనుగు... ఏడికీ పోనియ్యదు ఏనుగు



ఒక ఏనుగుకు, దాని సంరక్షకుడు (కేర్‌టేకర్)కి మధ్య ఉండే అందమైన అనుబంధానికి అద్దం పట్టే వీడియో వైరల్ అయింది. ఏనుగు సంరక్షకుడు ఏదో పనుండి పక్క ఊరు వెళ్లడానికి స్కూటీపై కూర్చోవడానికి రెడీ అవుతుంటే 'నువ్వు ఎల్లడానికి ఈల్లేదంతే' అన్నట్లుగా అడ్డుకుంది ఏనుగు. తొండంతో చుట్టేసింది. 'నన్నొదలవే బాబూ... ఇట్ల బోయి అట్లొస్తా' అని కేర్‌టేకరుడు లబోదిబో అంటున్నా ఏనుగు మారం చేయడం మాత్రం ఆపలేదు. అతడు స్కూటీ ఎక్కాడో లేదో తెలియదు గానీ రైల్వే అధికారి అనంత్ రూపన్‌గూడి ట్విటర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో నవ్వుల పువ్వుల పూయిస్తోంది. 'అనుబంధాలు మనుషులకు మాత్రమే పరిమితమైనవి కావు' అని మరోసారి గుర్తు చేసే వీడియో' అంటూ నెటిజనులు స్పందించారు.

నిదుర పోరా తమ్ముడా

జనరల్ కంపార్ట్‌మెంట్‌లో సీటు దొరకదు.
నిదురపోయే చోటు అసలు దొరకదు.
కాయకష్టం చేసి బండెక్కిన
బీదసాదలు నిదురకు ఆగగలరా?
ఏదో ఒక ప్లాన్ చేస్తారు.
రైల్లో ఒక కుర్రవాడు చేసుకున్న ఏర్పాటు
పోయిన్నెల నుంచి ఈ నెల వరకు
పది లక్షల లైకులు పొంది ఇంకా వైరల్‌గానే ఉంది.
ఎందుకంటే జనరల్ తిప్పలు
అందరికీ తెలిసినవే కదా.



'నిదుర పోరా తమ్ముడా' అని పాడింది లతా మంగేష్కర్.

'కునుకు పడితే మనసు కాస్త కుదుట పడతది' అన్నాడు ఆత్రేయ.

'నిదర ముదర పోయాక పాడె వొక్కటే వల్లకాడు ఒక్కటే' అన్నాడు జాలాది.

నిజమే. నిద్ర పట్టాక, గాఢంగా నిద్ర కమ్ముకున్నాక మనం ఎక్కడ పడుకున్నామో ఎక్కడ తెలుస్తుంది? అందుకే నిద్ర సుఖమెరగదు అన్నారు పెద్దలు.

అదేం ఖర్మోగాని రైలెక్కితే నిద్ర పోవాలనిపిస్తుంది. బెర్తులున్నవారు చక్కా తొమ్మిది దాటగానే దుప్పట్లు పరుచుకుని, కప్పుకుని గుర్రుపెడతారు. మరి జనరల్‌లో ఉన్నవారో?

పుష్పక విమానంలో ఎంతమంది ఎక్కినా మరొకరికి చోటుంటుంది. మన రైల్వే వారు జనరల్ కంపార్ట్‌మెంట్‌కు ఇదే సూత్రం అప్లై చేస్తారు. ఎంతమందెక్కినా ఏదో ఒక మూల కూలబడతారని టికెట్లు తెగ ఇస్తారు. ఎక్కాక బాత్‌రూమ్‌కు వెళ్లడానికి కూడా వీల్లేని తాకిడి.

జనరల్‌లో ఎవరెక్కుతారు? బీదసాదలు. కాయకష్టం చేసి సొంత ఊరికో, ఏదో కొంపలంటుకు పోయే వర్తమానం అందినందుకో అప్పటికప్పుడు టికెట్ కొనుక్కుని ఎక్కుతారు. లేకపోయినా ఎక్కుతారు. నిద్రకు టికెట్‌తో పని లేదు. కిటికీల్లో నుంచి చల్లగాలి తగులుతుంటే, వెళ్లే రైలు ఊయల వలే ఊగుతుంటే ఎలాగైనా చోటు చూసుకుని పడుకో అంటుంది.

రెండు బెర్తుల మధ్య కింద పడుకునేవారు ఎప్పుడూ కనపడతారు. లగేజ్ స్టాండ్ ఎక్కి నిద్ర పోయేవారు కూడా మన దేశంలో విరివిగా విస్తృతంగా ఉన్నారు. అయితే ఈ కుర్రవాడు మాత్రం అసాధ్యుడు. పైన ఉన్న రెండు బెర్తులకు దుప్పటి కట్టి ఒక బెర్తు సృష్టించాడు. ఆ తర్వాత దానిలోకి జారి ఒళ్లెరగని నిద్ర పోయాడు.

హాతిమ్ ఇస్మాయిల్ అనే కేరళ ట్రావెలర్ ఈ వీడియో తీసి పోయిన నెల ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే ఇప్పటికి 10 లక్షల లైక్స్ వచ్చాయి. అంత మంచి సెటప్ చేసుకుని నిద్రపోతున్నవాణ్ణి చూసి కొందరు కుళ్లుకున్నారు. కొందరు దుప్పటి నాణ్యతను శ్లాఘించారు. మరికొందరు ఇకపైన స్లీపర్ బుక్ చేసుకోకుండా ఇదే ఫార్ములా వాడుతానని అన్నారు. ఆగ్రా రైలు ఇలాగే ఉంటుందని మరొకరు అన్నారు.

ఈ మధ్య జనరల్ కంపార్ట్‌మెంట్‌లు పెరగాలనే డిమాండ్ వినిపిస్తోంది. జనరల్ కంపార్ట్‌మెంట్‌లు ఎందుకు తక్కువ ఉంటాయో రైల్వేవారు ఎప్పుడూ చెప్పరు. ప్రభుత్వాలకు ఓట్లు కావాలి. వారి మాటలకు పగటి కలలు చూసే జనం బోగీల్లో ఇలాంటి నిద్రకే ఉపక్రమించాలి.

సినిమా

కన్నప్పలో మోహన్‌లాల్


● విష్ణు, మోహన్‌లాల్

మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తూ, నిర్మిస్తున్న మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రలో ప్రభాస్ నటించనున్న విషయం తెలిసిందే. మరో కీలక పాత్రలో మోహన్‌లాల్ నటించనున్నట్లు శనివారం యూనిట్ ప్రకటించింది. పరుచూరి గోపాలకృష్ణ, విజయేంద్ర ప్రసాద్, తోటపల్లి సాయినాథ్, తోట ప్రసాద్, నాగేశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి ఈ సినిమాకు అద్భుతమైన స్క్రిప్ట్‌ను అందించారని విష్ణు ఇటీవల పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది.

ఈ ఏడాది నా జీవితం పరిపూర్ణమైంది

- రచయిత చంద్రబోస్

''ఈ వేదికపై (శిల్ప కళా వేదిక) జరిగిన వందల ఆడియో ఫంక్షన్స్‌లకు వచ్చాను. నా పాటలు కూడా ఆవిష్కరించబడ్డాయి. కానీ ఆ ఫంక్షన్స్‌లో హీరోలను చూసేందుకు ప్రేక్షకులు వచ్చేవారు. కానీ ఈ రోజు ఇక్కడ పాట హీరో.. సంగీతం హీరో.. సాహిత్యం హీరో. 'తాజ్‌మహల్' సినిమాతో నన్ను రామానాయుడుగారు పరిచయం చేశారు. 1995లో మొదలైన నా ప్రయాణం 2023 వరకూ.. 28 సంవత్సరాలు.. 860కి పైగా సినిమాలు.. 3600లకు పైగా పాటలు రాశాను. ఈ ఏడాది నాకు, నా జీవితానికి, నా సాహిత్యానికి పరిపూర్ణతను తీసుకొచ్చింది. ఈ ఏడాది నాపై పురస్కారాల వర్షం కురిసింది. ఫిబ్రవరిలో గోల్డెన్‌గ్లోబ్ అవార్డు, హాలీవుడ్ క్రిటిక్స్ చాయిస్, క్రిటిక్స్ అవార్డు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్, బాంబే హంగామా అవార్డు, ఉత్తమ జాతీయ గీతరచయిత అవార్డు.. ఇలా వరుసగా ఒకే సంవత్సరం నన్ను ఆరు పురస్కారాలు వరించాయి. మన తెలుగుకు వెయ్యేళ్ల సాహిత్య చరిత్ర ఉంది. రెండువేల సంవత్సరాల భాషా చరిత్ర ఉంది. నా మిత్రుడు ఒకరు 'సంకల్పం' అనే పుస్తకం తెలుగులో రాసి, ఈ పుస్తకం కోసం వారం రోజులు సెలవు పెట్టి అమెరికా నుంచి వచ్చారు. ఆ తర్వాత అమెరికా వెళ్లినప్పుడు ఆయన సహోద్యోగి ఎందుకు సెలవు పెట్టారని అడగ్గా... తెలుగు భాష పుస్తకం కోసం అని చెప్పగా.. ఆవిడ తెలుగు అంటే.. ఆ నాటు నాటు లాంగ్వేజ్ అన్నారట. ప్రపంచంలో తెలుగు అనేది ఒకటి ఉందని చాలామందికి తెలియదు. కానీ మొట్టమొదటిసారి 'నాటు పాట'తో ఇది నాటు భాష అని తెలిసింది. ఈ పాట సృష్టికర్తల్లో నేను ఒకడిని. నా జన్మ చరితార్థమైంది. ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించిన నిహారిక, ప్రదీప్, సరస్వతిలకు, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు'' అని అన్నారు. ఈ ఏడాది ఆస్కార్, జాతీయ అవార్డులతో పాటు మరెన్నో అవార్డులను సొంతం చేసుకున్న రచయిత చంద్రబోస్‌ని సత్కరించడానికి 'తెలుగు జాతీయ చంద్రబోస్' పేరిట శనివారం హైదరాబాద్‌లో నటుడు ప్రదీప్ ఓ వేడుక నిర్వహించారు. ఈ వేదికపై చంద్రబోస్‌ని, ఆయన సతీమణి, నృత్యదర్శకురాలు, దర్శకురాలు సుచిత్రా చంద్రబోస్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ– ''ఆస్కార్, జాతీయ అవార్డు అందుకున్న చంద్రబోస్‌గారికి మా కవి కులం తరపున అభినందనలు. బోస్‌గారి ప్రయాణం, ప్రస్థానం ఆదర్శవంతంగా ఉంటాయి. ఈ గొప్పదనం, ఆదర్శం ఒక్కరోజులో రాదు. తొలి రోజు నుంచే కష్టపడుతూ ఉండాలి. ఓ రచయితకు జరిగిన ఈ సన్మానాన్ని అక్షరానికి జరిగిన సన్మానంలా భావిస్తున్నాను'' అన్నారు. ఈ వేడుకలో పలువురు కళాకారులను సన్మానించారు. మురళీమోహన్, ముప్పలనేని శివ, ఎంఎం శ్రీలేఖ, చంద్రబోస్ సోదరుడు రాజేందర్‌తో పాటు పలువురు సినీ, టీవీ నటీనటులు పాల్గొన్నారు.


● సుచిత్ర, చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, ప్రదీప్

థియేటర్లో చూడాల్సిన సినిమా

- యశ్వంత్



నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ– ''మంత్ ఆఫ్ మధు' సినిమా లైఫ్ డ్రామా. ప్రతి ఒక్కరి జీవితంలో హనీమూన్ పీరియడ్ అంటూ ఉంటుంది. ఈ సమయం వారి జీవితాల్లో బ్యూటిఫుల్‌గా ఉంటుంది. అయితే జీవితం ఎప్పుడూ హ్యాపీగా ఉండదు. ఎత్తుపల్లాలు ఉంటాయి. ఈ వాస్తవాన్ని చూపించాలని చేసినదే ఈ చిత్రం. రవికాంత్ పేరేపు స్క్రీన్‌ప్లే కీలకంగా ఉంటుంది. నవీన్, స్వాతి, శ్రేయా బాగా నటించారు. మా తొలి సినిమా 'భానుమతి రామకృష్ణ' ఓటీటీలో విడుదలైంది. రెండింతలు లాభాలు కూడా వచ్చాయి. 'మంత్ ఆఫ్ మధు' నిర్మాతగా నా రెండో సినిమా. ఇది థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా. మా సినిమా రోజునే ఐదారు సినిమాలు రిలీజవుతున్నాయి. అయితే మా జానర్ డిఫరెంట్'' అన్నారు.

వైరల్ విశాలాక్షి కొత్తగా అనిపించింది

- ఈషా రెబ్బా



సుధీర్‌బాబు త్రిపాత్రాభినయం చేసిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మాట్లాడుతూ– ''సుధీర్‌బాబుగారు చేసిన మూడు పాత్రల్లో దుర్గ పాత్రకు జోడీగా వైరల్ విశాలాక్షి పాత్ర చేశాను. ఏదో ఒకటి చేసి వైరల్ కావాలనుకునే మనస్తత్వం విశాలాక్షిది. ఈ పాత్ర నాకు కొత్తగా అనిపించింది. ఈ సినిమా కథను హర్షవర్ధన్ గారు చెప్పినప్పుడు కన్‌ఫ్యూజ్ అయ్యాను. కానీ సెట్స్‌లో క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం తమిళంలో విక్రమ్ ప్రభుతో ఓ సినిమా కమిట్ అయ్యాను. అలాగే నాకు మంచి గుర్తింపు తెచ్చిన 'దయ' వెబ్ సిరీస్ రెండో భాగం 'దయ 2' వచ్చే సంవత్సరం ఆరంభమవుతుంది'' అన్నారు.

హెల్త్



పొరుగునే స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్! మన దగ్గరా అప్రమత్తత అవసరం!!

ఆంధ్రప్రదేశ్‌కు పొరుగునే ఉన్న ఒడిశాలో కొంతకాలంగా 'స్క్రబ్ టైఫస్' బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ స్వైరవిహారం చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్కడ కనిపిస్తున్న ఈ కేసులు గత రెండు మూడు వారాలుగా ఒక్కసారిగా పెరిగాయి. ఇటీవల ఒక్క సుందర్‌ఘర్ జిల్లాలోనే దాదాపుగా 200కు పైగా కేసులు రావడంతో పాటు, కొన్ని మరణాలు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలూ అప్రమత్తం కావాల్సిన అవసరమున్న ఈ తరుణంలో స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్‌పై అవగాహన కోసం ఈ కథనం.

'స్క్రబ్ టైఫస్' బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను 'బుష్ టైఫస్' అని కూడా అంటారు. ఈ ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియమ్ పేరు 'ఓరియెంటియా సుసుగాముషి'. ఇది చిమ్మటలా కనిపించే చిగ్గర్ అనే ఒక రకం కీటకం ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ కీటకం కుట్టినప్పుడు చర్మం ఎర్రబారడం, దురదరావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కుట్టడం వల్ల 'ఓరియెంటియా సుసుగాముషి' అనే బ్యాక్టీరియమ్ దేహంలోకి ప్రవేశించడంతో ఈ స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్ వస్తుంది.

ఒకసారి చిగ్గర్ కుట్టాక... బ్యాక్టీరియమ్ బాధితుల రక్తంలోకి చేరితే... దాదాపు పది రోజుల తర్వాత లక్షణాలు కనిపించడం మొదలవుతుంది. చాలావరకు లక్షణాలు నిరపాయకరంగా ఉండవచ్చు. కానీ మొదటివారంలో దీన్ని గుర్తించకపోవడం లేదా సరైన చికిత్స ఇవ్వకపోవడం జరిగితే రెండోవారం నుంచి కొన్ని దుష్ప్రభావాలు వస్తాయి. ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె, కొన్ని సందర్భాల్లో మెదడు కూడా ప్రభావితమై మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీయవచ్చు.

స్క్రబ్ టైఫస్ లక్షణాలు

- వణుకుతో కూడిన చలిజ్వరం
- తలనొప్పి
- ఒళ్లునొప్పులు, కండరాల నొప్పులు
- చిగ్గర్ కీటకం కుట్టిన చోట చర్మంపై గాయం మానుబట్టినప్పుడు కనిపించే నల్లటి మచ్చ కనిపిస్తుంది. దీన్ని 'ఎషర్' అని కూడా అంటారు.
- లింఫ్‌నోడ్స్‌లో వాపు
- చర్మంపై ర్యాష్.

నిర్ధారణ

ఈ వ్యాధి నిర్ధారణకు చాలా పరీక్షలే అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు వెయిల్ ఫెలిక్స్ పరీక్ష, ఇన్‌డైరెక్ట్ ఇమ్యూనోఫ్లోరోసెంట్ యాంటీ బాడీ (ఐఎఫ్ఏ) పరీక్ష, ఇన్‌డైరెక్ట్ ఇమ్యూనో పెరాక్సైడేజ్ (ఐపీపీ) పరీక్ష, ఎలీజా, ఇమ్యూనో క్రొమాటోగ్రాఫిక్ టెస్ట్ (ఐసీటీ), పీసీఆర్ పరీక్షల ద్వారా దీన్ని నివారణ చేయవచ్చు. అయితే చాలా రకాల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లలో కూడా దాదాపుగా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో తగిన మోతాదులో యాంటీబయాటిక్ చికిత్స చేసి, బాధితుల పరిస్థితిని నార్మల్ చేయవచ్చు.

అందుకే అన్నన్ని ఖరీదైన పరీక్షలకు బదులు కాస్తంత అనుభవజ్ఞులైన డాక్టర్లు కొన్ని లక్షణాల ఆధారంగా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను గుర్తిస్తారు. ఉదాహరణకు మలేరియాలో ప్రోటోజోవన్ పారసైట్ రకాన్ని బట్టి కొన్ని రోజుల వ్యవధిలో జ్వరం మాటిమాటికీ వస్తుంటుంది. అదే వైరల్ జ్వరాలు చాలా తీవ్రంగా, ఎక్కువ ఉష్ణోగ్రతతో వస్తుంటాయి. ఈ లక్షణాలను బట్టి ఆయా జ్వరాలను గుర్తుబట్టి చికిత్స అందిస్తారు. దీనికి జ్వరం వచ్చిన తొలిదశలోనే సింపుల్‌గా ఇచ్చే యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తే చాలు. ఒకవేళ చికిత్స అందించకపోతే కొన్నిసార్లు ఇది లంగ్స్, గుండె, నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థతో పాటు కిడ్నీలపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది.

నివారణ


దీనికి టీకా ఏదీ అందుబాటులో లేదు. చిగ్గర్ కీటకాల కాటుకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవడం మంచిది. ఇవి పొలాల్లో, మట్టిలో నివసిస్తూ, అక్కడే గుడ్లు పెడతాయి. కాబట్టి చేలూ, పొలాల్లో నడిచే సమయాల్లో చెప్పులు వాడటం వంటి జాగ్రత్తలతో దీన్ని చాలావరకు నివారించవచ్చు. ఫుల్ స్లీవ్ దుస్తులు, కాళ్లు పూర్తిగా కప్పేలాంటి దుస్తులు ధరించడం మేలు. ట్రెకింగ్ వంటి సాహసక్రీడల్లో పాల్గొనేవారు చిగ్గర్స్ ఉండే ప్రాంతాల్లోనే నడిచే అవకాశాలు ఎక్కువ. అందుకే... ట్రెక్కింగ్ చేసేవారు ఇప్పుడీ వ్యాధి విస్తరిస్తున్న ప్రాంతాలకు కొన్నాళ్లు ట్రెక్కింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది.

చికిత్స

కొన్ని అరుదైన సందర్భాల్లో (అంటే కాంప్లికేషన్స్ వచ్చిన కేసుల్లో) మినహా... టెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్ మందులతోనే ఇది అదుపులోకి వస్తుంది. కీమో ప్రొఫిలాక్టిక్ ట్రీట్‌మెంట్ తీసుకుంటే... అది కొంతవరకు దీని నివారణకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఇప్పుడు మన రాష్ట్రాల నుంచి ఒడిశా వెళ్లాల్సినవారు ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కీమో ప్రొఫిలాక్టిక్ తీసుకోవడం కొంత మేలు చేస్తుందని చెప్పవచ్చు.


డా॥ శివరాజు
సీనియర్ ఫిజీషియన్

పొట్టలో గ్యాస్!



గ్యాస్ కడుపులోకి చేరాక పొట్టఉబ్బరంగా అనిపించడం... కొన్నిసార్లు అది ఛాతీలోనొప్పి కలిగించడం, ఒక్కోసారి గుండెపోటుగా పొరబడటం... ఇలాంటి ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తుంది.

ఈ సమస్యకు తేలికపాటి పరిష్కారాలివి... ● ఆహారాన్ని మెల్లమెల్లగా తినాలి. తినే సమయంలో గాలి మింగకుండా ఉండటం కోసం పెదవులు మూసి ఆహారాన్ని నమలాలి. తక్కువ తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినడం మంచిది. ● కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలు, బాగా వేయించిన పదార్థాలకూ దూరంగా ఉండాలి. ● పొగ, మద్యం అలవాట్లను మానేయాలి. ● రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. ● గ్యాస్ ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్, సోడాలు, కార్బొనేటెడ్ డ్రింక్స్ వంటి బీవరేజెస్‌కు దూరంగా ఉండాలి. ● గ్యాస్‌ను పెంచే వెజిటబుల్స్‌నూ, సిట్రస్ జాతికి చెందిన పండ్లను పరిమితంగా తీసుకోవాలి. ● పాలు, పాల ఉత్పాదనలతో కడుపు ఉబ్బరమై, పొట్టలో గ్యాస్ పెరిగితే ల్యాక్టోజ్ రహిత పాలు, పాల ఉత్పాదనలను తీసుకోవడం. ● బరువు పెరగకుండా చూసుకోవాలి. చురుగ్గా ఉంటూ, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.



స్టార్క్ హ్యాట్రిక్... ఆస్ట్రేలియా, నెదర్లాండ్ మ్యాచ్ రద్దు

తిరువనంతపురంలో జరిగిన ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వానతో ఆట ఆలస్యం కావడంతో మ్యాచ్‌ను 23 ఓవర్లకు కుదించారు. ముందుగా ఆసీస్ 23 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (55) అర్ధ సెంచరీ సాధించగా...గ్రీన్ (34), క్యారీ (28), స్టార్క్ (24 నాటౌట్) రాణించారు. వాన్ డర్ మెర్వ్, డి లీడ్, వాన్ బీగ్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం నెదర్లాండ్స్ 14.2 ఓవర్లలో 6 వికెట్లకు 84 పరుగులు సాధించింది. మిచెల్ స్టార్క్ చెలరేగి 'హ్యాట్రిక్' సాధించాడు. అతను వరుసగా మూడు బంతుల్లో మ్యాక్స ఓడౌడ్, వెస్లీ బరెసి, బాస్ డి లీడ్‌లను అవుట్ చేశాడు. అయితే మళ్లీ వాన రావడంతో అంపైర్లు ఇక ఆటను కొనసాగించకుండా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆస్ట్రేలియా తర్వాతి వామప్ మ్యాచ్‌లో అక్టోబర్ 3న హైదరాబాద్‌లో పాకిస్తాన్‌తో తలపడుతుంది.

పసిడి టెన్నిస్ శభాష్ స్క్వాష్...

భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు • షూటింగ్‌లో వెండి పతకం • అథ్లెటిక్స్‌లో రజత, కాంస్యాలు • ఆసియా క్రీడల్లో కొనసాగిన భారత్ జోరు

ఆసియా క్రీడల్లో భారత్ పతకాల మోత కొనసాగుతోంది. శనివారం కూడా నాలుగు వేర్వేరు క్రీడాంశాల్లో కలిపి భారత్ ఖాతాలో 5 పతకాలు చేరాయి. స్క్వాష్ టీమ్ విభాగంలో, టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మన ఆటగాళ్లు పసిడి పంట పండించారు. షూటింగ్‌లో సాంప్రదాయం కొనసాగిస్తూ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మరో రజతం మనకు దక్కింది. ఏకంగా 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత అథ్లెట్లు 10 వేల మీటర్ల పరుగులో రజత, కాంస్యాలు అందించారు. వీటికి తోడు మహిళల టేబుల్ టెన్నిస్‌లో ప్రపంచ చాంపియన్ చైనాకు షాక్ ఇచ్చి మన ప్యాడ్లర్లు సంచలనం సృష్టించగా... బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత బృందం తొలిసారి ఫైనల్ చేరింది. ఎప్పటిలాగే హాకీ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసిన టీమిండియా అదనపు ఆనందాన్ని అందించింది.

హాంగ్జౌ ఆసియా క్రీడలు



విజయానంతరం అభయ్ సింగ్... భారత బృందం సంబరాలు

పాకిస్తాన్‌ను పడగొట్టి...

ఎనిమిదేళ్ల తర్వాత స్క్వాష్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ స్వర్ణ పతకం గెలుచుకుంది. ఫైనల్లో భారత్ 2-1 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై విజయం సాధించింది. లీగ్ దశలో పాక్ చేతిలో ఓడిన సౌరవ్ ఘోషాల్ బృందం అసలు సమయంలో సత్తా చాటింది. పోరు 1-1తో సమంగా నిలిచిన తర్వాత భారత్‌ను గెలిపించాల్సిన బాధ్యత యువ ఆటగాడు అభయ్ సింగ్‌పై పడింది. లీగ్ దశలో తనపై విజయం సాధించిన నూర్ జమాన్‌తో అభయ్ తలపడ్డాడు. హోరాహోరీగా సాగిన ఐదు గేమ్‌ల పోరులో చివరకు అభయ్ 11-7, 9-11, 8-11, 11-9, 12-10తో జమాన్‌ను ఓడించాడు. నాలుగో గేమ్‌లో ఒక దశలో జమాన్ 9-7లో ఆధిక్యం నిలవగా, ఐదో గేమ్‌లోనూ అతను 10-8తో విజయానికి చేరువయ్యాడు. కానీ అద్భుత పోరాటపటిమ కనబర్చిన అభయ్ రెండు సందర్భాల్లోనూ సత్తా చాటి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి పాయింట్ తర్వాత భారత జట్టు సభ్యులు భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు తొలి మ్యాచ్‌లో పాక్ ఆటగాడు ఇక్బాల్ నసీర్ 11-8, 11-2, 11-3తో మహేశ్ మంగావ్‌కర్‌పై ఘన విజయం సాధించాడు. అయితే ఆరో సారి ఆసియా క్రీడల బరిలోకి దిగిన భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ రెండో మ్యాచ్‌లో 11-5, 11-1, 11-3తో ముహమ్మద్ ఆసిమ్ ఖాన్‌ను చిత్తు చేసి స్కోరును సమం చేశాడు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో స్వర్ణం నెగ్గిన భారత్ 2018 పోటీల్లో కాంస్యంతో సరిపెట్టుకుంది.



'ముఖర్జీ' ద్వయం సంచలనం

• టీటీలో వరల్డ్ చాంపియన్ చైనా జోడీపై విజయం
• సెమీస్ చేరి పతకం ఖాయం

టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో భారత జోడీ సుతీర్థ ముఖర్జీ – ఐహిక ముఖర్జీ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. సంచలన విజయంతో ఈ జోడి సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సుతీర్థ – ఐహిక 11-5, 11-5, 5-11, 11-9 (3-1) స్కోరుతో వరల్డ్ చాంపియన్, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న మెంగ్ చెన్ – యిడి వాంగ్‌ను ఓడించింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల డబుల్స్ విభాగంలో భారత్ ఎప్పుడూ పతకం గెలవలేదు. ఈ నేపథ్యంలో తాజా విజయం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. 8, 9 నిమిషాల్లో వరుసగా తొలి రెండు గేమ్‌లను గెలుచుకొని భారత జోడి దూకుడు ప్రదర్శించింది. మూడో గేమ్‌లో కోలుకొని చైనా ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించగా, నాలుగో గేమ్ హోరాహోరీగా సాగింది. చివరకు మెంగ్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్ నెట్‌కు తాకడంతో భారత్ విజయం ఖాయమైంది. అంతకు ముందు మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మనిక బాత్రా 8-11, 12-10, 6-11, 4-11, 14-12, 5-11 స్కోరుతో వరల్డ్ నంబర్ 4 యిడి వాంగ్ (చైనా) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో మానుష్ షా – మానవ్ ఠక్కర్ జంట క్వార్టర్స్‌లో 8-11, 11-7, 10-12, 11-6, 9-11 తేడాతో వూజిన్ జాంగ్ – జాన్‌ఘూన్ లిమ్ (కొరియా) చేతిలో ఓడి నిష్క్రమించింది.

కిడాంబి శ్రీకాంత్ గెలిపించగా...

• తొలిసారి ఫైనల్లో భారత్

భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఆసియా క్రీడల టీమ్ ఈవెంట్‌లో తొలిసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. తద్వారా మొదటి స్వర్ణం గెలిచేందుకు మరో అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 3-2 తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. అనూహ్యంగా కొరియానుంచి భారత్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో పోరు హోరాహోరీగా సాగిన చివరి మ్యాచ్ వరకు వెళ్లింది. పురుషుల తొలి సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 18-21, 21-16, 21-19తో జీన్ హ్యోక్ జీన్‌పై విజయం సాధించగా, పురుషుల డబుల్స్‌లో టాప్ జోడి సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టిపై 21-13, 26-24తో కాంగ్ మిన్ హ్యూక్ – స్యూంగ్ జే సంచలన విజయం సాధించారు. రెండో సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-7, 2-19తో లీ యూన్ గ్యూను చిత్తుగా ఓడించినా... రెండో డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్ – ధ్రువ్ కపిల 16-21, 11-21తో కిమ్ వోన్ హో – సంగ్ సియూంగ్ చేతిలో పరాజయంపాలైంది. దాంతో భారత్‌ను గెలిపించాల్సిన బాధ్యత కిడాంబి శ్రీకాంత్‌పై పడింది. తొలి గేమ్‌ను అతనూ ఓడిపోవడంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే చివరకు 12-21, 21-16, 21-14తో చో జియోనిప్‌పై శ్రీకాంత్ గెలుపొందాడు.



శ్రీకాంత్‌కు కోచ్‌లు పుల్లెల గోపీచంద్, గురుసాయిదత్ అభినందన

'సిల్వర్' సరబ్‌జోత్ - దివ్య



భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ శనివారం తన 22వ పుట్టిన రోజున మరో ఆసియా క్రీడల పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అతనికి రజతం దక్కింది. మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ – దివ్య టీఎస్ జోడి రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని గెలుచుకుంది. స్వర్ణ పతకం కోసం జరిగిన పోరులో చైనాకు చెందిన ప్రపంచ చాంపియన్ జోడి జాంగ్ బోవెన్ – జియాంగ్ రాంగ్జిన్ 16-14 తేడాతో సరబ్‌జోత్ – దివ్యలను ఓడించింది. గురువారమే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన సరబ్‌జోత్ మరోసారి పసిడిపై గురి పెట్టినా దురదృష్టవశాత్తూ ఆ అవకాశం చేజారింది. దివ్యకు ఇది రెండో రజతం. తాజా ప్రదర్శన తర్వాత ఈ ఆసియా క్రీడల షూటింగ్‌లో భారత్ పతకాలు సంఖ్య 19కి చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 8 రజతాలు, 5 కాంస్యాలు ఉన్నాయి.

సత్తా చాటిన కార్తీక్, గుల్వీర్



1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో 10,000 మీటర్ల పరుగులో భారత్‌కు చెందిన గులాబ్ సింగ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఆ తర్వాత ఐదు ఆసియా క్రీడలు జరిగినా ఈ లాంగ్ డిస్టెన్స్ ఈవెంట్‌లో మనకు మెడల్ దక్కలేదు. కానీ శనివారం ఆ లోటు తీరింది. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. రజత, కాంస్యాలు రెండూ మన అథ్లెట్లే గెలవడం విశేషం. కార్తీక్ కుమార్‌కు రజతం దక్కగా, గుల్వీర్ సింగ్ కాంస్యం సాధించాడు. కార్తీక్ కుమార్ 28 నిమిషాల 15.38 సెకన్లలో పరుగు పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. 28 నిమిషాల 17.21 సెకన్ల టైమింగ్‌తో గుల్వీర్ మూడో స్థానం సాధించాడు. వీరిద్దరికీ ఈ టైమింగ్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనలు కావడం గమనార్హం. ఈ ఈవెంట్‌లో బహ్రెయిన్‌కు చెందిన బిర్హాను యమతావ్ (28 నిమిషాల 13.62 సెకన్లు) స్వర్ణపతకం గెలుచుకున్నాడు.

భారత్ 10, పాకిస్తాన్ 2



ఆసియా క్రీడల్లో భారత హాకీ జట్టు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను బలంగా దెబ్బ కొట్టింది. పూల్ ఎ మ్యాచ్‌లో భారత్ 10-2 గోల్స్ తేడాతో పాక్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. అంతర్జాతీయ హాకీలో పాక్‌పై భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం కావడం విశేషం. 2017లో నమోదు చేసిన 7-1 స్కోరును భారత్ ఇక్కడ తిరగరాసింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాలుగు గోల్స్‌తో చెలరేగాడు. హర్మన్ 11వ, 17వ, 33వ, 34వ నిమిషాల్లో గోల్స్ కొట్టాడు. వరుణ్ కుమార్ 41వ, 54వ నిమిషాల్లో గోల్స్ సాధించగా...లలిత్ (49వ ని.), షంషేర్ (46వ ని.), సుమీత్ (30వ ని.), మన్‌దీప్ సింగ్ (8వ ని.) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున అబ్దుల్ వహీద్ రానా (45వ ని.), సూఫియాన్ ఖాన్ (38వ ని.) ఒక్కో గోల్ నమోదు చేశారు.

మెరిసిన బోపన్న-రుతుజ ద్వయం





ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్‌ను భారత్ రెండు పతకాలతో ముగించింది. శుక్రవారం భారత్‌కు పురుషుల డబుల్స్ విభాగంలో రజత పతకం దక్కగా...శనివారం మన జట్టు ఖాతాలో పసిడి పతకం చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడి రోహన్ బోపన్న – రుతుజ భోస్లే ద్వయం ఈ ఘనత సాధించారు. పోటాపోటీగా సాగిన ఫైనల్లో బోపన్న – రుతుజ 2-6, 6-3, 10-4 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన సుంగ్ హావో – షువో లియాంగ్‌పై విజయం సాధించారు. భారత్ స్వీయ తప్పిదాలతో భారత్ తొలి సెట్ కోల్పోయినా...ఆ తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శనతో మ్యాచ్‌ను నిలబెట్టుకుంది. రుతుజ పేలవ సర్వీస్‌తో పాటు లియాంగ్ చక్కటి రిటర్న్‌లతో తైపీ 5-1తో దూసుకుపోయింది. ఏడో గేమ్‌లో బోపన్న ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. అయితే రెండో సెట్‌లో రుతుజ ఆట మెరుగవడంతో పరిస్థితి మారిపోయింది. బోపన్న సర్వీస్‌తో సెట్ మన ఖాతాలో చేరగా...మూడో సెట్ సూపర్ టైబ్రేక్‌కు చేరింది. ఇక్కడా భారత జోడి చక్కటి ఆటతో ముందుగా 6-1తో ఆధిక్యంలోకి వెళ్లి ఆపై దానిని నిలబెట్టుకుంది. బోపన్నకు ఇది రెండో ఆసియా క్రీడల స్వర్ణం కాగా, రుదుజకు మొదటిది.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	114	68	34	216
జపాన్	28	38	39	105
దక్షిణ కొరియా	27	29	54	110
భారత్	10	14	14	38
ఉజ్బెకిస్తాన్	10	11	16	37
థాయ్‌లాండ్	8	4	14	26
చైనీస్ తైపీ	7	9	9	25
హాంకాంగ్	5	15	18	38
ఉత్తర కొరియా	5	7	4	16
ఇరాన్	3	11	11	25

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

బాక్సింగ్‌లో మూడు పతకాలు ఖాయం

ముగ్గురు భారత బాక్సర్లు సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టి కనీసం కాంస్యాన్ని ఖాయం చేసుకున్నారు. 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో ఆమె 4-1తో జైనాశికర్‌బెకొవా (కజకిస్తాన్)ను ఓడించింది. తాజా ఫలితంతో ప్రీతి పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించడం విశేషం. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతకం విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), పురుషుల విభాగంలో నరేందర్ (92 కేజీలు) సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్స్‌లో లవ్లీనా 5-0తో సియోంగ్ సుయాన్ (కొరియా)పై, నరేందర్ 5-0తో ఇమాన్ దిలావర్ (ఇరాన్)ను ఓడించారు.

మీరాబాయి చానుకు నాలుగో స్థానం

టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను అనూహ్య ఓటమిని ఎదుర్కొంది. వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల కేటగిరీలో చాను నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం 191 కేజీల బరువెత్తిన చాను కాంస్యం కోసం ప్రయత్నిస్తూ చివరి ప్రయత్నంలో దురదృష్టవశాత్తూ గాయపడింది. 117 కేజీల క్లీన్ అండ్ జర్క్ లక్ష్యంగా ప్రయత్నించి వెనుక వైపుకు పడిపోయింది. దాంతో కోచింగ్ సిబ్బంది ఆమెను బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. వైద్య పరీక్షలు జరిపి ఆమె గాయం తీవ్రతను తెలుసుకుంటామని భారత అధికారులు వెల్లడించారు.

ఫైనల్స్‌కు జ్యోతి క్వాలిఫై

భారత అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజి ఆసియా క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. హీట్స్‌ను ఆమె 13.03 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. మరో భారత అథ్లెట్ నిత్య రామ్‌రాజ్ కూడా ఇదే ఈవెంట్‌లో ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. లాంగ్‌జంప్‌లో కామన్వెల్త్ రజత పతక విజేత మురళీ శ్రీశంకర్ కూడా ముందంజ వేశారు. 7.97 మీటర్లు దూకిన మురళి అర్హత మార్క్ (7.90 మీటర్లు)ను సునాయాసంగా దాటి ఫైనల్స్‌కు చేరాడు. జెస్విన్ ఆల్డ్రిన్ కూడా భారత్ తరఫున ఫైనల్లో పోటీ పడనున్నాడు. 1500 మీటర్ల పరుగులో భారత్ తరఫున జిన్సన్ జాన్సన్, అజయ్ కుమార్ బరిలోకి దిగుతారు.

తొలి 'వామప్' వర్షార్పణం



భారత్, ఇంగ్లండ్ మ్యాచ్ రద్దు

గువహటి: వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌కు సరైన సన్నాహకం లభించలేదు. వామప్ మ్యాచ్‌లను వరుసగా రెండో రోజూ వాన వెంటాడటంతో ఆట సాధ్యం కాలేదు. భారీ వర్షం కారణంగా శనివారం భారత్, ఇంగ్లండ్ మధ్య జరగాల్సిన వామప్ మ్యాచ్ రద్దయింది. రోజంతా కురిసిన వర్షం తెరిపినివ్వకపోవడంతో ఒక్క బంతి కూడా వేసే అవకాశం లేకపోయింది. మ్యాచ్ ఆరంభానికి కాస్త ముందు పరిస్థితి మెరుగ్గా ఉండటంతో టాస్ వేశారు. టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఆ తర్వాత జోరందుకున్న వానతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. నిజానికి ఇరు జట్ల ఆటగాళ్లు అధికారికంగా అంపైర్లు ప్రకటించక ముందే మైదానం వీడి హోటల్‌కు వెళ్లిపోయారు. ఈ నెల 3న తిరువనంతపురంలో జరిగే తమ తర్వాతి వామప్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. అయితే తాజా స్థితిని బట్టి చూస్తే ఈ మ్యాచ్ నిర్వహణ కూడా సందేహంగానే ఉంది. వరల్డ్ కప్ అసలు సమరంలో ఈ నెల 8న చెన్నైలో ఆస్ట్రేలియాను టీమిండియా ఎదుర్కొంటుంది.

'శాఫ్' అండర్-19 ఫుట్‌బాల్ విజేత భారత్



ఖట్మండూ (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-19 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టు గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో భారత్ విజేతగా నిలవడం ఇదే ఎనిమిదో సారి కావడం విశేషం. భారత్ తరఫున మంగ్లెన్‌తంగ్ కిప్‌జెన్ రెండు గోల్స్ (64వ నిమిషం, 85వ నిమిషం) సాధించగా, గ్వాగమ్‌సర్ గోయరీ (90+5వ నిమిషం) మరో గోల్ కొట్టాడు.

రాహుల్‌కు మొదటి అవకాశం



న్యూఢిల్లీ: వరల్డ్ కప్‌లో భారత వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కే తొలి ప్రాధాన్యత ఉంటుందని మాజీ వికెట్ కీపర్, మాజీ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. ఇషాన్ కిషన్‌కంటే మిడిలార్డర్‌లో రాహుల్ ఎంతో విలువైన ఆటగాడని ఆయన అన్నారు. తన ప్రదర్శనతో దీనిని అతను రుజువు చేసుకున్నాడని, మరో చర్చకు ఆస్కారం లేద ని ప్రసాద్ చెప్పారు. రాహుల్‌కు గాయం కావడం లేదా సుదీర్ఘ టోర్నీ కాబట్టి కొన్ని మ్యాచ్‌లలో తప్పనిసరిగా విశ్రాంతినివ్వాల్సి వస్తేనే ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందని ఎమ్మెస్కే వివరించారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రెడ్డి/High Matches, డైవర్స్ 40, 30 లక్షల జీతం, "రెడ్డి/31, Divorce, బిజినెస్, 50 Crores ప్రాపర్టీ. కాల్: 9392023911 (రెడ్డి పెళ్లి సంబంధాలను సకాలంలో సెట్ చేయబడును). [HA-11784]

35 years/1st మ్యాచ్ Govt. ఎంప్లాయ్ 2,00,000/- (pm) కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వరుడికి (ఓసీ కమ్మ, కాపు, రెడ్డి, పద్మశాలి) వధువు కావలెను. సంప్ర: 7386550413 [H-788687]

SC హిందు మాల: M.Tech, IIT/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/BHEL/90,000/- pm/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [H-14773]

క్రిస్టియన్ మాదిగ: M.Tech/ Govt.Asst ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept/ 70,000/- pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9963410191 [H-14773]

వడ్డెర: కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ఇన్స్‌పెక్టర్/ ఎక్సైజ్Dept/ 80,000/- pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [H-14773]

రజక: B.Tech/ Govt.Asst. ఇంజినీర్/ ఇరిగేషన్ Dept/ 1 Laksh. pm/ 5'7" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14773]

SC మాల: ఏకైక కుమారుడు/B.Tech/ Govt.Jr. ఇంజినీర్/ పవర్‌గ్రిడ్/ 1లక్ష pm/5'8"ఎత్తు/ 30 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [H-14773]

SC మాల: కట్నప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/ 80,000- pm/5'10"ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [H-14773]

గౌడ: B.Tech/ C.Govt. బ్యాంక్ P.O/ ఇండియన్ బ్యాంక్/ 60,000/- pm/5'8"ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7032058965 [H-14773]

SC (మాల): కట్నప్రసక్తిలేదు/కులపట్టింపు లేదు/ చదువు. డిగ్రీ/ Good Job/ సొంత ఇల్లు/ Good Family గల వరుడికి వధువు కావలెను. మొదటి/2వ పెళ్లైనా OK Ph: 8367619529 [H-793360]

ముదిరాజ్: 2వ పెళ్ళి/Good Looking/ వయస్సు: 37/చదువుడిగ్రీ/గవర్నమెంట్ జాబ్/సొంతఇల్లు/ Good Familyగల వరుడికి వధువు కావలెను. మొదటి/ 2వపెళ్లైనా OK కట్నప్రసక్తి లేదు. Ph: 8367619529 [H-793360]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Atlanta, BE MS, 29, 6', H1, Engineer, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 9", Apple, 125 K, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pakanati, BE (IIT), MS, 26, 5' 9", SWE, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 30, 5' 7", Manager, 120 K, 25 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి California, BE, MS, 26, 5' 5", Sr SWE, 120 K, H1, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE, MBA, 26, 5'6", 5 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Amazon, BE, MS, 26, 5' 6", SWE, 130 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, BE, MBA, 27, 5' 3", Analyst, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 30, 5' 8", SWE, 140 K, 26 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి New York, BE, MS, 27, 6', Associate, 140 K, 200 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BITSBE, 30, 5' 7", 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 4", Sr SWE, 105 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5'2", Sr Consultant, 11 L P/A, 7 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 27, 5' 6", USA, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 5", SWE, 100 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

SC మాల & క్రిస్టియన్/M.Tech/NIT/ Govt. A.E.E/ ఇరిగేషన్ Dept/18Lakhs PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-14776]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/B.Tech/ బ్యాంక్ మేనేజర్/HDFC/1 Lakh. PM/ 5'8"ఎత్తు/33 సం॥ల పిల్లలు లేని వరునికి వధువు కావలెను. Ph: 9550650024 [HA-14776]

యాదవ/B.Tech(EEE)/Govt.A.E.E/ ట్రాన్స్‌కో/14 Lakhs PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-14776]

రజక/కట్న ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 60,000/-PM/ 5'10"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7075953400, 7842467591 [HA-14776]

గౌడ/29 /5'5" / B.Tech, NIT/Own హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్/2 Lakhs. PM/20Cr ప్రాపర్టీ గల అబ్బాయికి అమ్మాయి కావలెను. Ph: 9441039962 [HA-14776]

ఆర్యవైశ్య/46yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. Cell: 7995585722, 7680872085. [T-2193]

కమ్మ, 56Y, 5'10H, Fair, NRI Doctor ఇక్కడే స్థిరపడిన అతనికి ఏ బాదర బంధి లేని అందమైన చదువుకున్న 45 సం॥లోపు ఇంట్లో ఉండిపోయే యువతి కావలెను. CNB Ph : 80746 87749 [V-1162484]

Reddy /40/ 5.6/ B.Tech Soft Ware Employee. Good Salary Any 1st & 2nd fair. అందమైన వధువు కావలెను. Direct contact: 73375 86682 [L-798814]

Reddy- 28/5'9"/ BBM / Fair/ Business. 500CR. Contact : PP Reddy, 9391198332 [H-788325]

★

పద్మశాలి: 36Y, ఎత్తు 5'4", Govt జాబ్, నెలకు 25,000 జీతం, సొంత ఇల్లు గల వరుడికి తగిన అమ్మాయి (వధువు) కావలెను. 7730883543, 7095392432. [W-189182]

పద్మశాలి: 31Y, ఎత్తు 5'11", సాఫ్ట్‌వేర్ జాబ్, నెలకు 80,000 జీతం, సొంత ఇండ్లు & ప్రాపర్టీస్ గల వరుడికి తగిన వధువు కావలెను. 7730883543, 7095392432. [W-189182]

పద్మశాలి: 29Y, ఎత్తు 5'6", సాఫ్ట్‌వేర్ జాబ్ బెంగుళూరు నెలకు 2 లక్షలు జీతం, సొంత ఇల్లు & ప్రాపర్టీస్ గల వరుడికి తగిన వధువు కావలెను. 7730883543, 7095392432. [W-189182]

అన్ని కులాలు అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35, ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం 20 వేలు, M.Ed., ఆస్తి 90 లక్షలు, నల్లగొండ. : 9121325068 [Y-772545]

★★

నో క్యాస్ట్, మతం, కట్నం, చదువుతో పనిలేదు విడో / డైవర్సీ, 39 సం.లోపు అమ్మాయి కావలెను. కొత్త దుర్గా నాగేంద్ర వర ప్రసాద్ BA, జర్నలిజం, NGO, రైటర్, ప్రవేట్ జాబ్. డైరెక్ట్, తెనాలి-2. 6301554541. [B-1193672]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రోపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి డిగ్రీ చదివిన వధువు కావలెను. Cont: 94932 42896 [G-786001]

మాల క్రిస్టియన్ వయస్సు 38 సం॥లు. H-5'9" B.Tech., సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అమెరికాలో జాబ్ వరుడుకి వధువు B.Tech., MCA, M.Pharmacy, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి కావలెను. ✆ 77949 11019 [R-1952]

OC వయస్సు 50, బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్‌సెటిల్ వధువు కావలెను.(డైరెక్ట్) సంప్రదించండి: 9490878646 [P-772912]

వరుడు కావలెను



No Caste Bar/1వ, 2వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK. త్వరగా చూసు కునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [H-793456]

రెడ్డి/26yrs/5'4"FairM.Tech/2L PM/కోట్ల ప్రాపర్టీ, కాపు 28y/5'4"B.Tech/18L PM/4 ఎ॥ పార్మ్ ల్యాండ్, Own House గల వధువులకు వరులు కావలెను. PH: 9848226983 [H-793501]

కుల పట్టింపు లేదు/విడో/52y/డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్/1 L PM/Own House/30 ఎ॥ ల్యాండ్స్/5 కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ రిచ్ ఫ్యామిలీ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8019657451 [H-793501]

కాపు/డైవర్సీ/30/5'4"/VFair/B.E/Govt Job (JE) ఇరిగేషన్Dept 70,000/-PM/ Own House (Rents) కోట్ల ప్రాపర్టీ గల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను Ph: 6309344166 [H-793501]

రెండవ పెళ్ళి/విడో/50y/గైనకాలజీ డాక్టర్/ Hyd/ Own House (Rents) పిల్లలులేని/ఏ భాదర బంధీలేని అందమైన ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8519803423 [H-793501]

రెడ్డి/విడో/28y/5'4" FairB.Tech/MBA/SWE/1.5 LPM. కాపు/విడో/26y/5'4"/MBA/Pvt Job/50K PM/Hydలో Own Plots 7 ఎ॥ల్యాండ్ గల అందమైన వధువులకు తగిన వరులు కావలెను. Ph: 9553652167 [H-793501]

FC/విడో/60Y/రిటైర్డ్ పెన్షనర్/రెండు ఇల్లు/ కమర్షియల్ బిల్డింగ్ & రెంట్స్/పొలాలు మంచి ఆర్థిక స్తోమత గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 7702151499 [H-793456]

కాపు/40yrs/ కుల పట్టింపులేదు/2nd మ్యారేజ్, Govt. ఎంప్లాయ్ 50K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9492081545 [H-788687]

2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/35 yrs/ M A English, PhD/ Govt. లెక్చరర్ 2 లక్షలు (pm) పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం Ok) సంప్ర: 7396213324 [H-788687]

కాపు/35 yrs/ కుల పట్టింపులేదు/1st మ్యారేజ్/ ఫెయిర్/ Govt. ఎంప్లాయ్ 60K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 8374802603 [H-788687]

రెడ్డి/30 yrs/ కుల పట్టింపులేదు/1st మ్యారేజ్/ Govt. ఎంప్లాయ్ 40K (pm), వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 32 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 7095282404 [H-788687]

రెడ్డి, డాక్టర్స్/ *28, PG, *36 Divorce, PG *51, Divorce, Elite ప్రొఫైల్. WhatsApp 9392023911 (రెడ్డి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్, విదేశీ రిచ్ Matches కు కాంటాక్ట్). [HA-11784]

రెడ్డి/ 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి ప్రసక్తిలేదు/ వయసు: 30, చదువు: డిగ్రీ / సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok). Ph: 8143011223 [HA-11784]

రెడ్డి/60yrs/5'4", V.Fair, సొంత ఇల్లు, రెంట్స్, బిజినెస్, 15 ఎకరాల పొలం గల వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపులేదు. Ph: 7730088968 [HA-11784]

కుల, ఆస్తి పట్టింపులేదు/బిజినెస్, జాబ్, 2L pm, 6 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1, 2వ వరుడు కావలెను. ముఖాముఖి కల్పించబడును. ఇల్లరికం Ok. ఖచ్చితంగా కుదుర్చబడును. Ph: 9704477206 [H-793456]

రెడ్డి/విడో/ఒంటరి/53/ఇంటర్ డెయిరీ ఫామ్ (సొంత క్లాత్ షోరూం/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్), (నో బ్రోకర్స్). Ph: 7799083500 / 7386660643 [H-793456]

రెడ్డి/51yrs/ విడో/ డిగ్రీ/ ప్రైవేట్ జాబ్/ సొంత ఇల్లు/ 9 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9703982351 [H-793456]

రజక: ఏకైక కుమార్తె/ M.Sc/ Agri/ Govt.AEO/ అగ్రికల్చర్ Dept / 45,000/- pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [H-14773]

SC హిందు మాదిగ: B.Tech/ C.Govt. P.O/ SBI/ 50,000/- pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [H-14773]

యాదవ: B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ జెన్‌కో/ 70,000/- PM/ 5'5" ఎత్తు/ 27 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9963757612 [H-14773]

రెడ్డి: చాలా అందమైన/వయస్సు: 26 5'5"/ B.Tech/ MS(USA)/ Good Family కోట్ల ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793360]

విశ్వబ్రాహ్మణ (గోల్డ్‌స్మిత్): వయస్సు: 35/ రెండవ పెళ్ళి/పిల్లలు లేరు/గుడ్‌లుకింగ్/ చదువు డిగ్రీ/గవర్నమెంట్ జాబ్/ సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-793360]

కులపట్టింపు లేదు: వయస్సు: 42/ ఎత్తు 5'5"/MA/గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. మొదటి/ 2వ పెళ్లైనా OK Ph: 8367619529 [H-793360]

రెడ్డి/40yrs/5'4"/కుల పట్టింపు లేదు/ ఫెయిర్/ PG/ Govt.ఎంప్లాయి/75K. PM బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [HA-14776]

రెండో పెళ్లి/62y & 60y & 59y & 58y & 56y & 55y & 54y & 52y & 50y & 49y&48y&46y&45y& 44y &42y& 41y&39y&37y&35y&33y& 31y&29& 27Y & 25y/ "మా సేవ" (Since: 1998). Ph/WA: 9291503949 [HA-14776]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc "27/5'4"/MBA "30/5'3"/ B.Sc "27/5'2"/ఇంటర్ "32/5'2"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/పురోహితులకు మ్యారేజ్ త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14776]

యాదవ/B.Tech /SWE / 40,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400, 7842467591 [HA-14776]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/A:30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకు 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 9121300377 [HA-14776]

రెడ్డి /32/ డిగ్రీ. రెడ్డి/34/ ఇంటర్ లేట్ మ్యారేజ్ వధువులకు రెడ్డి కులమునకు చెందిన వరులు కావలెను. సంప్రదించండి. 89855 87754. [L-798815]

★

హిందూ/SC/ఆది ఆంధ్ర/ఇంటర్/ 43y/ 5'3"/ లేట్ మ్యారేజ్ వధువుకు Hydలో 40K పైన జీతం జాబ్ ఉన్న అప్పర్‌క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. Ph: 9502172967 [H-189524]

పద్మశాలి: 26Y, ఎత్తు 5'5", ఫేర్ కలర్, సాఫ్ట్‌వేర్ జాబ్ గల వధువుకి తగిన వరుడు కావలెను. సెల్: 7730883543, 7095392432. [W-189182]

★★

పద్మశాలి, క్రిస్టియన్, డైవర్సీ (BPT, MIAP) 30 yrs, 5'.1", Good Look, ఇన్‌కం, 35,000/- (PM), Property : 50 Lakhs, Girl. 5 Yrs, No Caste, No Brokers, VJA ✆ 94946 50753 [B-1210228]

ఆదర్శవంతమైన ఆధ్యాత్మికమైన కాపు వరుడు కావలెను. అందమైన విద్యావంతురాలైన ఐశ్వర్య వంతురాలైన 28 సం॥ విశాఖపట్నం మూగ వధువుకి. Cell: 7032375388, 8341014640 [S-771189]

వేదికలు



పెళ్లి లేటా? డోంట్ వర్రీ! మేము శ్రద్ధతో, మంచి సర్వీస్‌తో తగిన Match ని చూస్తాము. అన్ని కులాలు, వయస్సుల, ప్రాంతాల వారికి, Registration కోసం WhatsApp 6304826162 చేయండి. (మీ పెళ్లి మా బాధ్యత). [HA-11784]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14777]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP, TS 15 సం॥ Exp. Ph: 8712384555 [H-30503]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd పేర్/విడో సంబంధాలకై సం॥ S.వాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-788919]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-189422]

18 సం.ల అనుభవం. జాతక లగ్నంలో వివాహ సమస్య-పరిష్కారములతో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI,Govt., రిచ్ వార్కి పెళ్లి సంబంధాలు ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, ఒక నమ్మకం. నమో వెంకటేశాయ. 7093722724. [T-1953]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10275]

★

1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. సెల్: 7730883543, 7095392432. [W-189182]

★★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-500]

హిందూ, క్రైస్తవ, మాలల వివాహ పరిచయ వేదిక కళ్యాణ మాల 14-10-2023 శనివారం ఉ. 10 గం. నుండి 2 గం. వరకు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, రామారావుపేట, కాకినాడ. ✆ 9440545049 [B-788195]

టీడీపీ నేత బండారును అరెస్టు చేయండి

డీజీపీని కోరిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్కే రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం డీజీపీకి రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. మంత్రి రోజా పట్ల బండారు మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందని, ఎంతమాత్రం సహించరానిదని, తక్షణమే కేసు నమోదు చేసి బండారును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులుగా ఉన్న మహిళల పట్ల కూడా క్రూరంగా వ్యవహరిస్తున్న బండారువంటి మాజీ మంత్రుల బండారాన్ని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ దృష్టికి తీసుకెళుతూ లేఖ రాసినట్లు వాసిరెడ్డి పద్మ తెలిపారు. మరో వైపు మహిళా కమిషన్ సభ్యులు కె.జయశ్రీ, గజ్జల లక్ష్మి, గెడ్డం ఉమ, బూసి వినీత, రోఖియా బేగం మంత్రి రోజాకు సంఘీభావం తెలిపారు.

• తెలంగాణ

బీఎస్సీ, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ శనివారం మొదటి విడత నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ (బీఎస్సీ నర్సింగ్) నాలుగేళ్ల డిగ్రీ కోర్స్, పోస్ట్ బేసిక్ బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ రెండేళ్ల డిగ్రీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. తుది మెరిట్ జాబితా, సీట్ల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. నేడు ఉదయం 8 గంటల నుంచి ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చునని పేర్కొంది. పీడబ్ల్యూడీ అభ్యర్థులతో సహా అర్హులైన అభ్యర్థులు అందరూ కోర్స్, కళాశాల వారిగా ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారానికి యూనివర్సిటీ వెబ్సైట్ www.knruhs.telangana.gov.inలో చూడాలని యూనివర్సిటీ పేర్కొంది.

భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

సెప్టెంబర్‌లో ఐదేళ్ల గరిష్టానికి..

- రాష్ట్రంలోనూ రికార్డుస్థాయిలో డిమాండ్ నమోదు
- 2019లో 4,855.8 మిలియన్ యూనిట్లుకాగా ఇప్పుడు 6,550.2 మిలియన్ యూనిట్లు
- 218.34 మిలియన్ యూనిట్లుగా రోజువారీ సగటు డిమాండ్
- విదేశీ బొగ్గు దిగుమతికి 2024 మార్చి వరకు గడువు పొడిగించిన కేంద్రం



సాక్షి, అమరావతి: దేశంలోనూ, రాష్ట్రంలోనూ గడచిన ఐదేళ్లలో ఎన్నడూ లేనంత అత్యధిక స్థాయిలో సెప్టెంబర్ నెల విద్యుత్ వినియోగం నమోదైంది. జాతీయ స్థాయిలో డిమాండ్‌తో పోటీ పడుతున్నది మన రాష్ట్రం. 2019 సెప్టెంబర్ నెల మొత్తం వినియోగం 4,855.8 మిలియన్ యూనిట్లు కాగా రోజువారీ సగటు డిమాండ్ 161.86 మిలియన్ యూనిట్లుగా ఉంది. అదే ఈ ఏడాది అదే నెల మొత్తం డిమాండ్ 6,550.2 మిలియన్ యూనిట్లుకాగా, రోజువారీ సగటు వినియోగం 218.34 మిలియన్ యూనిట్లకు చేరింది. అంటే మొత్తం వినియోగం ఐదేళ్లలో 1,694.4 మిలియన్ యూనిట్లు, సగటు వినియోగం 56.48 మిలియన్ యూనిట్లు పెరిగింది. విద్యుత్ వినియోగం పెరుగుతున్నదంటే ఆ మేరకు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు వృద్ధి చెందుతున్నాయని అర్థం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పేదలకు ఉచిత, సబ్సిడీ విద్యుత్‌ను ఇవ్వడంతో పాటు వ్యవసాయానికి పూర్తిగా ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల కూడా విద్యుత్ వాడకం పెరిగింది. దీనివల్ల వ్యవసాయం సక్రమంగా జరిగి పంటలు సంవృద్ధిగా పండుతున్నాయి. వివిధ వర్గాల ప్రజలు తమ వృత్తులను నిర్వర్తిస్తూ, విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఆర్థికంగా స్థిరపడుతున్నారు. ఇవన్నీ రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

గడచిన ఐదేళ్లలో (సెప్టెంబర్ నెల) రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుదల(మిలియన్ యూనిట్లలో)..

ఏడాది	రోజువారీ సగటు	నెల మొత్తం
2019	161.86	4,855.8
2020	165.98	4,979.5
2021	189.35	5,680.4
2022	199.62	5,988.5
2023	218.34	6,550.2

విదేశీ బొగ్గుకు అనుమతి పొడిగింపు..

దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ 142 బిలియన్ యూనిట్లకు చేరుకుంది. గడచిన ఐదేళ్లలో ఇదే గరిష్టం. ఆగస్టులో గరిష్ట విద్యుత్ డిమాండ్ 238 గిగావాట్లు జరిగితే సెప్టెంబరులో అది 240 గిగావాట్లకు చేరుకుంది. పెరుగుతున్న ఈ డిమాండ్‌ను తీర్చడానికి విద్యుత్ సంస్థలు స్వల్పకాలిక విద్యుత్ మార్కెట్లో తరచుగా విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయితే ఆగస్టులో బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.9.60 ఉండగా సెప్టెంబర్‌లో యూనిట్ రూ.9.37గా ఉంది. థర్మల్ పవర్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు తగ్గాయి. రాష్ట్రంలోనూ, దేశంలోనూ వారం రోజులకు సరిపడా నిల్వలు మాత్రమే ఉన్నాయి. దీంతో బొగ్గు కొరతను తీర్చేందుకు దిగుమతి చేసుకున్న బొగ్గు (విదేశీ బొగ్గు)ను సమకూర్చుకోవడానికి వచ్చే ఏడాది మార్చి 2024 వరకు కేంద్రం గడువు పొడిగించింది.

ఫేక్ లోన్ యాప్‌లతో జాగ్రత్త!

సైబర్ నిపుణుల హెచ్చరిక.. ప్రముఖ సంస్థల పేర్లతో ప్రకటనలిస్తున్నాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వేధింపులకు, ఆర్థిక మోసాలకు పాల్పడే ఫేక్ లోన్ యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆన్‌లైన్ రుణ యాప్‌లు ప్రముఖ కంపెనీల పేర్లను సైతం వాడుకొని ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తున్నాయని వారు పేర్కొన్నారు. రూపీ ప్రో అనే ఆన్‌లైన్ రుణ యాప్ బజాజ్ ఫైనాన్స్ పేరును వినియోగించినట్లు కేంద్ర హోంశాఖ ఇప్పటికే గుర్తించింది. ఫేక్ యాప్‌ల వివరాలను ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడిస్తోంది. చైనా సహా శత్రుదేశాల నుంచి కొన్ని సంస్థలు ఆన్‌లైన్ రుణ యాప్‌లను నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాటి సర్వర్లు ఆయా దేశాల్లో ఉంటున్నందున బాధితులు మోసపోయినప్పుడు కేసుల దర్యాప్తు సైతం కష్టసాధ్యమని వారు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో రుణం తీసుకొనే ముందు యాప్‌ల వివరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

కేంద్ర హోంశాఖ గుర్తించిన నకిలీ రుణ యాప్‌లు	ఐహెరి లెండ్స్, క్యాష్ పార్క్, ఆన్‌లైన్ రూపీ ప్రో, మొబాబా కాయిన్స్, ఫిన్‌కాష్, లోన్‌బడ్డీ.

ఫేక్ రుణ యాప్‌ల బారిన పడకుండా ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- వెరిఫై చేయని ఆన్‌లైన్ రుణ యాప్‌లను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవద్దు.
- ఆర్బీఐ రిజిస్టర్డ్ బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో అఫిలియేషన్ లేకపోయినా అది మోసపూరిత ఆన్‌లైన్ లోన్ యాప్‌గా గుర్తించాలి.
- తక్కువ మంది యూజర్లు, ప్రతికూల రేటింగ్స్ ఉన్న యాప్‌ల జోలికి వెళ్లవద్దు.
- రుణం ఇచ్చేందుకు నిబంధనలేమీ లేకుండా వెంటనే సొమ్ము ఖాతాలో జమ చేస్తామని పేర్కొనే యాప్‌లు నకిలీవేనని తెలుసుకోవాలి.
- బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ లేకుండా, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోన్ ఇస్తామంటే అనుమానించాలి.

నీటి కేటాయింపులు.. ఆ ఆరు ప్రాజెక్టులకే పరిమితం

విభజన చట్టం వచ్చాక చేపట్టిన వాటికి నీటి కేటాయింపు చేయలేమన్న కేడబ్ల్యూడీటీ-2

- తన విచారణ పరిధి కేవలం చట్టంలో 11వ షెడ్యూల్లోని ఆరు మాత్రమేనని ట్రిబ్యునల్ స్పష్టం చేసిందంటున్న నిపుణులు
- ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ-1 కేటాయించిన 811 టీఎంసీలను కొనసాగించిన కేడబ్ల్యూడీటీ-2
- అదనంగా 194 టీఎంసీల మిగులు జలాలు ఉమ్మడి రాష్ట్రానికి కేటాయిస్తూ తుది తీర్పు
- అందులో తెలుగుగంగకు 25 టీఎంసీలు
- ఇక మిగిలిన 169 టీఎంసీల మిగులు జలాలను ఆరు ప్రాజెక్టులకే సర్దుబాటు చేసే అవకాశం



సాక్షి, అమరావతి: రెండు రాష్ట్రాల్లో నీటి కేటాయింపుల్లేని ఆరు ప్రాజెక్టులకు కేటాయింపులు చేయడం పైనే కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2 పరిమితమైందని న్యాయ, సాగునీటిరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విభజన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసే అధికారం తమకు లేదంటూ 'పాలమూరు-రంగారెడ్డి' పథకంపై చేసిన విచారణలో ట్రిబ్యునల్ తేల్చిచెప్పడమే అందుకు నిదర్శనమని చెబుతున్నారు. విభజన చట్టం 11వ షెడ్యూలులో ఏపీలోని హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, వెలిగొండ.. తెలంగాణలోని నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులకే పరిమితం కానుంది. ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ-1 ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులకు రెండు రాష్ట్రాలు కట్టుబడాలని విభజన చట్టంలో సెక్షన్-89లో కేంద్రం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో కేడబ్ల్యూడీటీ-1 ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నికర జలాలు 811 టీఎంసీల జోలికి కేడబ్ల్యూడీటీ-2 వెళ్లే అవకాశంలేదు. ఉమ్మడి రాష్ట్రానికి మిగులు జలాలు 194 టీఎంసీలను కేడబ్ల్యూడీటీ-2 కేటాయిస్తూ 2013లో తుది నివేదిక ఇచ్చింది. ఇందులో తెలుగుగంగకు 25 టీఎంసీలు కేటాయించింది. విభజన నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను సెక్షన్-89 ద్వారా కేంద్రం ఆ ట్రిబ్యునల్‌కే కట్టబెట్టింది. దాంతో 2016 నుంచి రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై కేడబ్ల్యూడీటీ-2 విచారణ జరుపుతోంది.

ఏపీకి 125.5.. తెలంగాణకు 47 టీఎంసీలు

విభజన చట్టం 11వ షెడ్యూలులో కేంద్రం ఆమోదించిన తెలుగుగంగకు తుది తీర్పులోనే 25 టీఎంసీలను కేడబ్ల్యూడీటీ-2 కేటాయించింది. శ్రీశైలం నుంచి 29 టీఎంసీల కృష్ణా వరద జలాలకు 30 టీఎంసీల పెన్నా జలాలు జతచేసి తెలుగుగంగ ప్రాజెక్టును చేపట్టారు. అంటే.. తెలుగుగంగకు మరో 4 టీఎంసీలు అవసరం. శ్రీశైలం నుంచి 40 టీఎంసీలు తరలించేలా హంద్రీ-నీవా, 38 టీఎంసీలు తరలించేలా గాలేరు-నగరి, 43.5 టీఎంసీలు తరలించేలా వెలిగొండను ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఏపీకి 125.5 టీఎంసీలు అవసరం. మరోవైపు.. ఉమ్మడి రాష్ట్రంలో జూరాల నుంచి 22 టీఎంసీలు తరలించేలా నెట్టెంపాడు, శ్రీశైలం నుంచి 25 టీఎంసీలు తరలించేలా కల్వకుర్తి ఎత్తిపోతలను చేపట్టారు. ఈ రెండు ప్రాజెక్టులకు తెలంగాణకు 47 టీఎంసీలు అవసరం. రెండు రాష్ట్రాల అవసరాలను పరిగణలోకి తీసుకుంటే 172.5 టీఎంసీలు అవసరం. కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన మిగులు జలాలు 169 టీఎంసీలను.. ఆ ఆరు ప్రాజెక్టులకు ఆ ట్రిబ్యునల్ ఇప్పుడు సర్దుబాటు చేయనుందని నిపుణులు చెబుతున్నారు.

కొత్త ప్రాజెక్టులకు కొత్త ట్రిబ్యునలే..

ఇక విభజన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రెండు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై కొత్తగా ఏ ప్రాజెక్టు చేపట్టినా.. ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను కృష్ణా బోర్డు, కేంద్ర జల సంఘంతో మదింపు చేయించుకుని, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలి. అపెక్స్ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయానికి రాని ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల కోసం అంతరాష్ట్ర నదీ జల వివాదాల చట్టం-1956 ప్రకారం కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని విభజన చట్టంలో కేంద్రం స్పష్టంచేసింది. విభజన తర్వాత తెలంగాణ సర్కార్ 'కృష్ణా'పై చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, డిండి, తుమ్మిళ్ల, భక్తరామదాస, నెట్టెంపాడు, కల్వకుర్తి (సామర్థ్యం పెంపు), మిషన్ భగీరథలకు నీటి కేటాయింపులపై విచారణ చేయాలంటే కొత్త ట్రిబ్యునల్‌ను వేయాల్సి ఉంటుందని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

క్లుప్తంగా...

3 నుంచి ఎఫ్‌ఏ 2 పరీక్షలు

14 నుంచి 24 వరకు దసరా సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి 6 వరకు పాఠశాల విద్యాశాఖ ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)–2 పరీక్షలు నిర్వహించనుంది. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రశ్నాపత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయి. ప్రశ్నాపత్రాలను పరీక్ష జరిగే రోజు మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు పంపిస్తారు. పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ప్రశ్నాపత్రాలు పంపాలని ఇప్పటికే ఎంఈవోలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రోజుకు రెండు పరీక్షలు ఉదయం, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు ఉంటాయి. ఒకటి నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొక పరీక్ష నిర్వహిస్తారు. 10వ తేదీలోగా సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందిస్తారు. అలాగే ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ మార్కులు నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తెలియజేయాలని సూచించింది. కాగా, ఈ నెల 14 నుంచి 24 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది.

నేటి నుంచి జాతీయ చెస్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ అండర్–11 చెస్ చాంపియన్‌షిప్ ఆదివారం విశాఖ పోర్ట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఆంధ్ర చెస్ సంఘం, ఆల్ విశాఖ చెస్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 27 రాష్ట్రాలకు చెందిన ఫిడే రేటింగ్ చిన్నారులు పోటీపడనున్నారు. పదకొండు రౌండ్ల పాటు సాగే ఈ పోటీలు 7వ తేదీతో ముగుస్తాయని ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.శర్మ తెలిపారు. విజేతకు రూ.70 వేల ప్రోత్సాహకం అందించనుండగా ఏడు నుంచి ఇరవై స్థానాల్లో నిలిచిన బాల బాలికలకు సైతం రూ.పదేసి వేల ప్రోత్సాహకం అందించనున్నామన్నారు. 386 మంది అండర్ 11 బాలబాలికలు పోటీ పడుతున్నారు. టోర్నీ టాప్ రేటింగ్‌తో కర్ణాటకకు చెందిన అపార్ పోటీ పడుతుండగా ఏపీ తరఫున అందాలమాల 17వ ర్యాంక్‌తో ఎత్తులు ప్రారంభించనున్నారు.

'గ్లోబల్ నర్సింగ్' అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అవార్డు గ్రహీతకు రూ.2 కోట్లు బహుమతి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆస్టర్ డీఎం హెల్త్ కేర్ సంస్థ ఏటా అందించే గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ అజాద్ మూపెన్ శనివారం తెలిపారు. ఉత్తమ సేవలు అందించే నర్సును ఈ అవార్డుకు ఎంపిక చేసి, అవార్డుగా రూ.2 కోట్లు నగదు బహుమతిగా అందిస్తామని తెలిపారు. నవంబరు 15 లోపు www.asterguardians.com లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సైనికుల ఆహారంలో సిరిధాన్యాల వినియోగం


కేంద్ర రక్షణ సహాయమంత్రి అజయ్‌భట్



సదస్సును ప్రారంభిస్తున్న అజయ్‌భట్ తదితరులు

మైసూరు: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పనిచేస్తోన్న సైనికుల ఆరోగ్యాన్ని పెంపొందించేలా సిరిధాన్యాలను ఆహారంలో వినియోగిస్తామని కేంద్ర రక్షణ, పర్యాటక శాఖల సహాయ మంత్రి అజయ్‌భట్ చెప్పారు. శనివారం మైసూరులో కేంద్ర రక్షణ ఆహార పరిశోధనా ప్రయోగాలయం (డీఎఫ్ఆర్ఎల్)లో మిలిటరీ రేషన్, పౌష్టికాంశాలతో కూడిన సిరిధాన్యాలు అనే అంశంపై 2 రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే సైనికుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా కష్టమైన పనన్నారు. అత్యంత ఎత్తైన సియాచిన్ లాంటి ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి గస్తీ కాస్తుంటారని చెప్పారు. కార్యక్రమంలో పద్మశ్రీ ఖాదర్ వలి తదితరులు ప్రసంగించారు.

ముళ్లపూడి నరేంద్రనాథ్‌కు శాస్త్రవేత్తల అభినందనలు



చెన్నైలో ముళ్లపూడి నరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న శాస్త్రవేత్తల సంఘం ప్రతినిధులు

తణుకు : ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్‌కు ఇంధనం సరఫరా చేసిన ఆంధ్రా సుగర్స్ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్‌ను దక్షిణ భారత, చక్కెర శాస్త్రవేత్తల సంఘం (సిస్టా) ఘనంగా సత్కరించింది. చెన్నైలో శుక్రవారం నుంచి ప్రారంభమైన 52వ సిస్టా వార్షిక సదస్సులో పాల్గొన్న నరేంద్రనాథ్‌కు శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పాల్గొన్నారు.

ఎదుగుదల వాయిదా!



బాపట్లకు చెందిన చిట్టిబాబు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. వయసు 40 దాటడంతో ఆరోగ్యంపై దృష్టిపెట్టాలనుకున్నాడు. 'రేపటి నుంచి మార్నింగ్ వాక్ చేయాలి'.. అని నిర్ణయం తీసుకుని ఉదయం 5 గంటలకు అలారం పెట్టుకున్నాడు. తెల్లారింది.. అలారం మోగడం మొదలైంది. నిద్రమత్తులోనే చిట్టిబాబు అలారాన్ని ఆపి.. ఈ రోజు గురువారం.. అటూఇటు కాకుండా ఈ రోజే మొదలెట్టాలా? సోమవారం నుంచైతే ఓ క్రమపద్ధతిలో ఉంటుంది కదా అనుకుని.. వచ్చే సోమవారానికి వాయిదా వేసుకుని మళ్లీ ముసుగుతన్నాడు. సోమవారం ఉదయాన్నే అలారం మోగడంతో భారంగా నిద్రలేచాడు. వాకింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో అతడి మెదడులో తళుక్కున ఓ ఆలోచన మెదిలింది.. ఎటూ మూడు రోజుల్లో ఈ నెల ముగిసిపోతుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వాకింగ్ ప్రారంభిస్తే ఎలా ఉంటుందబ్బా.. అని ఆలోచించాడు. తన ఆలోచన కరక్టే అనిపించింది. ఒకటో తేదీ అయితే లెక్కించుకోడానికి కూడా సులువుగా, అనువుగా ఉంటుందనుకుంటూ.. వాకింగ్‌కు వెళ్లే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఒకటో తేదీ కూడా రానే వచ్చింది.. ఆ రోజు బుధవారం. మరీ వారం మధ్యలో ఎందుకు? సోమవారం నుంచి నడుద్దాంలే.. అని వాయిదా వేశాడు. మళ్లీ సోమవారం రాగానే.. ఆపై సోమవారానికి వాయిదా. ఇలా రెండేళ్లుగా వాయిదాల పరంపర కొనసాగుతూనే ఉంది గానీ.. మార్నింగ్ వాక్‌కు మాత్రం అడుగు ముందుకు పడలేదు. వాకింగ్ మొదలెడదామనుకున్న రోజు రాగానే ఏదో ఒక కారణాన్ని వెతుక్కోవడం.. ఆ సాకుతో వాయిదా వేసుకుని, ఆ క్షణానికి హమ్మయ్యా.. అని ఊపిరిపీల్చుకోవడం పరిపాటిగా మారింది.

– తమనంపల్లి రాజేశ్వరరావు, ఏపీ సెంట్రల్ డెస్క్

- అభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్న వాయిదా సంస్కృతి
- విలువైన సమయాన్ని హరించి వేస్తున్న దుర్వ్యసనం
- మానసిక, శారీరక అనారోగ్యానికి కారణం.. ఈ అలవాటును త్వరగా అధిగమించాలంటున్న మానసిక నిపుణులు
- చేయిదాటిపోతే చికిత్స చేయాల్సిందే..

ఒక్క చిట్టిబాబు విషయంలోనే కాదు.. దాదాపు అందరి జీవితంలోనూ ఏదో ఒక సందర్భంలో ఇలాంటి వాయిదా ఘటనలు ఉండే ఉంటాయి. ఒక్కసారి ఈ వాయిదా సంస్కృతికి అలవాటు పడితే.. మన ఎదుగుదలను, అభివృద్ధిని వాయిదా వేసుకున్నట్టే లెక్క. విలువైన కాలాన్ని హరించి వేస్తుంది. వాయిదా వేయడం.. ఆ సమయానికి ఎంతో రిలీఫ్‌నిస్తుంది.

చేయాల్సిన పనిని 'తర్వాత చేద్దాంలే..' అనుకోవడం ఆ క్షణానికి ప్రశాంతతనిస్తుంది. కానీ ఆ వాయిదా తాలూకు పర్యవసానం నష్టాన్ని కలిగించినప్పుడు తల పట్టుకుని కుమిలిపోతుంటారు. ఇలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదమూ లేకపోలేదని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. చూద్దాంలే.. చేద్దాంలే.. అనేవి జీవితాన్ని వెనక్కి లాగే విషయాలని, వీటి నుంచి ఎంత త్వరగా బయటపడగలిగితే అంత మంచిదంటున్నారు.

మనం ఇలా ఆలోచిస్తే.. మెదడు అలా ఆదేశిస్తుంది..

సాధారణంగా మనకు ఒత్తిడి కలిగించేవాటిని వాయిదా వేయమని మెదడు చెబుతుంది. పరీక్షల కోసం చదవడం, ఉదయాన్నే లేచి నడవడం వంటివి మానసికంగా భారంగా ఉండే పనులు. ఎక్కువగా ఇలాంటి వాటినే వాయిదా వేయాలని మెదడు చెబుతూ ఉంటుంది. ఇలాంటి వారిలో ఎక్కువ మంది డిప్రెషన్, మానసిక ఆందోళనల బారిన పడే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఫోన్‌లో మునక నుంచి బయటికొద్దాం..



ఏ పనినైనా అనుకున్న సమయానికి పూర్తిచేయాలంటే ఫోన్‌కు దూరంగా ఉండటం మంచిది. ఫోన్ అనేది మనకు తెలియకుండానే సమయాన్ని హరిస్తుంది. మనలో అంతులేని బద్ధకానికి కారణమవుతుంది. ఫోన్ చేతిలో ఉందంటే చాలు.. ఇక ఏపనైనా 'ఆ చేయొచ్చులే..' అనిపించే నీరసం, 'ఇప్పుడే చేయాలా..' అనేంత బద్ధకం, 'చేయలేక చస్తున్నా..' అనుకునేంత నిస్తేజం మనల్ని ఆవహించేస్తాయి. అందుకే ఫోన్‌కు దూరంగా ఉంటే ఈ వాయిదా అలవాటు నుంచి బయటపడే అవకాశం ఉంది.

అందరిలో ఉండే లక్షణమే గానీ..



పనులు వాయిదా వేయడం అనేది టైం మేనేజ్‌మెంట్ సమస్య అని చాలామంది అనుకుంటారు. వాస్తవానికి ఇది ఎమోషనల్ రెగ్యులేషన్ సమస్య. ఏదైనా ఒక పని మనలో ఒత్తిడిని కలిగిస్తే.. మెదడులోని దానికి సంబంధించిన భాగం ఆ పనిని వాయిదా వేయాలని ప్రేరేపిస్తుంది. దీంతో మనం ఆ పనిని వాయిదా వేస్తాం. అందుకే వాయిదా వేయడాన్ని ఓ డిఫెన్స్ మెకానిజంగా పరిగణించవచ్చు. ఇది అందరిలో ఉండే లక్షణమే గానీ, ఇది క్రానిక్‌గా మారినప్పుడు మాత్రం సైకాలజిస్టులను సంప్రదించాల్సి ఉంటుంది. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, మైండ్ ఫుల్‌నెస్ ట్రైనింగ్, బిహేవియర్ షేపింగ్, ఎపిసోడిక్ ఫ్యూచర్ థింకింగ్ వంటి పద్ధతులు ఉపయోగించి వాయిదా వేసే లక్షణాన్ని సైకాలజిస్టులు తగ్గిస్తారు. – బి.కృష్ణ, సైకాలజిస్ట్

మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువ



పనులు వాయిదా వేయడం అనేది మెదడులోని లింబిక్ సిస్టం, ప్రీ ఫ్రాంటల్ కార్టెక్స్ మధ్య ఘర్షణతో సంభవిస్తుందని న్యూరో సైన్స్ చెప్తుంది. ఈ లక్షణం విద్యార్థుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్‌లో 81 శాతం మంది పనులు వాయిదా వేస్తున్నారని ఒక సర్వేలో తేలింది. పనులు వాయిదా వేయడానికి కొన్ని మానసిక కారణాలున్నాయి. మోటివేషన్ లేకపోవడం, ఓటమి భయం, ఒత్తిడి, స్వీయ విమర్శలు తదితరాలు ఓ వ్యక్తి పనులు వాయిదా వేయడానికి కారణమవుతాయి. వాయిదా లక్షణం మహిళల కంటే పురుషుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వాయిదా వేసే లక్షణం దైనందిక జీవితానికి ఇబ్బంది కలిగించే స్థాయికి చేరుకుంటే మానసిక నిపుణులను సంప్రదించడం మంచిది.

– బి.అనితజ్యోతి, సైకాలజిస్ట్

'వాయిదా'పై నిపుణులు ఏమంటున్నారంటే..

- ఒక పనిని వాయిదా వేయడానికి ముఖ్య కారణం ఆ పని చేయడానికి ఆసక్తి లేకపోవడంతో పాటు ఉత్సాహ లేమిని కూడా ఓ కారణంగా చెప్పొచ్చు.
- మనం ఇంతకు ముందు చెప్పుకొన్నట్టు ఆ పని మనకు ఒత్తిడి కలిగించేది, లేదా మానసికంగా భారంగా అనిపించేదై ఉంటుంది.
- ఒక పనిని ఒక్కసారి వాయిదా వేశామంటే.. మళ్లీ మళ్లీ వాయిదా వేసేందుకే మన మెదడు మొగ్గు చూపుతుంది.
- బద్ధకం, సోమరితనం కూడా ఈ వాయిదా పరంపరకు ప్రధాన కారకంగా నిలుస్తున్నాయి.
- అసలు ఎలాంటి కారణం లేకుండా కూడా పనులు వాయిదా వేస్తూ అదో రకమైన మానసిక ఆనందాన్ని పొందుతుంటాం.



చాలా కోల్పోతున్నాం

- వాయిదా వేసిన పనిని పూర్తిచేయలేక దాని తాలూకు నష్టాన్ని మూటగట్టుకుంటాం.
- వాయిదాల వల్ల తరచూ ఇలానే జరగడంతో ఆందోళన, భయానికి లోనవుతాం.
- మనమీద మనకు నమ్మకం సన్నగిలి.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాం.
- ఇది మన నిద్రను ప్రభావితం చేస్తుంది. మనకు నిద్రలేని రాత్రులను మిగులుస్తుంది.
- ఫలితంగా మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది..

ఇలా అధిగమిద్దాం..

- ఒక పనిని చేయడంలో హాయిని అనుభవించాలి గానీ.. ఒత్తిడిని దరిచేరనీయ కూడదు.
- ఈ వాయిదా వేయడం అనే దాన్ని మన ఎదుగుదలను నియంత్రించే రుగ్మతగా భావిస్తూ.. దాని బారిన పడకుండా ఉండాలంటూ మనసుకు ఆదేశాలిచ్చుకుంటూ.. మనసును పూర్తిగా మన నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఏదన్నా పని మొదలెట్టామంటే.. దానికి అంకితమైపోవాలి. అది పూర్తయిందాకా వెనకడుగు వేయకూడదు.
- వాయిదా సంస్కృతి అనేది మన ఉన్నతిని, ఎదుగుదలను నిలువరించే ఓ సోమరిపోతు. ఈ జీవన పరుగు పందెంలో తోటివారితో పాటు మన అడుగుల్ని ముందుకు పడనీయకుండా అనుక్షణం వెనక్కి లాగుతూ.. మనల్ని ఓ మాయా ప్రపంచంలోని నిష్క్రియా స్థితికి తీసుకెళ్లే ఓ మత్తుమందు. దీని విషయంలో మనం అప్రమత్తంగా, అనుక్షణం జాగరూకతతో ఉండాలి.



- పనిని విభజించుకోవాలి. ఓ టైం టేబుల్ వేసుకుని ఆ సమయానికి ఎట్టి పరిస్థితుల్లో ఆ పనిని పూర్తిచేసి తీరాలి.
- ఒక సామెత చెప్పినట్టు.. రేపు మనం చేయాలనుకుంటున్న పనిని ఈ రోజే.. ఈ రోజు ఏం చేయాల్సి ఉందో దానిని ఇప్పుడే చేసెయ్యాలి.
- పోషకాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా యోగా లేదా వ్యాయామం, ధ్యానం చేయాలి.

గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు

▶ మొదటి పేజీ తరువాయి

కీలకం కానున్నారు. ఈ ప్రతిపాదనల ఫైలుకు సీఎం జగన్ ఆమోదించారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుకు ముందుకు ఏపీలోని గ్రామ పంచాయతీల్లో గ్రేడ్ 1, 2, 3, 4 కేటగిరీ పంచాయతీ కార్యదర్శులు మాత్రమే పనిచేస్తుండేవారు. అప్పట్లో కొన్ని చోట్ల..మూడు నాలుగు పంచాయతీలకు కలిపి ఒకే పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహించేవారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు సమయంలో ప్రతి 2,000 జనాభాకు ఒక గ్రామ సచివాలయాలం చొప్పున ఏర్పాటు చేసి, గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం నియమించింది. వీరికి మిగిలిన 4 కేటగిరి పంచాయతీ కార్యదర్శుల తరహా జాబ్‌చార్ట్ నిర్ధారణ జరిగినప్పటికీ..అప్పట్లో సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు కాలేదన్న కారణాలతో వీరికి డీడీవో అధికారాలను పూర్తిస్థాయిలో అప్పగించ లేదు. సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ పూర్తి విధివిధానాలతో త్వరలో ఉత్తర్వులు వెలువరించనుంది.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

డీడీవో బాధ్యతలు అప్పగించడం ద్వారా గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసిన సీఎం జగన్‌కి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– బత్తుల అంకమ్మరావు, విప్పర్తి నిఖిల్ కృష్ణ, డాక్టర్ బీఆర్ కిషోర్ (గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం)

ధన్యవాదాలు సీఎం సార్..

గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రతి సమస్యపై అత్యంత సానుకూలంగా స్పందిస్తున్న సీఎం జగన్‌కు ఎప్పటికీ కృతజ్ఞులమై ఉంటాం.

– ఎండీ జానిపాషా, గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్

న్యాయం చేశారు

మా విజ్ఞప్తిని మన్నించి న్యాయం చేసిన సీఎం జగన్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్‌కు కృతజ్ఞతలు.

– కాకర్ల వెంకట రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

ఇక పేదల ఇళ్ల స్థలాలకూ 'భూదాన్' భూములు

సాక్షి, అమరావతి: పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా భూములకు సంబంధించి పలు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భూదాన్ బోర్డు విషయంలోనూ అదే ఒరవడిని కొనసాగించింది. భూదాన్ బోర్డుకి సైతం పేదలకు ఇళ్ల స్థలాలిచ్చే అధికారాన్ని ఇచ్చింది. ఇందుకోసం 1965 ఏపీ భూదాన్, గ్రామదాన్ చట్టాన్ని సవరించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందింది. భూస్వాములు తమకున్న భూమిలో కొంత పేదలకు ఇవ్వాలని కోరుతూ 1950వ దశకంలో గాంధేయవాది ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమాన్ని చేపట్టారు. ఆయన స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా పలువురు భూమిని దానం చేశారు. ఇలా సంపన్నులు దానం చేసిన భూములను పేదలకు పంచే విధానాన్ని సూచిస్తూ కేంద్రం భూదాన్, గ్రామదాన్ చట్టాన్ని రూపొందించగా దానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాలు చట్టాలను చేసుకున్నాయి. మన రాష్ట్రం కూడా 1965లో ఏపీ భూదాన్, గ్రామదాన్ చట్టాన్ని చేసింది. దాని ప్రకారం భూదాన్ యజ్ఞ బోర్డును నియమించి దాని ద్వారా భూదాన్ భూములకు సంబంధించిన వ్యవహారాలు నడిపారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోని భూదాన్ భూముల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని భూముల వ్యవహారాలన్నింటినీ పరిష్కరించేందుకు ఒక క్రమపద్ధతిలో పనిచేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం భూదాన్ భూముల విషయంలోనూ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌ను నియమించింది. అలాగే భూదాన్ భూముల సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటి ద్వారా పేదలకు ప్రయోజనం కలిగించే ఉద్దేశంతో తాజాగా భూదాన్ చట్టాన్ని సవరించింది. ఆచార్య వినోబా భావే లేకపోతే ఆయన నామినేట్ చేసిన వ్యక్తి సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు భూదాన్ బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను నియమించాలి.

ఇవీ సవరణలు

- గత చట్టంలో భూదాన్ భూమిని వ్యవసాయం, ప్రభుత్వం, స్థానిక సంస్థలు, సామాజిక ప్రయోజనాల కోసం ఉపయోగించాలని నిర్దేశించారు.
- తాజా సవరణలో సామాజిక ప్రయోజనంతోపాటే బలహీనవర్గాలు, పేదల ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించే అధికారాలను భూదాన్ బోర్డుకి ఇచ్చారు.
- గతంలో ఇళ్ల స్థలాలకు కోసం భూదాన్ భూములను వినియోగించే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు వాటికి వినియోగించే అవకాశం ఏర్పడింది.
- వినోబా భావే మృతి చెందిన 41 సంవత్సరాలు దాటిపోవడంతో ఆయన ఎవరిని నామినేట్ చేశారనే దానిపై స్పష్టత లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఒకటి, రెండు సంస్థలు భూదాన్ బోర్డులను ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడడంతో పలు రాష్ట్రాలు చట్టాలను సవరించుకున్నాయి. ఇప్పుడు మన రాష్ట్రంలోనూ ప్రభుత్వమే భూదాన్ బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను నియమించేలా చట్టంలో మార్పు చేశారు.
- భూదాన్ భూమిని పొందిన వ్యక్తి వరుసగా రెండు సాగు సంవత్సరాలు వ్యవసాయం చేయకపోతే ఆ భూమిని స్వాధీనం చేసుకునే అధికారంతోపాటు భూమి పొందిన వ్యక్తి కాకుండా వేరే వ్యక్తులు భూమిపై ఉన్నప్పుడు వారి నుంచి భూమిని తిరిగి తీసుకునే అధికారాన్ని తహసీల్దార్‌కు ఇస్తూ ఇప్పుడు చట్టంలో అవకాశం కల్పించారు. తద్వారా అన్యాక్రాంతమైన భూదాన్ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలు ఏర్పడింది.
- అర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం చేయకుండా ఆగిపోయిన భూదాన్ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు వినియోగించుకునే అవకాశాన్ని చట్టంలో కల్పించారు.

పేదలకు ఇంకా మంచి చేయాలని



సీఎం వైఎస్ జగన్ ఎప్పుడూ పేదల గురించే ఆలోచిస్తారనడానికి ఈ చట్ట సవరణ ఒక ఉదాహరణ. భూదాన్ భూముల సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటి ద్వారా పేదలకు ఇంకా మంచి చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ భూముల వివరాలన్నింటినీ సేకరిస్తున్నాం. సీఎం ఆలోచనలకు అనుగుణంగా భూదాన్ భూములపై నిర్ణయాలు తీసుకుంటాం.

– తాడి విజయభాస్కర్‌రెడ్డి, చైర్మన్, ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు

వైఎస్సార్ స్మృతివనంలో ఆఫ్రికా వృక్షం

6వేల ఏళ్లు జీవించే వృక్ష జాతి

ఆత్మకూరు రూరల్ (నంద్యాల): ప్రపంచంలో అత్యంత ఎక్కువ సంవత్సరాలు జీవించే వృక్ష జాతుల్లో అడెనేషియా సోనియా ఒకటి. ఆఫ్రికా ఖండంలో విస్తారంగా కనిపించే ఈ మహావృక్షం మనదేశంలోనూ అక్కడక్కడా కనిపిస్తుంది. కర్నూలు జిల్లా గార్గేయపురం గ్రామంలో ఒకటి, గ్రామ శివార్లలో కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి పక్కన మరో రెండు వృక్షాలున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఎస్‌పీజీ గ్రౌండ్స్ పక్కనున్న క్రైస్తవ శ్మశాన వాటికలో రెండు వృక్షాలు కనిపిస్తున్నాయి. గార్గేయపురంలో ఉన్న చెట్లలో ఒకదానిని ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిలో అక్కడ నుంచి ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామ శివార్లలో ఉన్న వైఎస్సార్ స్మృతివనంలో పునఃస్థాపించారు. ఆఫ్రికాలోని టాంజానియాలో ఉన్న అడెన్ సోనియా చెట్టు వయస్సు 6వేల ఏళ్లుగా నిర్ధారించి ఇది ప్రపంచంలో ఎక్కువ కాలంగా జీవించిన చెట్టుగా చెబుతున్నారు. వీటిని ఇక్కడ బ్రహ్మమల్లిక, ఏనుగు చెట్టు, పారిజాతంగా పిలుస్తున్నారు.



టాంజానియాలో ఉన్న 6వేల ఏళ్ల అడెన్ సోనియా వృక్షం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943